తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక


SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 11
April - 2026, Price Rs.20/-

ఏప్రిల్ 2026
వెల రూ. 20/-
పుటలు - 56




శ్రీపద్మావతీ శ్రీనివాసుల పరిణయ మహోత్సవం, తిరుమల
(25-04-2026 నుండి 27-04-2026 వరకు)

# శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం, నాగులాపురం

2026, ఏప్రిల్ 30 నుండి మే 09 వరకు




| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 30-04-2026 | గురు | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 01-05-2026 | శుక్ర | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 02-05-2026 | శని | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 03-05-2026 | ఆది | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 04-05-2026 | సోమ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 05-05-2026 | మంగళ | పల్లకీలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 06-05-2026 | బుధ | హనుమద్వాహనం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 07-05-2026 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 08-05-2026 | శుక్ర | రథోత్సవం | అశ్వవాహనం |
| 09-05-2026 | శని | పల్లకీ ఉత్సవం, తీర్థవారి అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

# శ్రీభూసమేత శ్రీ నారాపుర వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం, జమ్మలమడుగు

2026, ఏప్రిల్ 30 నుండి మే 10 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 30-04-2026 | గురు | --- | అంకురార్పణ |
| 01-05-2026 | శుక్ర | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 02-05-2026 | శని | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 03-05-2026 | ఆది | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 04-05-2026 | సోమ | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 05-05-2026 | మంగళ | మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 06-05-2026 | బుధ | సర్వభూపాలవాహనం | కల్యాణం, గజవాహనం |
| 07-05-2026 | గురు | రథోత్సవం | అశ్వవాహనం |
| 08-05-2026 | శుక్ర | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 09-05-2026 | శని | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 10-05-2026 | ఆది | ----- | శ్రీపుష్పయాగమహోత్సవం |





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : ఏషా తేఽ భిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శ్రుణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-39వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పార్థ= ఓ అర్జునా!; సాంఖ్యే= ఆత్మతత్త్వవిషయమునందు; ఏషా= ఈ ప్రతిపాదింపబడిన; బుద్ధి= జ్ఞానము; తే= నీకు; అభిహితా= చెప్పబడినది; యయా బుద్ధ్యా= ఎట్టి వివేకముతో; యుక్తః= కూడినవాడై; కర్మబన్ధమ్= కర్మబంధమును; ప్రహాస్యసి= వదలగలవో; (తామ్=అట్టి) యోగేతు= కర్మయోగవిషయమందలి; ఇమామ్= ఈ చెప్పబోవు బుద్ధిని (నిశ్చయమును), శృణు= వినుము.

**భావం:** ఓ అర్జునా! ఇంతవరకు సాంఖ్యశాస్త్రమున జెప్పబడిన ఆత్మతత్త్వ నిశ్చయమును దెలిపియుంటిని. ఇక యోగశాస్త్రమందలి కర్మయోగసంబంధమైన వివేకమును నీకు దెలుపబోవుచున్నాను. అద్దాని నెఱిఁగినచో నీవు కర్మబంధమునుండి లెస్సగ విముక్తుడవు కాగలవు. కాబట్టి శ్రద్ధతో నాలకింపుము.

## శిన్నెకా.. ఓ శిన్నెకా..!!


శిరుత నవ్వులవాడు శిన్నెక వీడు
వెరపెరగడు సూడవే శిన్నెక ॥

పొలసుమేనివాడు బోరవీపువాడు
సెలసుమోరవాడు శిన్నెక
గొలసుల వంకల కోరలతో బూమి
వెలసినాడు సూడవే శిన్నెక ॥

మేటి కురచవాడు మెడమీది గొడ్డలి
సీటకాలవాడు శిన్నెక
ఆటదానిబాసి అడవిలో రాకాసి
వేటలాడీ సూడవే శిన్నెక ॥

బింకపు మోతల పిల్లగోవివాడు
సింక సూపులవాడు శిన్నెక
కొంకక కలికియై కొసరిగూడెనన్ను
వేంకటేశుడు సూడవే శిన్నెకా ॥

సంపుటం-05, సంకీర్తన-182





విష్ణువు దశావతారాలను వర్ణిస్తూ అన్నమయ్య పాడిన జానపదపాట ఇది. 'శిన్నెక' (చూడు సోదరి) అనే మకుటంతో వ్రాశాడు. వేంకటేశ్వరస్వామిని వర్ణిస్తూ పాడిన పాట ఇది.  ఈ పాటను ఎంతో రమణీయంగా, చమత్కారంగా వర్ణించాడు అన్నమయ్య.

**2026, ఏప్రిల్ 20న అక్షయతృతీయ &**
**సింహాచలక్షేత్ర చందనోత్సవం**
**సందర్భంగా...**

# అభయాక్షయం



– 'ఆంధ్రరత్న' ప్రొ॥ జి.వి.శేషారెడ్డి, 80748 26819

**భా**రతీయ పండుగలలో అక్షయతృతీయ పర్వదినానికి ప్రత్యేకస్థానం ఉంది. ఈ పండుగను వైశాఖమాసమున శుక్లపక్ష తదియన హిందువులు జరుపుకుంటారు. అక్షయము అంటే క్షయము లేకుండా ఉండడం. అంతం లేకుండా ఉండడం అని అర్థం. జీవితంలో అన్నింటినీ అక్షయం చేసే పర్వదినం, పుణ్య దినం అక్షయతృతీయ. ఈ రోజు ఎటువంటి శుభకార్యాలకైనా వారం, వర్జ్యం చూడకుండా జరుపుకోవచ్చు. అక్షయతృతీయ గురించి ప్రస్తావన భవిష్యపురాణంలో ఉంది. శ్రీకృష్ణుడు స్వయంగా ధర్మరాజుతో చెప్పినట్లుగా పేర్కొనబడినది.

ఈ రోజే కృతయుగం ప్రారంభమైనట్లు విష్ణు పురాణంలో చెప్పినప్రకారం ఈ దినం కృతయుగాది. పరమ శివుడి అనుగ్రహంతో కుబేరుడు సంపదలకు అధిపతిగా నియమితుడైన రోజు. శ్రీమహాలక్ష్మిని విష్ణుమూర్తి వివాహం చేసుకున్నది ఈ రోజే. ఈ రోజు చేసే దానాలు, పూజలు, జపాలు రెట్టింపు ఫలితాన్ని ఇస్తాయని స్వయంగా శివుడే పార్వతీదేవితో చెప్పినట్లుగా శివపురాణంలో ఉంది. నిరుపేద కుచేలుడు శ్రీకృష్ణుని అనుగ్రహం పొందిన రోజు. పరశు రాముడు జన్మించిన రోజు. బ్రహ్మదేవుడి కుమారుడు అక్షయ కుమారుడు జన్మించిన రోజు. భగీరథుని తపస్సుచేత గంగాదేవి దివినుంచి భువికి దిగిన రోజు. వ్యాసమహర్షి వినాయకుడి సహాయంతో మహాభారతం వ్రాయడానికి ప్రారంభించిన రోజు. వనవాసం చేస్తున్న పాండవులకు సూర్యభగవానుడు అక్షయ పాత్ర ఇచ్చిన రోజు. జగద్గురువు ఆదిశంకరాచార్యులు కనకధారాస్తోత్రం చెప్పిన రోజు. అన్నపూర్ణాదేవి తన అవతారాన్ని స్వీకరించిన రోజు. ఒడిస్సా పూరీరథయాత్ర నిర్మాణం ప్రారంభించే రోజు.

సింహాచలక్షేత్రంలో సింహాద్రి అప్పన్న నిజరూపదర్శనం మరియు చందనోత్సవం జరిపేరోజు. ఈ రోజు గోదానం చేసిన వారు గోవుకు ఎన్ని వెంట్రుకలు ఉంటాయో అన్ని సంవత్సరాలు స్వర్గంలో విరాజిల్లి తిరిగి భూలోకంలో జన్మించి ముక్తిని పొందుతారు. గోదానంవల్ల నరకంలో ఉన్న పితృదేవతలు స్వర్గం చేరుతారు.

ఈరోజు ఆచరించాల్సిన ప్రధాన విధులు స్నాన, దాన, తప, శ్రాద్ధహోమాలు. తెల్లవారుజామున గంగాస్నానం లేదా గంగానదిని స్మరిస్తూ ఇంటిలోనే శిరఃస్నానం చేసి పితృదేవత లను పూజించి శ్రాద్ధకర్మలను చేయాలి. తర్వాత దేవతాపూజ చేయాలి. నైవేద్యం సమర్పించాలి. ఉప్పులేని భోజనంతో ఒక పూట భోంచేసి ఉపవాసం ఉండాలి. చక్కెర కలిపిన పేలపిండిని స్వీకరించాలి. నవధాన్యాలు, గోధుమలు, గొడుగు, పాదరక్షలు, వస్త్రాలు, గోవు, భూమి, బంగారం వంటివి దానం చేయాలి.

సింహాచలంలో శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామివారు ఒక లింగం మాదిరిగా దర్శనమిస్తారు. కానీ అక్షయతృతీయ రోజు కొన్ని గంటలు మాత్రమే తన నిజరూపంలో వరాహ, నరసింహ సమ్మిళితరూపాలతో భక్తులకు దర్శనమిస్తారు. అది వరాహ నరసింహ అవతారంలో మహాఉగ్రంగా ఉన్న స్వామిని చందనాభిషేకాలతో ప్రహ్లాదుడు శాంతింపజేసినది అక్షయ తృతీయరోజు కనుక ఈ సంప్రదాయం ఇప్పటికీ అలాగే కొన సాగుతున్నది.

ప్రహ్లాదుని అనంతరం స్వామివారు విగ్రహరూపంలో ఒక పుట్టలో చేరారు. ఇది కృతయుగంనాటి కథనం. తర్వాత త్రేతాయుగంలో పురూరవచక్రవర్తి స్వామివారి ఆదేశానుసారం వేయికడవల నీటితోనూ, పంచామృతాలతోనూ అభిషేకం చేసి స్వామిదర్శనాన్ని పొందారు. తన తపస్సుకారణంచేతను, తన క్రోధంకారణంవలన ఏర్పడిన వేడిని చల్లార్చడానికి తనను తీసిన పుట్టమన్నుకు సరిపడా చందనపుపూతను పూయాలని పురూరవుడికి స్వామి చెప్పారు. పురూరవుడు స్వామికి చందన పూతను సమర్పించిన రోజు అక్షయతృతీయ. ఆ విధంగా పురూరవుడికాలంలో స్వామికి సమర్పించిన చందనపుపూత చందనోత్సవంగా రూపుదిద్దుకొంది. అది నేటికీ అలాగే కొన సాగుతున్నది. ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ తదియనాడు అత్యంత వైభవోపేతంగా చందనోత్సవ ప్రక్రియ జరుపుతారు.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 ఏప్రిల్, 2026 సంచిక : 11



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥


గౌరవ సంపాదకులు
శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉప సంపాదకులు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| అభయాక్షయం!! | 'ఆంధ్రరత్న' ప్రొ॥జి.వి.శేషారెడ్డి | 04 |
| పద్మావతిశ్రీనివాసుల ప్రణయం-పరిణయం-పరిణయోత్సవం | డా॥మైలవరపు లలితకుమారి | 07 |
| లోకకల్యాణార్థం! అవతార పరమార్థం!! | డా॥దేవులపల్లి పద్మజ | 10 |
| సందేహాలు-సమాధానాలు | కీ.శే. డా॥ఎస్.బి.రఘునాథాచార్య | 14 |
| మహిమాన్విత మురుగన్ క్షేత్రం తిరుప్పరంకుండ్రం | డా॥ ఎన్.సిహెచ్.సుధామైథిలి | 15 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 17 |
| నడిచేది జీవుడు-నడిపేది దేవుడు | డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్ | 18 |
| నలదమయంతుల దాంపత్యనిష్ఠ | శ్రీ ఎం.వేంకట సత్యరామశేషు | 19 |
| భక్తుడు కూడా భగవత్‌స్వరూపుడే! | శ్రీ వద్దిరాజు జనార్దనరావు | 21 |
| భృగుమహర్షి ముఖతః | శ్రీ పింగళి పాండురంగరావు | 23 |
| శిరీవరమంగై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| అయ్యా! సంకటాలు తొలగించుమయా!! | శ్రీ డి.బి.ఆర్.శర్మ | 31 |
| జెండాపై కోడిపుంజు!! | శ్రీమతి యం.గీతాకుమారి | 33 |
| రెండు వరాలివ్వు చాలు!! | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 35 |
| ప్రేమైక త్యాగశీలి హిడింబి | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 36 |
| నాకు న్యాయం కావాలి!! | శ్రీ యం.రవితేజ | 38 |
| వేలాయుధం! దండనాయుధం!! | శ్రీ ములగలేటి సాయి కృతిక్ | 40 |
| మమ్మల్ని క్షమించండి!! | డా॥కౌలికి శ్రీధరన్ | 41 |
| చదవరో భాగ్యము నెమలి కథ | శ్రీ డి.సాయికృష్ణ మహీధర్ | 42 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 44 |
| కలయో వైష్ణవమాయో!! | శ్రీమతి భీమ రజిని | 45 |
| అక్షరమాల గణేశస్తోత్రం (బాలవినోదం) | సేకరణ, నిర్వహణ: మొలకా ఉత్తరఫల్గుణి<br>చిత్రాలు: డా॥ శ్రీధరన్ కౌలికి | 46 |
| తృప్తికి మించిన ఐశ్వర్యం లేదు!! (చిత్రకథ) | కథ: మొలకా ఉత్తరఫల్గుణి<br>తమిళమూలం: శ్రీమతి శ్రీనిధి<br>చిత్రాలు: శ్రీ కమలకణ్ణన్ | 50 |
| క్విజ్ | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : ఉభయదేవేరులతో శ్రీ మలయప్పస్వామివారు, తిరుమల
వెనుకచిత్రం: శ్రీ అలమేలుమంగ నాచ్చియారు, తిరుచానూరు



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# ఊరక రారు మహాత్ములు

'ఊరక రారు మహాత్ములు నా రథముల
యింద్లకడకు వచ్చున లెల్లం
గారణము మంగళములకు నీ రాక
శుభంబు మాకు నిజము మహాత్మా!'

మహాత్ములు ఊరకనే ప్రయోజనం లేకుండా రారు. వారి రాకవెనుక ఖచ్చితంగా ఏదో ఒక మంగళకరమైన, శుభకరమైన కారణముంటుంది. గొప్పవారు, జ్ఞానులు ఒకచోటికి వస్తున్నారంటే ఆ ప్రదేశం ఆశీర్వదించబడిందని అర్థం.

సనాతన హిందూధర్మమనేది అనంతమైన, కాలాతీతమైన మరియు ఆద్యంతంలేని అత్యున్నత జీవనమార్గం. ఇది కేవలం మతం కాదు. దయ, నిజాయితీ, సద్గుణాలు మరియు ఆత్మనిగ్రహం వంటి సార్వజనీన నియమాలతో కూడిన ఉనికికి సంబంధించిన శాశ్వతధర్మం. సత్యం, కర్మసిద్ధాంతం మరియు ధర్మాచరణపై ఆధారపడి వేదకాలంనుండి నిరంతరాయంగా కొనసాగుతున్న జీవనవిధానమిది.

సనాతనమంటే ఎప్పటికీ మారనిది, పాతది కానిది అని అర్థం. ఇది కాలంతో సంబంధం లేకుండా నిలిచిఉండే ధర్మం. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణ, భారతాలు ఈ ధర్మానికి పునాదులు... ఆత్మయొక్క స్వభావం, జననమరణచక్రం, మోక్షం పొందడం ప్రధానలక్ష్యాలు. సమాజాన్ని, విశ్వాన్ని నిలబెట్టే నియమాలు. ధర్మం, అహింస, దయ, దానం, శుచి, ఇంద్రియనిగ్రహం మరియు జ్ఞానార్జన ప్రధానసూత్రాలు.

ఇది కేవలం పూజలకు పరిమితంకాకుండా ప్రతిజీవియందు దైవాన్ని దర్శించడం, ప్రకృతిని ఆరాధించడం, యోగా మరియు ధ్యానంవంటివి ఇందులో భాగం. భగవద్గీత బోధించినట్లుగా ఫలితాన్ని ఆశించకుండా కర్మచేయడం మరియు ధర్మమార్గంలో నడవడం. ఈ సనాతనధర్మం కాలక్రమేణా మార్పులకు లోనైనా దాని మూలసిద్ధాంతాలు మాత్రం స్థిరంగా ఉంటాయి. అందుకే దీనిని హిందూధర్మం అని పిలుస్తారు.

అలా ఈ ధర్మసంస్థాపనంకోసం ఈ మాసంలో ఆవిర్భవించారు కొందరు మహాత్ములు. వారిలో అందరూ ఆదర్శమూర్తులుగా, శంకరాచార్యులు హిందూధర్మకర్తగా, రామానుజాచార్యులు అష్టాక్షరీమంత్రప్రబోధకర్తగా, తిరుమలస్వామివారి రాకకు కారకుడు, వైఖానసాగమగ్రంథకర్తగా భృగుమహర్షి, ఇంకనూ పరశురాముడు, మొదలియాండాన్, శ్రీనివాసదీక్షితులు, అనంతాళ్వార్, మధురకవిఆళ్వార్, తరిగొండ వెంగమాంబ మొదలైన వారంతాకూడా హైందవధర్మమతవ్యాప్తిలో భాగస్వాములయ్యారు. ఆ వారసత్వాన్ని మనకందించి తమ జన్మను సార్థకం చేసుకున్న ఈ మహాత్ములందరినీకూడా స్మరించుకుంటూ, వారి బాటలో పయనించి, తరిద్దాం.

2026, ఏప్రిల్ 25 నుండి 27 వరకు శ్రీ పద్మావతీ శ్రీనివాసుల పరిణయోత్సవాల సందర్భంగా...

# పద్మావతిశ్రీనివాసుల ప్రణయం- పరిణయం- పరిణయోత్సవం

- డా॥ మైలవరపు లలితకుమారి

ఆకాశరాజు యాగముచేయ సంకల్పించి భూమిని దున్నుతుండగా సహస్రదళములుగల పద్మమునందు అయోనిజగా ఒక బాలిక ఉద్భవించింది. ఆకాశరాజు ఆ బాలికకు పద్మావతియని పేరుపెట్టి పెంచాడు. ఆమె అడుగిడిన మాహాత్మ్యముచే ఆకాశ రాజుకు ఒక బాలకుడు జన్మించాడు.

పద్మావతి దినదిన ప్రవర్ధమానురాలయి షోడశకళలతో ప్రకాశించుచు యవ్వనవతి అయ్యింది.

"వనవిహారము తా జేయవలయుననుచు
జెలులతో ముచ్చటాడి, మచ్చికలు చేసి,
మేదదిగివచ్చితల్లి సమీపమందు
జేరి యిట్లని పలికె నా చిగురుబోణి"



జననీ! కనకసౌధంపైనుంచి శృంగారవనములు ఆశ్చర్యంగా కనిపిస్తున్నాయి. నేనక్కడికి పోయి నీకు పుష్పములు తెస్తానని పలికింది. అది విని నీవు పువ్వులకెళ్తే జనులు నవ్వుతారన్నది ధరణీదేవి. కాని పద్మావతి తల్లి మాటలను లెఖ్ఖచేయక చెలుల వెంటగొని పుష్పోద్యానమున కెళ్లింది.

అదే సమయమున శ్రీనివాసుడు వేటకై ఆ వన సమీప ప్రాంతములకు జవనాశ్వమునెక్కి బయలుదేరాడు. క్రూర మృగములను వేటాడుతుండగా ఒక మదగజము శ్రీనివాసు నెదిరించగా నాతడు దానివెంటబడ్డాడు. తనవెంట వచ్చు హరిని జూచిన కరి తుండమునెత్తి నమస్కరించగా, చక్రి దానిని తరుమక నిలిచాడు. ఆ తర్వాత ఆ హస్తి అక్కడినుండి వెడలిపోయింది.

కాని సమీపముననే పువ్వులుకోయుచున్న పడతులను గాంచి ఓ కన్నియలారా! ఏదైనా మృగము మీవంకకు వచ్చినదా అని ప్రశ్నించాడు. అంత నా కన్యలాతనిని గాంచి ఇది ఆకాశరాజు ఉద్యానవనం. ధనుర్ధారుడవై ఇచ్చటికేల వచ్చావు అన్నారు. తిరిగి వారు ఆ హరితో ఇదంతా మాయగా నున్నది, భ్రాంతిపొందితివా? కలగంటివా? అహ్హహ్హ ఇది ఏమి చిత్రమని ఎకసెక్కములాడారు. చెలులతో చదరంగ మాడుతున్న పద్మావతిని గాంచిన చక్రి ఈ

"తరళలోచన చక్కదనము చూడ
రతికన్న, విమలభారతికన్న మతియు బా
ర్వతికన్న శ్రీరమా వనిత కన్న
నతిశయించిన సౌందర్యవతిగదా!"

అని మదిలోన తలచి ఇంత చక్కని యువతిని మునుపెన్నడు చూడలేదని

"నహహా! యీకాంత రూపంబు నవని మీద
హాటకము మెత్తగా దంచి యమృతరసము
బోసి మెదిచి మహాద్భుతంబుగ సృజియించె నజుండు"

అని మదిలో తలచాడు. చెలులతో తన గోత్ర నామములను వివరించి చెప్పి మీ దొరపట్టికి చెప్పుమన్నాడు. ఆతని మాటలను వినిన పద్మావతి చెలులను పిలిచి నీవు నిషాదుడవయి కల్లలాడుతున్నావన్నది.

"నీవు నాయందు దయయుంచి నిష్ఠురముగ
బలుకకిప్పుడే నన్ను జేపట్టుమనియె"॥ అన్న చక్రి మాటలకు పద్మావతి ఇట్టి క్రూరపుమాటలు పలికిన నిన్ను కొట్టించెద ననుచు చెలులచే ఆ శ్రీహరిని రాళ్లతో కొట్టించింది. ఆ దెబ్బ లను భరించలేని శ్రీకాంతుడు దిక్కులుచూస్తూ భయమును వీడి పద్మావతీ విరహాంతరంగుడై వకుళమాత గృహం జేరాడు.

పద్మావతి చెలులతో మా తల్లిమాట వినక వనము నకు వచ్చిన ఫలితమను అనుభవించినాను. ఈతడాడిన మాటలు మీరు అమ్మకు చెప్పవలదంటూ అంతఃపురము చేరింది.

వకుళమాత ఆశ్రమము చేరిన శ్రీహరి పద్మావతీ విరహతప్తుడయ్యాడు. చింతాక్రాంతుడై శయనించియున్న హరిని గాంచిన ఆ తల్లి తండ్రీ! నీ ఈ చింతకు కారణమేమిటో తెలుపుమన్నది.

అంత ఆ నారాయణుడు వనమున జరిగిన విషయ మంతయు వకుళమాతకు వివరించి, తాను ఆ రాచకన్నియపై మనసుపడితిననియు, ఆమెతో కల్యాణము కావలెననియు, ఆమెపై విరహమే తన ఈ స్థితికి కారణమని చెప్పాడు. ఆమె రూప, లావణ్య సౌందర్య ములు వర్ణించటం ఎవరి తరముగాదు. ఆమెను పొందినగాని నా ప్రాణములు దక్కవన్నాడు. నీవచ్చటికి పోయి కల్యాణము నిశ్చయించుకురమ్మన్నాడు.

పద్మావతి తల్లి ధరణీదేవితో ఉద్యానవనమున సఖులతో నాట్లాడు సమయమున దివ్యపురుషుడొకడు అచటికి వచ్చి ఎకసెక్కము లాడగా అతనిపై రాళ్లు రువ్వించాను.

"రాళ్ళరువ్వింప నేల గుఱ్ఱంబుపడియె
నతడెచట చేరినాడో? నేనదియెఱుంగ
నతని సుందరనీలదేహంబు కనుల
గట్టినట్లిప్పుడున్నదే కన్నతల్లి" ॥

అని తానాతని వరించితినని పలికింది. ఆతడు

"మనుజమాత్రుండు కాడు రమా విభుండు
సర్వజ్ఞుడాఢ్యుండు శాశ్వతుండు"

అందుకే నా మనస్సాతనిమీద లగ్నమయినది.

నా కన్నులనిండా ఆ దివ్యసుందరవిగ్రహము నిండిపోయినది. నేనాస్వామిని మరువలేకున్నాను తల్లీ! అతను లేకుండా నేను మనలేను. ఆతని తప్ప అన్యుల నేను వరింపలేను, వరించనమ్మా. ఆ దివ్యతేజోరూపునితో నా వివాహము చేయుమని తల్లితో పలికినది పద్మావతి.

ఆ సమయముననే వకుళమాత అంతఃపుర మందిరమున కేతెంచినది. ఆమె శ్రీనివాసుని రూపలావణ్య వైభవములను, ఆతని దివ్యతత్త్వము ధరణీదేవికి వివరించినది. నా బిడ్డ ఆ శ్రీనివాసుడు ఉద్యావనమున మీ కన్యను గాంచి వరించినాడు. ఆమెయందు అత్యంత అనురాగబద్ధుడైనాడు. మీ కన్యను మా పుత్రునకిచ్చి వివాహము చేయవలసినదని పలికింది. అప్పుడే అక్కడికొచ్చిన ఆకాశరాజు నాడు నారదుడు




పలికినట్లు తమ మనోభీష్టము తీరు సమయమాసన్నమైనది. సాక్షాత్తు ఆ నారాయణుడే నా ఇంటికి అల్లుడగు భాగ్యము వచ్చినది. అయోనిజయయిన నా కూతురును మీ పుత్రునకిచ్చి కల్యాణ మొనరించెదనన్నాడు.

వకుళమాత ఆనందంతో ఆశ్రమమున కేగింది. పద్మావతికూడ తన మనోరథమీడేరినది గదాయని ఆనందాబ్ధిలో ఓలలాడింది. అంత ఆ శ్రీనివాసుడు శుకుని పిలిపించి సుముహూర్తము నిర్ణయింపచేశాడు. శ్రీనివాసుడు గరుడారూఢుడై బ్రహ్మాదిదేవతలంతా సేవించుచుండగా, పార్షదులతో కూడి, వకుళమాతతో ఆకాశరాజు నగరమునకు వేంచేసినాడు. ఆకాశరాజు సమస్తవాయిద్యఘోషలతో స్వామిని కొని వచ్చి ఘనముగా పద్మావతీ శ్రీనివాసులకు కల్యాణము చేశాడు. అనంతరవేడుకలలో గౌరిదేవి **"ఈశౌరి నిందు మోహమున పెండ్లియాడిన ముద్దుగుమ్మ"** యన దేవతలెల్ల వారికి దీవన లొసగినారు.

తిరుమలలో పద్మావతీపరిణయోత్సవములు వైశాఖ మాసంలో ఘనంగా నిర్వహింపబడుతాయి. వైశాఖ శుద్ధ దశమి పూర్వఫల్గుణినక్షత్రంలో ఆకాశరాజు తన కుమార్తె పద్మావతిని శ్రీవేంకటేశ్వరస్వామికిచ్చి వివాహం జరిపించినట్లు వేంకటాచల మాహాత్మ్యం, పలు పురాణాలు తెలియచేస్తున్నాయి. నారాయణ పురంలోగల ఉద్యానవనాలలోని ప్రత్యేక మండపాలలో వీటిని దేవస్థానంవారు నిర్వహిస్తారు. మూడురోజులపాటు జరిగే ఈ వేడుకలలో మొదటిరోజు వైశాఖశుద్ధనవమినాడు మలయప్ప స్వామివారు గజవాహనం, రెండవరోజు దశమినాడు అశ్వ వాహనం, మూడవరోజయిన చివరిరోజున ఏకాదశినాడు గరుడవాహనంపై వేంచేస్తారు. ప్రత్యేక పల్లకీలలో ఉభయ నాంచారులు పరిణయోత్సవానికి తరలివస్తారు. పెళ్ళి మండపంలో నిత్యనూతన వధూవరులైన స్వామి అమ్మవార్లకు ఎదురుకోలు, పూలదండలు మార్చుకోవటం, పూబంతుల ఆట, నూతనవస్త్రాలసమర్పణ కోలాహలంగా సాగుతాయి. ఆ తరువాత స్వామికి ఆస్థానం నిర్వహిస్తారు. ఈ ఆస్థానంలో మలయప్పస్వామికి వేదాలు, పురాణాలు, సంగీతరాగాలు, కవితలు, నృత్యాలు నివేదిస్తారు. ఈ మూడురోజులు ఆర్జిత సేవలు ఉండవు. కానీ ఆర్జితసేవ భక్తులకు వస్త్రబహుమానం,





ప్రసాదవితరణ ఉంటుంది. ఆ తరువాత శ్రీదేవి భూదేవి సమేతుడైన స్వామి తిరుచ్చి అశేషభక్తజనంమధ్య ఊరేగుతూ ఆలయప్రవేశంతో పరిణయోత్సవాలు ఘనంగా ముగుస్తాయి.

పురాణాలప్రకారం వేలఏళ్ళక్రిందట ఆకాశరాజు తన కుమార్తెను శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశాడు. ఆనాటి వివాహానికి ప్రతీకగా నారాయణవనంలో నేటికీ పద్మావతీ పరి యోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహింపబడుతున్నాయి.

**స్వామి కల్యాణం జగత్కళ్యాణకారకం**
**స్వామి సేవనం ఆనందదాయకం**
**స్వామి దయయే సర్వపాపహరణం**
**స్వామి నామస్మరణం ముక్తిదాయకం**

**"లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు"**

# లోకకల్యాణార్థం! అవతార పరమార్థం!!




- డా॥ దేవులపల్లి పద్మజ, 98496 92414

"యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహ్యం!
పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయచ దుష్కృతామ్,
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

**అని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పినవిధంగా, దుష్ట శిక్షణ మరియు శిష్టరక్షణ చేసి ధర్మము స్థాపించుటకు శ్రీమహావిష్ణువు అనేక అవతార వైభవాలను తనకు తానుగా ప్రకటించుకున్నాడు. ఆ అవతారాలే ఇవి:**

## శ్రీమత్స్యావతారా విష్ణురూపాయ నమః!!

మత్స్యావతారంలో శ్రీమహావిష్ణువు నిర్వహించిన కార్యక్రమాలు రెండు. ఒకటి ప్రళయకాలంలో జీవరాశులను నావలో జలనిధిని దాటించటం, వేదాలను కాపాడటం. వివస్వతుడు అనే సూర్యుని పుత్రుడు సత్యవ్రతుడు. ఒకనాడు సత్య వ్రతుడు నదిలో అర్ఘ్యం ఇస్తుండగా అతని చేతిలోనికి ఒక చేపపిల్ల వచ్చింది. దానిని తిరిగి నీటిలో విడుస్తుండగా ఆ చేపపిల్ల తనను రక్షించమని కోరింది. అంతట సత్యవ్రతుడు దానిని తన కమండలంలో విడిచాడు. కాని కొద్దిసమయానికి అది పెద్దదై ఇబ్బందిపడటం చూసి, మరొక పెద్దపాత్రలోనికి వేశాడు. కాని అక్కడ కూడా పెద్దదిగా పెరగటం చూసి దానిని మరింత పెద్దపాత్రలో వేయగా అక్కడ కూడా పెద్దదిగా పెరగటం చూసి, నీవెవరు అని ప్రశ్నించాడు. అప్పుడు ఆ చేప తాను శ్రీమహావిష్ణువుని అని, బ్రహ్మనుండి జారిపడిన వేదాలను హయ గ్రీవుడు అనే రాక్షసుడు దొంగిలించి, సముద్రగర్భంలో దాక్కున్నాడని, వాటిని రక్షించాల్సివుందని చెప్పాడు. అంతే కాకుండా రాబోయే ఏడురోజులలో ప్రళయం రాబోతున్నదని, అందువలన ఈ విశ్వంలోని ఓషధులను, జీవరాశు లను, మునులను కాపాడటానికి నీ సహాయం కావాలని కోరాడు. అందుకు అంగీకరించిన సత్యవ్రతుడు ఆజ్ఞాపించ మని వేడుకున్నాడు. విష్ణువు ఒక పెద్ద నావని సృజించి దానిలో సకల జీవ రాశులయొక్క స్త్రీ, పురుష జీవాలను ప్రోగు చేయమని చెప్పాడు. సత్యవ్రతుడు జీవరాశుల సేకరణలో ఉండగా విష్ణువు హయగ్రీవుని సంహరించి వేదాలను సురక్షితంగా తీసుకుని వచ్చి, నావలోని జీవరాశులను సురక్షితప్రాంతానికి చేర్చాడు. తరువాత ప్రళయం వచ్చి, మొత్తం నీటితో నిండిపోయింది. అక్కడితో చాక్షుసమన్వంతరం ముగిసి పోయింది. తరువాతి మరియు ప్రస్తుత యుగం వైవస్వతమన్వంతరం ఆరంభ మైంది. దానికి సత్యవ్రతుడు అధిపతి అయ్యాడు.





## శ్రీకూర్మావతారా విష్ణురూపాయ నమః!!

ఒకసారి దేవేంద్రుని ప్రవర్తనకు కోపగించిన దుర్వాసుడు దేవతలను "శక్తి హీనులు" కమ్మని శపించాడు. దీనికి







దృశ్యం మబ్బుగా ఉండొచ్చు. కానీ లక్ష్యం కాదు. దశ చెడ్డదిగా ఉండొచ్చు కానీ జీవితం కాదు..!!

పరిష్కారం కోరగా, విష్ణువు పాలకడలిని చిలికి అందునుండి ఉద్భవించే అమృతాన్ని సేవించినట్లయితే తిరిగి దేవతలు వీర్యవంతులౌతారని తరుణోపాయం చెప్పాడు. అంతట దేవదానవులు పాలకడలిని చిలకటానికి మందరపర్వతాన్ని కవ్వంగాను, వాసుకిని తాడుగాను చేసుకుని పాలకడలిని చిలకటం ప్రారంభించారు. కాని మందరపర్వతం సముద్రంలో మునిగిపోతుండగా, దానిని నీటిలో పట్టి ఉంచటానికి విష్ణువు కూర్మావతారం దాల్చి, పర్వతాన్ని తన మూపురంపై నిలిపి చిలకటానికి సహకరించాడు. ఆ విధంగా సముద్రాన్ని చిలకగా హాలాహలం వెడలగా దానిని పరమేశ్వరుడు తన కంఠంలో ధరించి నీలకంఠుడుగా ప్రసిద్ధి పొందాడు. తరువాత లక్ష్మీదేవి ఉద్భవించగా ఆవిడను శ్రీమహావిష్ణువు భార్యగా స్వీకరించాడు. తరువాత అమృతాన్ని తీసుకుని ధన్వంతరి బయటకు రాగా, దానవులు దానిని అపహరించారు. అప్పుడు విష్ణువు మోహిని రూపం దాల్చి, అమృతాన్ని దేవతలకు పంచాడు.

## శ్రీవరాహావతారా

## విష్ణురూపాయ నమః!!

ఒకనాటి ప్రళయకాలంలో హిరణ్యాక్షుడు అనే రాక్షసుడు భూమిని దొంగిలించి, సముద్రగర్భంలో దాచియుంచగా, బ్రహ్మ శ్రీమహావిష్ణువును రక్షించమని ప్రార్థించాడు. అప్పుడు విష్ణువు బ్రహ్మ నాసికనుండి అంగుష్టప్రమాణంలో ఆది వరాహంగా ఉద్భవించాడు. చూస్తుండగానే భయంకరరూపం ధరించి, సముద్ర




గర్భాన్ని చీల్చి, పాతాళానికి ప్రవేశించి, హిరణ్యాక్షుని వధించి, తిరిగి భూమిని ఉద్ధరించాడు.

## శ్రీనరసింహావతారా

## విష్ణురూపాయ నమః!!

వైకుంఠంలోని ద్వారపాలకులైన జయ, విజయులు సనకసనందనాది మునులశాపానికి గురై భూలోకంలో కృతయుగంలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగాను; త్రేతాయుగంలో రావణ, కుంభకర్ణులుగాను; ద్వాపరయుగంలో శిశుపాల, దంతవక్త్రులుగాను జన్మించారు.

హిరణ్యాక్షుని మరణానికి తీవ్ర మనోవేదన చెందిన హిరణ్యకశిపుడు బ్రహ్మకై ఘోర తపస్సు ఆచరించి గాలిలోగాని, ఆకాశంలోగాని, నీటిలోగాని, అగ్నిలోగాని, రాత్రిగాని, పగలుగాని, దేవదానవులచేగాని, జంతువులచేగాని, ఇంట బయటగాని, లోపలగాని, ఆయుధాలచేగాని మరణంలేకుండా వరం పొందాడు. అతని కుమారుడు ప్రహ్లాదుడు. పరమవిష్ణుభక్తుడు. తన భక్తుని రక్షించటానికి శ్రీమహావిష్ణువు నరసింహావతారం దాల్చి స్తంభంనుండి బయలువెడలి, సంధ్యాసమయంలో,




ఇంటిగడపపై, తన తొడలపైనుంచి, వాడియైన తన గోళ్ళతో సంహరించాడు.

**(30-04-2026 నృసింహజయంతి)**

## శ్రీవామనావతారా

## విష్ణురూపాయనమః!!

శుక్రాచార్యుని సహాయంతో బలి చక్రవర్తి విశ్వాన్ని ఆక్రమించుకొనగా,

తిరిగి దానిని దేవతలపరంచేయటానికి శ్రీమహావిష్ణువు అదితి మరియు కశ్యప బ్రహ్మలకు కుమారుడుగా జన్మించాడు. ఆయన బలిచక్రవర్తివద్దకు వెళ్ళగా ఏమి కావాలని బలి ప్రశ్నించాడు. మూడడుగుల నేల మాత్రం చాలని అన్నాడు. దానికి సమ్మతించిన బలి, దానం చేయబూనగా, శుక్రాచార్యుడు వచ్చిన వ్యక్తి విష్ణువని గ్రహించి, దానాన్ని ఆపటానికి బలియొక్క కమండలంలో చేరి నీటిధారకు అడ్డుపడగా, చిన్న దర్భ పుల్లతో వామనుడు పొడిచాడు. అప్పుడు శుక్రాచార్యుని ఒక కన్నుకు గాయం అయ్యింది. అప్పటినుండి ఆయన ఒంటికన్ను గలిగినవాడుగా అయ్యాడు. బలినుండి దానాన్ని గ్రహించి ఒక అడుగుతో భూమిని, రెండవఅడుగుతో ఆకాశాన్ని కొలచి, తన మూడవఅడుగుతో బలిచక్రవర్తిని పాతాళానికి అణగద్రొక్కి, దేవతలను ఉద్ధరించాడు.




### శ్రీపరశురామావతారా విష్ణురూపాయ నమః!!


జమదగ్ని, రేణుకాదేవి దంపతులకు కుమారుడిగా పరశురాముడు జన్మించాడు. ఆయన పరమేశ్వరునివద్ద శస్త్ర విద్యలు నేర్చుకుని, అమోఘమైన గండ్ర గొడ్డలిని ఆయుధంగా పొందాడు. ఒక నాడు కార్తవీర్యార్జునుని కుమారులు జమదగ్ని శిరస్సు ఖండించి గోవును తమతో తీసుకునిపోయారు. అప్పుడు తల్లి రేణుకాదేవి తన భర్త శరీరంపై 21సార్లు గుండెలు బాదుకుంటూ విలపించింది. అందుకు ప్రతీకారంగా పరశురాముడు క్షత్రియులపై



21సార్లు దండెత్తి సమూలంగా నాశనం చేశాడు. తర్వాతికాలంలో సీతాస్వయంవరంలో శ్రీరాముడు శివుని చాపాన్ని విరువగా, తన గురువైన పరమశివుని విల్లువిరిచినందుకు కోపగించి, శ్రీరాముని విష్ణుధనుస్సును ఎక్కుపెట్టమని కోరాడు. సాక్షాత్తు విష్ణుస్వరూపుడైన శ్రీరాముడు ఆ ధనుస్సును సంధించగా, తన అవతార సమాప్తమైనదని భావించి తపస్సుచేసుకోవటానికి వెళ్ళిపోయాడు.

**(20-04-2026, పరశురామజయంతి)**

### శ్రీరామావతారా విష్ణురూపాయ నమః!!




ఇక్ష్వాకువంశజుడైన దశరథుని కుమారునిగా శ్రీరాముడు జన్మించి, సీతాదేవిని పరిణయమాడాడు. రావణుడు సీతాదేవిని అపహరించగా, వానరుల సహాయంతో రావణుని, కుంభకర్ణుని వధించి సీతాదేవిని తిరిగి పొందాడు. లవకుశులకు అవతార సమాప్తికాలంలో వారిని ఉత్తరాధికారులుగా నియమించాడు.



ఇతరులను వదిలేస్తేనే విలువిస్తారు. ఎవర్నీ పట్టించుకోకుండా బ్రతకడం నేర్చుకో!!

## శ్రీబలరామావతారా విష్ణురూపాయ నమః!!

ఆదిశేషువు అవతారమైన బలరాముడు శ్రీకృష్ణుని అగ్రజునిగా జన్మించిన అంశావతారం. తన తమ్మునికి



సహకరిస్తూ, కౌరవులవిషయంలో విభేదిస్తూ అవతార ప్రాశస్త్యాన్ని నడిపాడు. ఒకసారి కోపంలో తన ఆయుధమైన హలంతో యమునానది దిశనే మార్చేశాడు. బలరాముడు శ్రీకృష్ణుని అన్నయ్య. ఈయనను హలాయుధుడు, బలభద్రుడు, సంకర్షణుడు అనికూడా అంటారు. కంసుడి భయం నుంచి తప్పించుకోవడానికి దేవకీగర్భంలోని పిండాన్ని యోగమాయ రోహిణి గర్భంలోకి మార్చడంద్వారా బలరాముడు జన్మించాడు. బలరాముడు గొప్ప శక్తిమంతుడు. కృష్ణునికి తోడుగా ఉంటూ, ధర్మాన్ని రక్షించడంలో సహాయపడ్డాడు. ఈయన భార్య రేవతి. వైష్ణవసంప్రదాయాలు ఈయనను విష్ణువుయొక్క ఎనిమిదవ ఆవతారంగా భావిస్తాయి. జయదేవుని గీతగోవిందంలో విష్ణువు యొక్క 10 ప్రధాన అవతారాలలో బలరాముని చేర్చారు. కురుక్షేత్రయుద్ధమప్పుడు శాంతికాముకులై ఈయన తీర్థ యాత్రలు చేసి, చివరిరోజున తన శిష్యుల మధ్య జరిగే పోరాటాన్ని చూడటానికి తిరిగి వచ్చాడు.

## శ్రీకృష్ణావతారా విష్ణురూపాయ నమః!!

దేవకీ వసుదేవులకు పుత్రునిగా చెఱసాలలో జన్మించి, వ్రేపల్లెలోని యశోద నందులవద్ద పెరిగి, వివిధక్రీడలను చూపి, అనేకమంది రాక్షసులను



సంహరించాడు. తర్వాతికాలంలో పాండవులకు సహకరించి, కౌరవులను కురుక్షేత్రసంగ్రామంలో తుదముట్టించాడు. అద్భుతమైన భగవద్గీతను అర్జునునికి బోధించి లోకాలకు మార్గనిర్దేశనం చేశాడు. శ్రీమహావిష్ణువు దశావతారాలలో వర్ణింప శక్యంకాని అనేక అమోఘ లీలలను ప్రదర్శించి సంపూర్ణావతారంగా గణ్యత పొందాడు. ధర్మరాజు చేసిన రాజసూయయాగంలో ప్రథమతాంబూలం గ్రహించినందుకు శిశుపాలుడు ఆగ్రహంతో నిందించగా తన సుదర్శన చక్రంతో వధించాడు. జరాసంధుని, శిశుపాలుని మరణాలకు ఆగ్రహం చెందిన దంతవక్త్రుడు శ్రీకృష్ణునిపై దాడిచేయగా, శ్రీకృష్ణుడు అతనిని వధించాడు. జయ విజయులయొక్క మూడవజన్మ శిశుపాల, దంతవక్త్రులు.

## శ్రీకల్కిఅవతారా విష్ణురూపాయ నమః!!

కలియుగాంతంలో శంభల గ్రామంలో విష్ణుయశస్సుడు అనే బ్రాహ్మణుని ఇంట జన్మిస్తాడని పురాణాలు తెలియచేస్తున్నాయి. ఖడ్గాన్ని ధరించి, తెల్లనిగుర్రంపై స్వారీచేస్తూ దుష్టులను సంహరించి భూభారం తగ్గిస్తాడని పురాణాలద్వారా తెలుస్తోంది.





# సందేహాలు సమాధానాలు

- కీ.శే. డా॥ఎస్.బి.రఘునాథాచార్య

**ప్ర) మన శరీరాన్ని పృథివి, జలం, తేజస్సు, వాయువు ఏమైనా చేయగలవు. అందుకే మనం ఈ భూతాలకు భయపడిపోతాం. మరి ఆత్మకూడా అంతేనా? లేక శరీరానికి, ఆత్మకు తేడా ఉందా?**

జ) నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః॥ 2-23

అచ్ఛేద్యోఽయమదాహ్యో-యమక్లేద్యోఽశోష్య ఏవ చ।
నిత్యః సర్వగతః స్థాణురచలో-యం సనాతనః॥ 2-24

శరీరానికి, ఆత్మకు పోలికే లేదు. శరీరాన్ని పంచభూతాలు ఏమైనా చేయగలవు. కాని ఆత్మను ఏమీ చేయలేవు. శస్త్రాలు శరీరాన్ని నరికివేస్తాయి, ఆత్మను ఖండించలేవు. నిప్పు శరీరాన్ని బూడిద చేసేస్తుంది, కానీ ఆత్మను అంటుకోలేదు. నీళ్లు శరీరాన్ని తడిపివేయగలవు, కానీ ఆత్మనేమీ చేయలేవు. గాలి శరీరాన్ని ఎండించగలదు. ఆత్మనేమీ చేయలేదు. కనుక మన ఆత్మ నరకడానికి వీల్లేనిది, తగులబెట్టడానికి వీల్లేనిది, తడపడానికి వీల్లేనిది. ఎండించడానికి వీల్లేనిది. ఇది నిత్యం. అంతటమ ఉంటుంది. స్థిరం, అచలం, సనాతనమై ఉంటుంది. కమక దీనిదగ్గర బాహ్యభూతవికారాలు పనిచేయవు.

**ప్ర) పుట్టిన ప్రతివాడు చనిపోక తప్పదా? చనిపోయినవాడు మరలా పుట్టకుండా ఉండగలడా? మరి 'అయ్యో! నా వాడు పోయివాడే!' అని ఘనం బాధపడటం మంచిదా?**

జ) జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితుమర్హసి॥ 2-27

పుట్టడమనే లక్షణంగల ప్రతిదీ చనిపోక తప్పదు. అందుకనే దాన్ని అనిత్యమంటాం. పుడుతున్న వ్యక్తులు, వస్తువులు నశించడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. చనిపోయినవాడు మళ్లీ పుట్టక తప్పదు. మోక్షం పొందితేనే మళ్లీ జన్మ ఉండదు. పునర్జన్మ సిద్ధాంతాన్ని అంగీకరించడానికి మనకే ఇప్పుడు సాక్ష్యాధారాలు అన్ని దేశాల్లోను దొరుకుతున్నాయి. కనుక ఈ శరీరం వదలి ఇంకోచోట పుట్టేవాడినిగురించి బాధపడడం అవివేకమే కదా ఔతుంది.

**ప్ర) ఎవరైనా చనిపోయినారని వినడంతోనే లోకం ఆశ్చర్యపడుతుంది. ఆత్మను ఆశ్చర్యంగా చూస్తుంది. ఆశ్చర్యంగా చెప్పుకుంటుంది. ఎన్నిసార్లు విన్నా ఇంకా వింతగా వింటూనే ఉంటుంది. కానీ దీని స్వరూపస్వభావాలు ఏ ఒక్కరికి అంతుబట్టవు. మళ్లీ లోకవ్యవహారాల్లో మునిగిపోయి మర్చిపోతుంది. అజ్ఞానంలో పడిపోతుంది. ఏమిటీ చిత్రం?**

జ) ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన
మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।
ఆశ్చర్యవచ్చైన మన్యః శ్రుణోతి
శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥ 2-29

అవును! ఇది నిజంగా ఆశ్చర్యాలకే ఆశ్చర్యమైన వస్తువు. లోకంలో ప్రతివ్యక్తికి దిగ్భ్రాంతిని కలిగించే పదార్థం ఇది. మరణించాడంటే ప్రతివాడికి ఆశ్చర్యం. తాత్కాలికంగా కలిగినా సత్త్వరజస్తమోగుణమయమైన మాయలో పడిపోతాడు మానవుడు. దాంతో జ్ఞానం నిలవదు. అజ్ఞానం ఆవరిస్తుంది. అడుగడుగునా ఆశ్చర్యపడుతుంటాడు.

**ప్ర) అధర్మం పెరిగిపోయింది. చుట్టుప్రక్కలవారు అకారణంగా వైరాన్ని పెంచుకొని తాము చీకాకుపడటంతోపాటు లోకాన్నికూడా చీకాకు పెడుతున్నారు. నన్ను అధర్మంగా ఎదుర్కుంటున్నారు. ఆ స్థితిలో ఏం చేయాలి? సరిదిద్ద వలసిన బాధ్యతను వదలి భయపడి పారిపోవడమా? లేక ధైర్యంతో నిలబడి వా బాధ్యతను నిర్వహించడమా? ఏమిటి కర్తవ్యం?**

జ)స్వధర్మమపి చాపేక్ష్య న వికమ్పితుమర్హసి।
ధర్మ్యాద్ధి యుద్ధాచ్ఛ్రేయోఽన్యత్ క్షత్రియ స్య విద్యతే॥2-31

నీ ధర్మాన్ని పూర్తిగా ఆకళించుకో! నీకు నిజంగా బాధ్యత ఉంటే ఏ పరిస్థితిలోను వెనుకాడకు. నీవు ధర్మంగా నడుస్తున్నావనే విశ్వాసం నీలో పరిపూర్ణంగా ఉంటే అధర్మంగా నిన్నెదుర్కుంటున్నవారిని ప్రతిఘటించు. వెనుకాడకు. బాధ్యతను చూచి బెదిరి పారిపోకు. ధర్మంగా నీవు చేసే ప్రతిఘటనలో తప్పక నీవు విజయాన్ని పొందుతావు. నీ స్వార్థంకంటే నీ బాధ్యతకు, పరోపకారానికి ప్రాధాన్యత నివ్వు. అప్పుడే ఆదర్శజీవనం చేయగలుగుతావు.

# మహిమాన్విత మురుగన్ క్షేత్రం తిరుప్పరంకుండ్రం

- డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి, 82475 78748

తెలుగు సంవత్సరాదిని ఉగాది అని పిలిచినట్టే తమిళ సంవత్సరాదిని పుత్తాండు అని అంటారు. అంటే తమిళ క్యాలెండర్లో ఇది మొదటిరోజు. ఈ రోజున తమిళులంతా "ఇనియ పుత్తాండు నల్వాళ్తుగల్!" అని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఈ రోజును కుటుంబం మొత్తం సంతోషంగా గడుపుతారు. ఇంటిని శుభ్రపరుచుకుని అందంగా అలంకరించి ప్రత్యేకపూజలు చేస్తారు. పిండివంటలు చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. ఆరు రుచులతో తెలుగువారు ఉగాదిపచ్చడి చేసినట్టే తమిళులు కూడా పచ్చడి చేసి నివేదిస్తారు. ఈ రోజు ఆలయాలను సందర్శిస్తారు. పెద్దలవద్ద ఆశీస్సులు తీసుకుంటారు.

ఈ రోజున భక్తులు అధికంగా దర్శించుకొనే ఆలయాలలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆరు దివ్యక్షేత్రాలలో రెండవదిగా భాసిల్లుతున్న తిరుప్పరంకుండ్రం ఒకటి. ఇది తమిళనాడులో ఉంది. కార్తికేయుడు దేవసేనను పెళ్లాడిన క్షేత్రంగా ఖ్యాతి చెందిన ఈ ఆలయం ఎంతో మహిమాన్వితమైనది.

ఇక్కడి ప్రత్యేకత ఏమిటంటే, ఈ ఒక్క క్షేత్రంలోనే సుబ్రహ్మణ్యస్వామివారు కూర్చుని దర్శనమిస్తారు. మిగతా అన్నిచోట్ల స్వామి నిలబడిన మూర్తినే మనం చూస్తాం.

**ఆలయ స్థలపురాణం-** సుబ్రహ్మణ్యుడి భార్యలు అయిన శ్రీవల్లి, దేవసేనలు ఇద్దరూ శ్రీ మహావిష్ణువు కుమార్తెలు. వీరి అసలు పేర్లు అమృతవల్లి, సుందరవల్లి. ఒకరోజు వల్లి, దేవసేనలు ఇద్దరూ సుబ్రహ్మణ్యుడివద్దకు వచ్చి వారిని కల్యాణం చేసుకోమని అడిగారు. స్వామి అమృతవల్లితో "నిన్ను ఇంద్రుడు తన కూతురిగా పెంచుతాడు. తరువాతకాలంలో నిన్ను వివాహం చేసుకుంటాను" అని అభయం ఇచ్చాడు. అలాగే సుందరవల్లినికూడా అనుగ్రహించారు స్వామి.

**ఇంద్రుని కలిసిన అమృతవల్లి-** కొంతకాలం తర్వాత అమృతవల్లి చిన్న ఆడశిశువుగా మారి, మేరుపర్వతం దగ్గరకి వెళ్లి, ఇంద్రుడిని కలిసి "నేను శ్రీ మహావిష్ణువు కుమార్తెను, నన్ను పెంచవలసిన బాధ్యత మీకు ఉంది" అని చెప్పింది. ఈ మాట విన్న ఇంద్రుడు ఎంతగానో సంతోషించి వెంటనే తనవద్దనున్న ఐరావతాన్ని ఈ బిడ్డ ఆలనా పాలనా చూడమని ఆజ్ఞాపించాడు. అమృతవల్లికి పెళ్లీడు వచ్చేవరకు ఆ ఐరావతం ఎంతో ప్రేమతో పెంచింది. తమిళంలో 'యానై' అంటే ఏనుగు. అమృతవల్లిని దేవతల ఏనుగు అయిన ఐరావతం పెంచడంవల్లనే, ఆమెకు దేవయాని అని పేరుకూడా వచ్చిందని అంటారు.

**గిరిజననాయకుని సంరక్షణలో సుందరవల్లి-** మరికొంత కాలానికి మహావిష్ణువు మరో కుమార్తె సుందరవల్లి శివముని అనే మునీశ్వరుని తేజస్సువలన అయోనిజగా పుట్టింది. ఆమెను నంబి అనే భిల్లనాయకుడు అంటే గిరిజనుల నాయకుడు పెంచుకున్నారు. తరువాతకాలంలో ఆమెను సుబ్రహ్మణ్యుడు వివాహం చేసుకున్నారు. అది వల్లీ కల్యాణఘట్టం.

ఒకానొకసమయంలో పరాశరమహర్షి ఆరుగురు కుమారులు శరవణ తటాకంలో చేపలుగా ఉండమని శాపాన్ని పొందారు. తమ శాపవిమోచనంకోసం వారు సుబ్రహ్మణ్యుని ఆరాధించడం మొదలుపెట్టారు. సుబ్రహ్మణ్యుడు తాను



తిరుప్పరంకుంద్రం వచ్చినప్పుడు వారికి శాపవిమోచనం కలుగుతుందని అభయమిచ్చాడు.

**తిరుప్పరంకుంద్రంకు విచ్చేసిన సుబ్రహ్మణ్యుడు-** తిరుచెందూర్లో కుమారస్వామి శూరపద్మం అనే రాక్షసుడిని సంహారం చేసి, దేవతలందరినీ రాక్షసబాధలనుంచి విముక్తులను చేసి, ఆ దేవతలందరితో కలిసి, తిరుప్పరంకుంద్రం వచ్చారు. స్వామిరాకతో పరాశరమహర్షి కుమారులకు శాపవిమోచనం కలిగి, స్వస్వరూపం వచ్చి, వారు స్వామిని ఆ క్షేత్రంలో కొలువుండమని ప్రార్థించారు. వారి ప్రార్థనకు మెచ్చిన షణ్ముఖుడు అంగీకరించగా, అక్కడ విశ్వకర్మ ఒక చక్కని ఆలయం నిర్మించాడు.

**సుబ్రహ్మణ్యుడు దేవయానిల కల్యాణం-** అదేసమయంలో దేవతలకు అధిపతి ఇంద్రుడు తన కుమార్తె దేవయానిని పెళ్ళి చేసుకోమని సుబ్రహ్మణ్యుని అర్థించాడు. దేవయానిగా పిలుచుకునే అమృతవల్లియే ఈ దేవసేన! ఇంద్రుడు చతుర్ముఖ బ్రహ్మకు, శ్రీ మహావిష్ణువుకి తన ఈ కోర్కెని తెలియజేశాడు. వారి కోరికను సుబ్రహ్మణ్యునికి తెలుపగా, స్వామి అంగీకరించాడు. సుబ్రహ్మణ్యస్వామివారికి, దేవయానికి కల్యాణం ఈ తిరుప్పరంకుంద్రంలోనే జరిగింది.



**కల్యాణాలక్షేత్రం-** తిరుప్పరంకుంద్రంలో దేవసేన సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణం జరగడంవల్లనే, ఇప్పటికీ ఎంతోమంది వివాహాలు స్వామిసన్నిధిలో జరుపుకుంటారు. రాక్షససంహారం చేసి వచ్చిన తర్వాత ఇక్కడ స్వామి కల్యాణం జరగడంవల్ల ఈ క్షేత్రం చాలా చాలా విశేషమైనది.

**ఆలయ విశేషాలు-** తిరుప్పరంకుంద్రంలో ముఖ్యమైన విశేషం ఏమిటంటే, ఈ ఆలయం మొత్తాన్ని ఒకే కొండరాతితో చెక్కారు. ఆలయంలోకి ప్రవేశించగానే, నలభైఎనిమిదిస్తంభాలు, ఒక్కోస్తంభంమీదా ఒక్కో భగవన్మూర్తి ఉంటుంది. ఈ స్తంభాల మీద దుర్గాదేవి, విఘ్నేశ్వరుడు, పార్వతీదేవిని శివునికి అప్పగిస్తున్న మహావిష్ణువుతో కూడిన శివకల్యాణఘట్టం భక్తులను పరవశింపచేస్తాయి.

**సింహాసనంపై కూర్చున్నభంగిమలో సుబ్రహ్మణ్యుడు-** ఆలయమండపం దాటి లోపలికి వెడితే, ముందుగా స్వామివారి వాహనం మయూరం, విఘ్నేశ్వర వాహనం మూషికం, శివుని వాహనం నందీశ్వరుడు దర్శనమిస్తారు. ఇంకా పైకి మెట్లమీదుగా వెడితే గర్భాలయం కనిపిస్తుంది. గర్భాలయంలో సుబ్రహ్మణ్యస్వామి సింహాసనంలో కూర్చుని ఉంటారు. ఆయనకి ఎడమవైపు దేవసేన, కుడివైపు నారదమహాముని క్రింద కూర్చుని ఉంటారు.

తిరుప్పరంకుంద్రంక్షేత్రంలో స్వామికి అభిషేకం చేయరు. కేవలం ఆయన శక్తి శూలమునకు మాత్రమే అభిషేకాలు జరుగుతాయి. ఇక్కడ వెలసిన విఘ్నేశ్వరస్వామి 'కర్పగ వినాయగర్' అనే పేరుతో భక్తులను అనుగ్రహిస్తుంటాడు. ఆ ప్రక్కనే మహాదేవుడు లింగస్వరూపంలో ఉంటారు. దుర్గాఅమ్మవారు మధ్యలో ఉంటారు. దుర్గాదేవికి ఎడమవైపు వినాయకుడు, కుడివైపు సుబ్రహ్మణ్యుడు ఉంటారు. శివలింగం ఎదురుగా పెరుమాళ్, అంటే శ్రీ మహావిష్ణువుకూడా ఉంటారు.

కుజదోషాలు, సర్పదోషాలు పోగొట్టే క్షేత్రంగా తిరుప్పరంకుంద్రం ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రంలో సుబ్రహ్మణ్యుని దర్శించుకుంటే వివాహం కానివారికి వివాహం, సంతానం లేనివారికి సంతానం కలుగుతాయని విశ్వాసం.

ఓం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామియే నమః

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



**గతసంచిక తరువాయి..**

పొదలచాటున ఉన్న శ్రీనివాసుడు చెలికత్తెల సంభాషణ అంతా విన్నాడు. చదరంగమాడుతున్న పద్మావతిని చూచి-

ఎవరీవిడ చక్కని చుక్క. రతికన్నా, భారతికన్నా, పార్వతికన్నా చివరకు లక్ష్మీదేవికన్నా అందంగా కనిపిస్తూ ఉందే ఈ అందాల భరిణి. అయినా, ఓ ఒయ్యారి నన్ను మోహిస్తుందా? అని కళ్ళార్పకుండా ఆవిడను చూస్తూ ఉండిపోయాడు. ఆ కన్య కాంతులకు నివ్వెరపోయాడు. తనలో తాను 'బ్రహ్మ అతిరూపవతిని సృష్టించి పద్మం మీద పెట్టాడేమో' ఆకాశరాజు కూతురు కావడం నాకోసమే ఏమో. ఏమయినా నేను ఆలస్యం చేయక తొందరగా తొందరలో పెళ్లి చేసుకొంటాను అనుకొన్నాడు. అయినా శ్రీనివాసుడు మనసు ఉరకలు వేస్తుంటే తానున్నచోట నిలవనేరక ముందుకు కదిలాడు.

అందాల భామినీ! నీకు తలబ్రాలు పోస్తానుగా అని పూలు చల్లుకొంటూ రాచకన్యదగ్గరికి చేరాడు. ఈ హఠాత్‌పరిణామానికి పద్మావతి నివ్వెరపోయింది. తత్‌క్షణం పూలపొదవెనక దాగింది. ఆ పై ముద్దులు మూట కట్టినట్లుగా చెలికత్తెలతో-

రాచకన్య వనసంచారవేళ పరపురుషుడు రావడం సమంజసం కాదు. భయపడకండి. తొందరపడకండి. పరపురుషునికేసి అడుగులు వేయకండి. దూరంగా పొండి అని హెచ్చరిస్తుంటే చెలికత్తెలు పరపురుషునికేసి ధైర్యంగా చూచారు. ఎందుకైనా మంచిదని పద్మావతిచుట్టూ చేరి ఆవిడకు రక్షగా నిలబడ్డారు. తదనంతరం చిరాకుతో పరపురుషుని చూచి-

'ఎవరు మీరు' పరపురుషులుగా కనిపిస్తున్నారు. రాచకన్య చెలికత్తెలతో విహరించే ప్రదేశానికి మీరు కాస్తంత భయమైనా లేక ఇక్కడికి స్వతంత్రంగా రావడమేమిటి? ఇది తగదు. అవతలకు వెళ్లు అని తరమడానికి సిద్ధంగా చెలికత్తెలు అడుగులు వేస్తుంటే..

మీననేత్రులారా! నేను మీ రాచబిడ్డమీద మనసు పడ్డాను. ఆవిడతో మాటలు కలపాలని వేవేగ వచ్చాను. మరి మీరెందుకు అడ్డుపడతారు. దూరంగా వెళ్ళండి అని గద్దించేరీతిలో సంభాషణ కొనసాగిస్తుంటే చెలికత్తెల్ని పద్మావతి తన దగ్గరికి పిలిచింది.

చెలికత్తెలార! ఎవడేవీడు. బాగా పరిచయమైన చుట్టంలాగా బెదరిస్తూ మాటలాడుతున్నాడే. ఇలా మాటలాడటం పాపం కదా! అయినా ఆ మగవాని బంధువులెవరో, అసలు వీడెవడో. వీని కులగోత్రాలు భోగట్టా అడిగిరండీ అని ఆదేశిస్తే చెలికత్తెలు ఆ మగవాని దగ్గరికి వెళ్లి...

ఓ బోయవాడా! నీవెవరు? నీ తల్లి దండ్రులెవరు? నీ కులమేమి? గోత్రమేమిటి? చెప్పు అని గద్దించి అడిగారు.

స్వామి శాంతంగా వారిని చూస్తూ ఒక వంక పద్మావతిని గుర్తిస్తూ- సుందరీమణులారా! మీరడిగిన అన్నింటికి జవాబు తప్పక చెబుతాను. కులం గోత్రం దాచక చెబుతాను. ఆ రాచకన్యకు నా తోడి చెలిమి పెంచేలా చేయండి. మీకేది ప్రియమో నేను తప్పక చేస్తాను.

మా కులం ఏదంటారా! శీతాంశు కులం. గోత్రమంటారా! వసిష్ఠగోత్రం. తండ్రి వసుదేవుడు. తల్లి దేవకి. బలరాముడు నా అన్నా, చెల్లెలేమో సుభద్ర. గాండీవి నా మరిది. ధర్మరాజాదులు నా బంధువులు అన్నాడు.

అప్పుడా చెలికత్తెలు అంతా బాగుంది. కాని, నీవు నల్లగా ఉన్నావేమిటి? అని అడిగారు. *(ఇంకా ఉంది)*

2026,
ఏప్రిల్ 21న
శ్రీ శంకరజయంతి
సందర్భంగా...

# నడిచేది జీవుడు - నడిపేది దేవుడు

- డా॥ కె.బి.రాజేంద్రప్రసాద్, 77993 00342

శ్లో॥ దేహో దేవాలయః ప్రోక్తో జీవో సనాతనః।
త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం సోఽహం భావేన పూజయేత్॥ అన్నారు శంకరులు.

దేహమే దేవాలయమని చెప్పబడుతోంది. అందున్న జీవుడే సనాతనుడైన దైవం. కనుక అజ్ఞానమనే నిర్మాల్యాన్ని త్యజించి, నేనే ఆ పరబ్రహ్మను అని భావించి పూజించాలి.

అంతర్గతస్వీయనాశంలోని సత్యతత్త్వమే జీవాత్మ. జీవాత్మ హృదయ స్థానంలో పదిలంగా, నిశ్చలంగా ఉంటాడని చెప్తున్ననూ, నిజానికి దేహంలోని ప్రతి అణువులోను జీవాత్మ వ్యాప్తిని కల్గి ఉంటుంది. అంతేకాని నిర్దిష్టమైన స్థానం జీవాత్మకు చెప్ప సాధ్యం కాదు. ఆత్మకు అనుభూతి ఉండదు. కాని, ఆత్మ ఉన్నదనే అనుభూతి శరీరానికి కల్గుతుంది. మనస్సు, ఇంద్రియాలతో కలసి శరీరంలో జీవాత్మ ఉంటుంది. జీవాత్మకు ఏకైకలక్ష్యం పరిపూర్ణత సాధించడం. జన్మలపరంపరతో అనుభవాల వాసనలతో, జననమరణచక్రం నుండి విముక్తికోసం జీవాత్మ ఎదురుచూస్తుంది. అందుకు ఆత్మజ్ఞానం కావాలి. ఆత్మజ్ఞానం కర్మఫలాలనుండి విముక్తిని పొందడానికి సహకరిస్తుంది. పరమాత్మతో ఏకం అయినవాడు ముక్తి లేదా మోక్షం పొందుతాడు. అంతవరకు జన్మపరంపరలో జీవి కొనసాగుతాడు. భవసాగరాన్ని ఈదుతూనే ఉంటాడు.

"నేను ఎవరు? ఎక్కడినుండి వచ్చాను? నా గమనం, గమ్యం ఎటువైపు?" అనే ప్రశ్నలు మనల్ని ఆత్మజ్ఞానంవైపు అడుగులు వేయిస్తాయి. సహనంతో సాధనశోధన సాగాలి. గురువుల బోధనలుకూడా ఆత్మజ్ఞాన మార్గాన్ని చూపుతాయి.

ఆత్మజ్ఞానం అంటే నిన్ను నీవు గుర్తించడం. నిజమైన రూపాన్ని లేదా తత్వాన్ని అనుభూతితో తెల్సుకోవడం. దేహం మనది కాదు. దేహంలో ఉన్న "నేను" మాత్రమే ఆత్మ.

పూర్తి పుణ్యకర్మలతో దేవతాజన్మం, పుణ్యపాపాల సమ్మేళనం మానవజన్మ, పాపకల్మషాలవలన పశుకీటకాల జన్మలను జీవుడు ధరించవలసి ఉంటుంది. సుఖం లేదు. శాంతి లేదు. చిరిగినవస్త్రాన్ని వదలి మరో క్రొత్తవస్త్రాన్ని ధరించినవిధంగానే జీవాత్మ జన్మలు ఎత్తడం జరుగుతోంది. అందుకే ఆదిశంకరులు "పునరపి జననం పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనం" అంటూ "గోవిందా! రక్షించుస్వామి. ఇహ సంసార జీవనం కడు దుర్భరంగా ఉంటుం"దని అంజలి ఘటించారు.

తెల్సిచేసినా, తెలియకచేసినా కర్మఫలితం అనుభవించాల్సిందే! కర్మానుభవం పాపాన్ని తగ్గిస్తే, క్రతువులు, ఆరాధనార్చనలు పుణ్యాన్ని వృద్ధి చేస్తాయి. కడుపుణ్యులను, పాపకర్ములను సరిగాచే దైవం ఒక్కడే. ఆయనే జగన్నాటక సూత్రధారి. జీవాత్మలు, పాత్రధారులు సూత్రధారిని నమ్మి పాత్రను ఔచిత్యవంతంగా పోషించాల్సిన వివేకం మాత్రం జీవాత్మదే. స్వామిదరి చేరి, మన పురికి ఆహ్వానించి, సేదతీరడమే జీవుని కర్తవ్యం. రాక రాక అదృష్టంకొద్దీ వచ్చిందీ మానవజన్మ. ఈ జన్మను వృథా కానివ్వరాదు. ఆత్మజ్ఞానంవైపు అడుగులు వేసి, పరమాత్మ తత్త్వదర్శనంకై పరితపిద్దాం. నడిచేది జీవుడైతే నడిపించేది అంతర్యామియైన పరమాత్మ అనే నిజాన్ని నమ్మి ముందుకు నడుద్దాం.

తెగదు పాపము తీరదు పుణ్యము
నగినగి కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుదేవిక
గగనము మీదిది కైవల్యము



# నల దమయంతుల దాంపత్యనిష్ఠ

– శ్రీ ఎం.వేంకట సత్యరామశేషు

నిషధదేశాన్ని పరిపాలించే నలుడు షట్చక్రవర్తులలో ఒకడు. సత్యవాది, సౌందర్యవంతుడు, జితేంద్రియుడు, వేదజ్ఞుడు, బ్రాహ్మణ భక్తుడు. అంతేకాక అశ్వహృదయవిద్య తెలిసిన గొప్ప పరాక్రమవంతుడు, అస్త్రవిద్యానిపుణుడు. ఇన్ని సద్గుణాలు గల ఆయనకి జూదంపై మక్కువ ఎక్కువ.

విదర్భదేశాన్ని పరిపాలించే భీమకుని పుత్రిక దమయంతి. దమనుడు అనే ముని ప్రసాదించిన వరముచేత జన్మించింది కనుక దమయంతి అను పేర ప్రసిద్ధి పొందినది. అపురూప సౌందర్యరాశి దమయంతి.

ఇరువురు ఒకరిగుణములనొకరు విన్నవారై ఒకరి గురించి ఒకరు ఆలోచింపసాగారు. ఒకానొకనాడు నలుడు దమయంతిగురించి యోచిస్తున్నసమయంలో ఆకసమున ఒకహంసలగుంపు తిరుగాడుచు నేలపై వాలగా నలుడు వాని సౌందర్యమునకు ముగ్ధుడై ఒకదానిని పట్టుకొన్నాడు. అంత ఆ హంస మనుష్యభాషణంలో నీకు ప్రియమైన కార్యం చేస్తాను. నీ హృదయేశ్వరి దమయంతివద్దకు పోయి నీ సౌందర్య, సుగుణములను వర్ణించి చెప్తాను అన్నది. ఆ రాయంచ



పలుకులను విని ఆ యంచను విడిచిపుచ్చాడు. అంత ఆ హంస తన సమూహంతో విదర్భకేగి ఉద్యానవనమున విహరిస్తున్న దమయంతికి పట్టుబడి మనుష్యవాక్యములలో దమయంతితో ఇట్లనింది. నీవు నారీరత్నమవు. అతడో



పురుషరత్నం. మీ ఇరువురి సమాగమం అన్యోన్యశోభాకరమని పలికింది. కలహంస పలికిన పలుకులకు దమయంతి ఆనందం పొందింది.

భీమకుడు దమయంతీ స్వయంవరమును ప్రకటింపగా రాజకుమారులు, దమయంతి సౌందర్యమును విన్న ఇంద్రాది లోకపాలకులందరు విచ్చేశారు. అంతేకాక దేవతలు మన్మథ రూపుడైన నలునివద్దకు వచ్చి సత్యవ్రతుడవైన నీవు మాకు దూతవై దమయంతివద్దకు వెళ్లి మాలో ఎవరో ఒకరిని వివాహమాడునట్లు ఆమెను అంగీకరింపచెయ్యి. మాలో ఎవరో ఒకరము ఆమెను వివాహమాడ సంకల్పించాం. ఎవరిని పతిగా అంగీకరించినా మాకు సమ్మతమే. నీవే ఆమెవద్దకు దూతగా వెళ్ళుమని ఆజ్ఞాపించారు.

సత్యవ్రతుడయిన నలుడు దమయంతిదగ్గరకు దూతగా వెళ్ళగా ఆతనిని చూచిన దమయంతి నీవెవరివి అని అడుగగా తన వృత్తాంతము, దేవతల కోరికను ఆమెకు తెలియచెప్పి కేవల మనుష్యమాత్రుడైన నన్నుకాక వారిలో ఎవరినో ఒకరిని పతిగా

వరించమని చెప్పాడు. దమయంతి తన మనస్సెనాడో నలునిపై లగ్నమయినదని ఆతనిని కాక దేవతలయినా సరే అన్యులను వరింపలేను, వరించను అని పలికింది. లోకపాలకులతో కలసి నీవుకూడా స్వయంవరమండపానికి రావలసినది. వారందరి ముందట మిమ్ము వరించగలదాన్ని అని పలికింది. అనంతరము జరిగిన స్వయంవరమున దమయంతి దేవతలను ప్రార్థించి అసలైన నలుని గుర్తించి చివరకు నలుని మెడలో వరమాల వేసి అలంకరించింది. భీమకుడు దేవతల దీవెనలతో నలదమయంతుల వివాహం చేశాడు.



దమయంతీసహితుడైన నలమహారాజు నిషధదేశమును చేరాడు. ప్రజానురంజకంగా పరిపాలనం చేస్తున్నాడు. అనేక అశ్వమేధాదియజ్ఞాలు చేశాడు. ఇంద్రసేనుడను కుమారుని, ఇంద్రసేన అను కుమార్తెల జననంతో నల దమయంతుల జీవితం ఆనందంగా సాగిపోతోంది.

దమయంతీ స్వయంవరం జరిగిన తరువాత ఇంద్రాది దేవతలు వారి వారి ప్రదేశాలకు ప్రయాణమై వెళుతుండగా కలిపురుషుడు వారికి ఎదురయ్యాడు. అపుడు కలి వారితో తాను దమయంతిని వివాహమాడగోరి విదర్భకు వెళుతున్నానని చెప్పాడు. ఇంద్రాదిదేవతలందరు కలిని చూసి నవ్వుతూ దమయంతీస్వయంవరం ఏనాడో ముగిసింది. ఆమె సత్యనిష్ఠుడు, ధర్మవేత్త, పరాక్రమవంతుడు, పవిత్రత, శమదమాలలో లోకపాలురకు సాటియైన నలుని వరించింది అన్నారు. అంత కలిపురుషుడు నేను నలుని శరీరాన్ని చేరి అతనిని రాజ్యభ్రష్ఠుని చేసి వారిని కష్టాలపాలు చేస్తానన్నాడు. కలి తన సోదరుడైన ద్వాపరునితో కలిసి నిషధదేశమున తిష్ఠ వేశాడు. నిత్య ధర్మాచారపరాయణుడైన నలుని ఆవేశించటానికి కలి 12వత్సరములు వేచియుండి చివరకు ఒకనాడు అశుచియై సంధ్యాసమయకార్యములను తీర్చిన నలుని శరీరంలో ప్రవేశించాడు.

సకలజనులతో, సమస్తరాజులచే సత్కారములతో ఉన్న నలుని విధివశాత్తు కలిపురుషుడావహించినందువలన సమస్తము కోల్పోయినవాడయ్యాడు.

కలిప్రభావమున కర్కోటకుడను పాము కాటుకు గురై రూపమును కోల్పోయిన నల మహారాజు బాహుకుడను పేర అయోధ్యనేలే ఋతుపర్ణమహారాజువద్ద పాకశాలలో వంటవానిగా ఉన్నట్లు తెలిసింది దమయంతికి.

ఒక బ్రాహ్మణుని పిలిపించి బ్రాహ్మణోత్తమా! విదర్భ రాకుమారి అయిన దమయంతి మరల స్వయంవరం ప్రకటించి పతిని వరించాలనుకుంటోంది అని ఋతుపర్ణునికి వర్తమానం పంపమని దమయంతి చెప్పింది. అది విన్న ఋతుపర్ణుడు బాహుకుని పిలిపించి దమయంతీస్వయంవరం గురించి చెప్పి, విదర్భకు తనతో సహా బయలుదేరాడు.

అక్కడికెళ్లిన నలుడామెతో ఈ ద్వితీయస్వయంవరమునకు కారణమేమని ప్రశ్నించగా ఇదంతా కేవలం నలుని గుర్తించటానికి మాత్రమేయని శతయోజనపర్యంతదూరము నొక్కవాసరమున రాగలవాడు నలుడేనని తెలిసి ఒక్క ఋతుపర్ణునకే ఈ వార్త పంపాను. నాలోన ఏ పాపభావము లేదని చెప్పింది. మనసా వాచా కర్మణా మిమ్ములను తప్ప అన్యులను నే తలపలేదన్న దమయంతి మాటలతో నలుడు సుందర రూపమును పొందాడు.

కేవలం నలునిగురించి తెలుసుకోవటానికే దమయంతి ద్వితీయస్వయంవరప్రకటనమే కాని, అన్యచింతనము లేదు. సత్యనిష్ఠ, ధర్మాచరణము కలవారెప్పుడూ భగవద్కృపకు పాత్రులు కాగలరన్నదే నలదమయంతుల కథావైశిష్ట్యము.



మంచివాళ్లకే కదా పరీక్షలుంటాయి. ముంచేవాళ్లకి ఏ పరీక్షలూ అవసరం లేదు మరి!

భగవద్గీత సందేశం

# భక్తుడు కూడా భగవత్స్వరూపుడే!

- శ్రీ వద్దిరాజు జనార్దనరావు, 99893 50596

మచ్చిత్తా మద్గతప్రాణా బోధయంతః పరస్పరమ్
కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ
(భగవద్గీత విభూతియోగం 10వ అధ్యాయం-09వ శ్లోకం)

నా భక్తులు నాయందే తమ మనస్సులను లగ్న మొనర్తురు. తమ ప్రాణములను తమ కర్మలన్నింటిని తమ సర్వస్వమును నాకే అంకిత మొనర్తురు. వారు పరస్పర చర్చల ద్వారా నా మహత్త్వమునుగూర్చి ఒకరినొకరు తెలుపుకొనుచు, నిరంతరం సంతుష్టులవుతుంటారు. వారు సతతము నాయందే రమిస్తుంటారు అని తెలిపాడు భగవంతుడు శ్రీకృష్ణుడు అర్జునునితో.

మహారాష్ట్రలో పాండురంగనుని కీర్తించి లోకాన్ని తరింపచేసిన ఎందరో మహాభక్తుల్లో సంత్ నామ్‌దేవ్ ప్రముఖులు.

పరమాత్ముని నిగూఢతత్త్వము పామరులకుకూడా సులభంగా బోధపడువిధంగా కీర్తించిన పరమ భక్తుడు, భాగవతోత్తముడు, పాండురంగని ఆంతరంగిక భక్తుడు సంత్ నామ్‌దేవుడు.



సంత్‌నామ్‌దేవ్ నామాజీశేఠ్, గుణాబాయి పుణ్య దంపతులకు పాండురంగని వరప్రసాదంగా జన్మించాడు. పువ్వు పుట్టగానే పరిమళిస్తున్నట్లు, చిన్ననాటినుండి భక్తి ప్రపత్తులలో పాండురంగని ఆంతరంగిక భక్తునిగా ఎదిగాడు.

నామ్‌దేవ్ పెరిగేకొద్ది అద్భుతమైన వ్యక్తిత్వం వికసించడం. పాండురంగనిపై అతనికి గల అమితమైన భక్తిని గోచరింపచేసింది.

నామదేవులవారు తమ నామ సంకీర్తనామృతంతోనూ భక్తులను కట్టిపడేసేవారు.

సామూహిక భజనగానం కార్యక్రమాల్లో అందరినీ అన్ని సామాజికవర్గాలవారిని ఆకర్షించేవారు.

## అద్భుత సంఘటనలు

నామ్‌దేవుడు మహారాష్ట్రలోని అయునీచ్ నాగనాథ్ క్షేత్రము దర్శించగా అక్కడ ఉన్న శివునిలో పాండురంగడు నామదేవులవారికి దర్శనం ఇచ్చాడట. శివకేశవులకు భేదము లేదని దర్శనమిచ్చిన పాండురంగని చూచి మైమరచి సంకీర్తనలు చేశారు అక్కడ. భక్తులుకూడా ఆ సంకీర్తనలకు నాట్యం చేశారట. అది చూసి ఆలయ పూజారులు గుడి వెనుకకు వెళ్ళమని వారికి చెప్పారు. వారు గుడి వెనుకభాగాన చేరి కీర్తిస్తూ నర్తిస్తున్నారట. అందులో ఒక అద్భుతమైన దృశ్యం ఆవిష్కరింపబడిందట. గుడి తలుపులు వెనుకకు త్రిప్పబడి అక్కడి భక్తులకు శివుడు దర్శనమిచ్చాడు.

## సర్వం బ్రహ్మమయం

మరో సంఘటనలో పాండురంగని ఆదేశంమేరకు 'విశోభాకేచర్'ను కలుసుకునేందుకు వెళ్ళాడు నామదేవుడు.

అక్కడ అతనికి విచిత్ర అనుభవం ఎదురుయింది. నాగనాథ్ ఆలయంలో ఒక ముదుసలి తన రెండుకాళ్ళను శివలింగంపై ఉంచి నిద్రపోతున్నాడట. అతన్ని తట్టి లేపి మీ కాళ్ళు భగవంతుని లింగంపై ఉన్నాయని తెలిపాడట. అలాగా అయితే కాళ్ళు తీసి నీవే పక్కన పెట్టు అన్నాడట. అలాగే చేశాడు నామ్‌దేవ్. మళ్ళీ శివలింగంపై కాళ్లు పెట్టి ఉండటం, అలా ఎన్నిసార్లు చేసినా అలాగే ఉండడంతో వెంటనే నామదేవుల



వారికి జ్ఞానోదయమయి “సర్వం బ్రహ్మమయం”. అని, మీరే నా గురువులని అతనికాళ్ళపై పడి క్షమాపణ కోరి పాండురంగని ఆదేశానుసారం వారిచే ఉపదేశం పొందారట నామదేవులవారు. ఈ విధంగా పూర్ణత్వం పొందారట.

## విశేషమైన కాగడహారతి

పండరీపురంలో పాండురంగనికి జరిగే కాగడహారతి చాలా విశేషమైనది. పాండురంగనికి ఇష్టమైనది.

అక్కడ అందరిలోనూ పాండురంగడు కనిపిస్తాడన్న విశేషంకూడా ఉంది. ఒకసారి హారతిసమయంలో అందరూ గానం, నృత్యం చేస్తున్నారు. అందరిలోను పాండురంగని రూపమే కనబడుతోంది. ఒకసారి రుక్మిణిమాత వచ్చి పాండు రంగనికోసం వెతుకుతున్నారు. అక్కడ అందరూ పాండు రంగనిలాగనే ఉన్నారని నామదేవునిదగ్గరకు వచ్చి, నామదేవా! నీవు స్వామివారి ఆంతరంగిక భక్తుడవు. వీరిలో స్వామి వారెవరో చెప్పు అని అడిగిందట. అప్పుడు నామదేవుడు రుక్మిణిమాతకు నమస్కరించి అమ్మా! అసలైన పాండురంగడు వైజయంతీమాలాధరుడు అని తెలిపాడట. వెంటనే పాండు రంగడు ప్రత్యక్షమై అక్కడ నిలిచాడట.

సర్వత్రా పాండురంగుని దర్శించుకుంటూ, కీర్తనలతో గానం చేస్తూ దివ్యానుభూతులను పొందాడు నామదేవుడు.

పండరీపురంలోని పాండురంగ ఆలయప్రాంగణంలో సంత్ నామ్‌దేవ్ విగ్రహం ఉంది. భక్తులు ఆ విగ్రహాన్ని దర్శించి నామ్‌దేవ్ మెట్లద్వారా ప్రధాన ఆలయంలోనికి ప్రవేశిస్తారు.

ఒక మహాభక్తుడు, కారణజన్ముడు అయిన సంత్ నామ్‌దేవ్ జీవితం ఆదర్శవంతమైనది. వారు సదా భక్తికి మారుపేరు. వారు అందించిన అభాంగాలు మార్గదర్శనమై వేనోళ్ళ కీర్తించి గానం చేయబడుతున్నాయి. ధార్మికనైతిక జీవనవిధానాలలో మానవసమాజం వర్ధిల్లేలా కృషి చేసిన మహోన్నత భక్తశిఖామణి, భగవత్‌స్వరూపుడు సంత్ నామ్‌దేవుడు.

అటువంటివారి నిస్వార్థ జీవనస్థితిగతులను మరింతగా తెలుసుకుంటూ ముందుతరాలకు వాటి మాధుర్యాన్ని, జ్ఞానాన్ని అందజేయడం మనందరి బాధ్యతగా, కర్తవ్యంగా భావిద్దాం.

## 2026, మే నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | కూర్మజయంతి |
| 01-09 | నాగులాపురం, శ్రీ వేదనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవం |
| 02 | అన్నమాచార్యజయంతి |
| 12 | తిరుపతి గంగజాతర |
| 23 - 31 | తిరుపతి, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం |


నీకు నీవే గొప్ప అనుకోకు. నలుగురు నీ గురించి గొప్పగా చెప్పుకుంటేనే గొప్ప

మన మహర్షులు

# భృగుమహర్షి ముఖతః

– శ్రీ పింగళి పాండురంగరావు,
94405 54114



**2026, ఏప్రిల్ 20న
భృగుమహర్షి వర్షతిరునక్షత్రం సందర్భంగా...**

బ్రహ్మదేవుని హృదయంనుండి జన్మించిన నవ బ్రహ్మలలో భృగుమహర్షి ఒకడు.

భృగువు కైలాసపర్వతప్రాంతంలో తపస్సు చేసుకొంటున్నపుడు భరద్వాజమహర్షి వచ్చాడు. భృగువు అర్ఘ్యపాద్యాలిచ్చి గౌరవించాడు. భరద్వాజుడు భృగువును ఇలా అడిగాడు. "మహాత్మా! నీ వద్ద కొన్ని విషయాలు తెలుసుకోవాలని వచ్చాను. ఈ భూతసృష్టి ఎలా జరుగుతోంది? జీవుల జీవన్మరణాలు మున్నగునవి ఎలా జరుగుతున్నాయి? తెలుపండి" అని అడిగాడు. సత్యం ఒకరికి తెలిసినా, ఎదుటివారి ముఖంనుంచి తెలుసుకోవటంలో నూతనభావాల్ని కలిగిస్తాయి. అందుచేత అడిగాడు.

అపుడు భృగువు "భరద్వాజా! సనాతనుడు, అవ్యయుడు, అనంతుడూ అయిన ఒక నారాయణుడు ఉన్నాడు. అతను భూతసృష్టి చేయటానికి తనలోని సహస్రాంశాన్ని బయటకు తెచ్చి, మనస్సు అనే జరామృత్యువు లేనటువంటి ఒక అనుపమానమైన వ్యక్తిని సృష్టించాడు. అతడిలోనుండి మహత్తు అనేటటువంటిది ఒకటి పుట్టింది. అతడినుండి దివ్య తేజోమయమైన ఒక పద్మాన్ని సృష్టించాడు. ఆ పద్మంలోనుండి బ్రహ్మ పుట్టాడు. ఆ బ్రహ్మ ఆకాశము, జలము, వాయువు, అగ్ని, మరుత్తులు, భూమిని సృష్టించాడు. అఖిల భూతాత్ముడై అతడికే కారణమైనవాడు విష్ణువు. ఈవిధంగా చూస్తే, విశ్వం అంతా శ్రీమహావిష్ణువువల్లనే కలిగింది" అని అన్నాడు భృగువు.

అపుడు భరద్వాజుడు ఈ పంచభూతాల పరిమాణమెంత అని అడిగాడు. విశ్వపరిమితమూ, అపరిమితమూ ఇంతవరకు శాస్త్రజ్ఞులకే అంతుచిక్కక పరిశోధిస్తూనే ఉన్నారు. అందుకు భృగువు భూతములన్ని అనంతంగా ఉన్నాయని జవాబు చెప్పాడు. అప్రమేయం అంటే ఇంత అని పరిమాణం చెప్పలేం. కనుకనే ఇదంతా వ్యాపించినదంతా ఆయన శరీరమే కాబట్టి మనం విష్ణువును అనంతుడు అని అంటాం. ఇలా చాల విషయాలు భరద్వాజుడు భృగువునుండి తెలుసుకొన్నాడు.

అనంతాన్ని అంటే విష్ణువును మానవ మనస్సుతో అవగాహన చేసుకోలేమని తెలుసుకోవాలి. భృగువు వసువుల విషయంకూడ చెప్పాడతడు. ఇంద్రియాలు, మనస్సు, అంతరాత్మ విషయాలనుగురించి చెప్పి మనోబుద్ధిచిత్తములు అనేకస్థాయిలలో ఉంటాయని అర్థం చేసుకోవాల్సి ఉంది.

చతుర్వర్ణాశ్రమాలగురించికూడ చాల చెప్పాడు. "సత్యమే తపస్సుకు ధ్యేయం. సత్యం నీవనే నిష్ఠ కలిగి తపస్సు చెయ్యి. సత్యాన్నిగురించే తపస్సు. అదే నా ధ్యేయం అని చెప్పాలేగాని వేరేవిధంగా చెప్పకూడదు. సత్యం మరిచి చేసే ధ్యానమే తపస్సు. తపస్సు చివరిదశ సత్యం. కనుక తపస్సు సత్యాన్వేషణమే అని తేలుతుంది. సత్యమే బ్రహ్మము. ఒకనికి బ్రహ్మజ్ఞానం అసత్యాజ్ఞానమే కాని సత్యజ్ఞానము కాదు. దీనిలో గురుబోధ ఏమిటంటే– "నీ అనుభవం నీదే. నీ అనుభవం ఇంకొకరికి సత్యం కానవసరం లేదు. అసత్యాన్ని సత్యం అని

నమ్మేవాడికి, సత్యమనేది ఇంకొకటి ఉందనే భావన వాగ్రూపంలో సాధ్యం కాదు." అని, అసత్య, సత్యపదార్థాలు రెండున్నాయని చెప్పడం సబబు కాదు. మనిషికి తాను ఉండటమే సత్యం. తన ప్రపంచమే సత్యం. ఎంతకాలం ప్రపంచం యదార్థమైనదో అంతకాలం పరమసత్యమైనదని అతనికి తెలియదు. అతడికి ఇదే ఉంది. పరమాత్మ దర్శనం చేసుకొన్నవాడికి ఒకటే అనుభవం ఉంటుంది. దర్శనం కాని వాడికి అసత్ పదార్థమే అతడియందు ఎల్లప్పుడూ ఉంటుంది.

ఇప్పుడు చాలా సుఖం, ఐశ్వర్యం, యోగం అన్నీ ఉన్నాయి. అవి ఎంత ఉన్నప్పటికీ మనిషిని శాశ్వతంగా కనిపెట్టి ఉండేది మృత్యువు. మిగతావి ఉన్నాయో లేవో తెలియక పోయినా, మరణంగురించి అందరికీ తెలుసు. కనుక మృత్యువే ఆ జీవుడికి, జగత్తుకు వినాశకారి. మరణించినవానికి జగత్తు లేదు. కనుక జగత్తుకూడ అసత్యమని మానవుడు తెలుసు కోవచ్చు.

అశాశ్వతమైన లౌకికసుఖాలకొరకే యజ్ఞం చేయబడు తుంది. అది జ్ఞానప్రదం కాదు. జ్ఞానంకోసం ఎవరూ యజ్ఞం చేయరు. మంత్రబలంతో మనం శక్తులను ఆరాధిస్తాం. అవిద్య, అజ్ఞానంలోనుండే యజ్ఞం జరుగుతుంది. యజ్ఞంలోని సర్వం యజమానిని సుఖవంతుణ్ణి చేస్తుంది. యజమానికి పుణ్య లోకాలకు వెళ్ళే మార్గాలను చూపిస్తుంది. కీర్తివంతుణ్ణి చేస్తుంది. అదే కదా అన్ని మంత్రాలు చెప్పేది. కాని యజమాని శాశ్వ తుడు కాదు. కనుక ఈ భారతదేశంలో సత్త్వగుణసంపన్నులు ఎవరైతే ఉన్నారో అలాటివాళ్ళకు కష్టములు రాకుండు గాక! అనేంతవరకే, ఆ కోరికతోనే యజ్ఞం చేయాలి. అలా ఫలితమైనా లభించేది.

అనంతమైన మోక్షమనే విషయానికి వస్తే, కర్మవల్ల మోక్షం రాదు. కనుక మనం ఆశ్రయించవలసింది అనంత దయామయుడైన ఈశ్వరుడినే. ఆయన కరుణ మాత్రమే ఆధారం, మన అర్హత కాదు. మనకు అర్హత లేకపోవచ్చు. కాని ఈశ్వరకరుణకు అర్హతానర్హతలు చాల స్వల్పాలు. దానిని ఆధారం చేసుకొని మనం ముక్తికోసం ప్రార్థించాలి.

వేదాలు చదివేవారు, తపస్సు చేశాను మోక్షం లభిస్తుం దని ఎవరూ అనుకోరాదు. ఇంత తపస్సుతో నాకు మోక్షం వచ్చేసిందని, నా పని ఇక లేదు అని, లోకక్షేమంకోసమే జీవిస్తున్నానని జ్ఞాని ఎప్పుడూ అనుకోడు. జీవన్ముక్తిలోకూడ అలా తలవడు. అనంత కరుణామయుడైన హరియే ముక్తినిస్తాడు, ఆయన్ని అలా కోరుకోవాలి. సత్కార్యాలు చేశాను, ముక్తి రమ్మంటే రాదు. కర్మకు, ముక్తికి సంబంధం లేదు. కర్మ బంధనం కదా! ముక్తి ఎలా వస్తుంది? కర్మవల్లనే మనం జన్మించాం, మళ్ళీ కర్మల్ని చేస్తున్నాం. మరి ముక్తి ఎలా వస్తుంది? వైరాగ్యప్రవృత్తియందు నిష్ఠ కలిగినపుడు మాత్రమే పరమపదం పొందుతాడు అని భృగుమహర్షి బోధించాడు.

తరువాత భరద్వాజుడు ఇహానికి, పరానికి భేదం ఏమిటి? అని అడిగాడు. దానికి భృగువు "ఇహలోకం, కర్మభూమి. భోగాలతో కూడినటువంటిది. సుఖదుఃఖములతో కూడినది. ఎక్కువ సౌఖ్యాలు, అనంతమైనది స్వర్గం అన బడుతుంది. ఆ లోకసుఖానికి, ఇహలోకసుఖానికి పోలికే లేదు. అహంకార మమకారాలు వదలినవాళ్ళు, పుణ్య పాపమార్గాలను విసర్జించినవాళ్ళు లోకాలలో ద్రిమ్మరులై తిరుగగలరు. వాళ్ళు లోకద్రిమ్మరులు, పుణ్యజీవులు. కర్మలు చేసి పుణ్యలోకాలకు వెళ్తూ, వస్తూ ఉంటారు. కాని మొదటి తరగతివారు మాత్రం తిరుగక శాశ్వతానందం ఉన్నచోటే ఉండిపోతారు. ఈ శరీరంలోనే ఉండి శాశ్వతానందాన్ని పొందే ప్రయత్నం చేస్తాడు. దానికి దివ్యశరీరాలు, దివ్యలోకాలు మున్నగునవేవీ అవసరం లేదు. ఉత్తమలోకాల్నికూడా కోరుకోరు. వివేకి అయినవాడు ఈ మానవజీవనాన్ని చూచి భయపడక, శాశ్వతమైన శాంతి కలగటానికి ఇక్కడే ప్రయత్నం చేస్తాడు. ఈ విధంగా భృగుమహర్షి భరద్వాజునకు అనేక విషయాలు చెప్పాడు. ఈ కథ భారతంలో శాంతిపర్వంలో ఉంది.

నిజ తపోనిష్ఠచేత బ్రహ్మత్వం పొంది, భృగువంశానికి మూలపురుషుడైన భృగుమహర్షి మహత్తు, అనేకమంది మహాత్ములు ఆ వంశంలో జన్మించడంచేత మనము తెలుసుకో గల్గుతున్నాం వారి ద్వారా. భృగుమహర్షి చివరకు పరబ్రహ్మను సంధానంచేసి, ఆయనలో లీనమైనాడు. ఆయన పవిత్ర నామామృతంవలన, ఆ నామస్మరణ చేస్తేనే, మన సకల పాపములు నశిస్తాయని పెద్దలమాట.

# 108 దివ్యదేశాలు

# శిరీవరమంగై

## (వానమామలై)

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

108 దివ్యదేశములలో ఎనిమిది దివ్యదేశాలు స్వయంవ్యక్త క్షేత్రములుగా భాసిల్లుతున్నాయి. అందులో వానమామలై అనే శిరీవరమంగై దివ్యదేశంకూడా ఒకటి అని స్థలపురాణం చెప్తున్నది. గగనగిరి అని సంస్కృతంలో ఈ దివ్యదేశాన్ని వ్యవహరిస్తూంటారు. అలాగే నాన్గునేరి అనికూడా పిలుస్తారు. ఈ దివ్యదేశం తిరునెల్వేలి, తూత్తుక్కొడి వెళ్లేదారిలో సుమారు 25 కిలోమీటర్లదూరంలో, మూడు ప్రాకారములతో, ఏడు అంతస్తులతో, రాజగోపురంతో తూర్పుదిక్కునుచూస్తూ మూలమూర్తి తోతాద్రినాథుడు, అలాగే వానమామలై అని నమ్మాళ్వార్లచేత మంగళాశాసనం చేయబడినపేరుతో శ్రీవైకుంఠంలో ఎలా భగవంతుడు వేంచేసిఉంటాడో అలాగే ఈ స్వామి ఇచ్చట వేంచేసి దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నారు. మూలమూర్తికి రెండుప్రక్కలా శ్రీదేవి, భూదేవితోపాటు శిరీవరమంగైఅమ్మవారు వేంచేసి ఉన్నారు. మూలమూర్తి సన్నిధిలో సూర్యుడు, చంద్రుడు, ఊర్వశి, తిలోత్తమ, భృగుమహర్షి మరియు మార్కండేయమహర్షి వీరందరుకూడా వేంచేసి ఉండటం ఈ క్షేత్రప్రాశస్త్యం. అలాగే ఈ ముగ్గురు అమ్మవార్లుకాకుండా ప్రత్యేకసన్నిధిలో ఇద్దరు అమ్మవార్లుకూడా వేంచేసి ఉన్నారు. ఊర్వశి మరియు తిలోత్తమ వీరిరువురు స్వామికి వింజామరలు వీస్తుంటారు.

### వైశిష్ట్యం -

వానమామలై స్వామివారికి ప్రతిరోజుకూడా (365 రోజులు) మంచినూనెతో తైలాభిషేకం జరుగుతుంది. ఈ అభిషేకించిన మంచినూనెను ఒకబావిలో భద్రపరచి దానిని భక్తులందరికీ పంచిపెడతారు. ఆ నూనెను ఎవరు రాసు కుంటారో వారికి సకల రోగములన్నియూ తొలగిపోతాయి. అలాగే తైలాభిషేకం విశేషంగా తమిళ తైనెల అమావాస్యనాడు అత్యద్భుతంగా జరుగుతుంది. దాదాపు 210 లీటర్ల మంచి నూనెతో అబిషేకం జరగడమన్నది ఇంకెక్కడాకూడా లేదు. కొంతమంది భక్తులు ఈ నూనెను తీసుకుని భక్తితో స్వీకరించి, సకలవ్యాధులనుండి విముక్తులు అవుతారు.

### రెండవ విశిష్టాంశం-

నవతిరుపతులలో ఆళ్వార్ తిరునగరి తప్పితే మిగతా ఎనిమిది దివ్యదేశాలలో నమ్మాళ్వార్లవిగ్రహం కనిపించదు. ఇచ్చట ఈ దివ్యదేశంలో నమ్మాళ్వార్లవిగ్రహం లేకపోయినా కూడా ఆ తోతాద్రినాథునికి శ్రీశఠారిగా, విగ్రహమూర్తిగా వారు సేవను ప్రసాదిస్తున్నారు.

### పేరువైభవం-

తోతాద్రినాథుడు అనే మూలమూర్తి నామానికి కారణం ఏమిటంటే తుదతి ఆశ్రితానాం పాపాని (భక్తుల పాపము లన్నియూకూడా పోగొట్టేటటువంటి ఒక పర్వతసదృశుడైన స్వామి కనుక వారికి తోతాద్రినాథుడు అని పేరు కలిగింది. గగనగిరి వానమామలై అని పేరు. వాన్ అనే శబ్దానికి ఆకాశం. ఆకాశం అంత ఎత్తుకు పర్వతంవలె స్వామివారి దివ్యమంగళ విగ్రహం ఉంటుంది కనుక ఆ దివ్యదేశానికి గగనగిరి

| | | |
|---|---|---|
| భగవానుడు | : | వానమామలై, తోతాద్రినాథుడు |
| అమ్మవారు | : | శిరీవరమంగైతాయార్, శ్రీదేవి, భూదేవి |
| స్థలతీర్థం | : | ఇంద్రతీర్థం, శేత్తుత్తామరైతీర్థం |
| క్షేత్రం | : | శిరీవరమంగై |
| విమానం | : | నందవర్ధవిమానం, శ్రీవైకుంఠవిమానం |
| ప్రత్యక్షం | : | భృగు, రోమశ, మార్కండేయాదులకు |
| నది | : | తామ్రపర్ణీనది |
| ముఖము/స్థితి | : | తూర్పుముఖము |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్లు |
| ఆగమం | : | వైఖానసఆగమం |
| ఉత్సవమూర్తులు | : | దైవనాయకుడు |

వానమామలై అనే పేర్లు వచ్చాయి. అలాగే నాన్గునేరి అని పేరు. నాన్+ కు+ ఏరి అంటే ఇచ్చట పెద్దచెరువు ఉంది. దానికి శేత్తుత్తామరై అని పేరు. నాలుగు విభాగాలుగా, నాలుగు పాయలుగా చీలి సముద్రంవలె కనిపిస్తుంది కనుక దీనికి నాన్గునేరి అనే పేరు కలిగింది.

## స్థలపురాణం -

శిరీవరమంగలనగర్ అని పిలువబడే ఈ స్వయం వ్యక్తక్షేత్రంలో భగవంతుడు అనాదిగా మనకు శ్రీవైకుంఠనాథుని వలె సేవలు ప్రసాదిస్తున్నాడు కనుక ఈ స్థలమునకు స్వసంకల్పాయంగా స్వామివారు వేంచేసి ఉన్నారు. అలాగే శ్రీవరుడు అనే రాజు పరిపాలిస్తున్న సందర్భంలో భగవంతుని అద్భుతమైన స్వరూపాన్ని దర్శించి ఈ స్థలంలోనే తమరు వేంచేసి ఉండాలని కోరాడు కనుక దీనికి శిరీవరమంగై అని పేరు కలిగింది. ఆచార్యులైన మణవాళమహాముని అష్టదిగ్గజము లలో ఒకరైన "పొన్నడిక్కాల్ జీయర్" వారి నిర్వహణలో భగవంతుడు ఈనాటికికూడా ఆరాధనలు అన్నిటినీకూడా అందుకుంటున్నారు. ఈ పొన్నడిక్కాల్ జీయర్ పూర్వాశ్రమ కుమార్తె అయిన శిరీవరమంగై నాచ్చియార్ ఇక్కడ వేంచేసి ఉన్నారు. ఈనాటికికూడా కనుమనాడు అమ్మవారు పొన్నడిక్కాల్ జీయర్ (వానమామలై) మఠానికి వెళ్లి అక్కడ పూజలు అందుకుంటుంది. భగవంతుడు తోతాద్రినాథుడుగా, వానమామలైగా ముఖ్యంగా శిరీవరమంగై అనే అమ్మవారి పేరుతోనే స్వామివారు పిలువబడుతున్నారు. ఐశ్వర్యాన్ని, పరమపదాన్ని అందించినాకూడా ఇంకా భక్తులకు నేను ఏమి ఇవ్వలేదు అని ఆ శిరీవరమంగ అక్కడ వేంచేసి ఉంటుందట.

చాలాకాలానికి ముందు మట్టితో కప్పబడి, పుట్టలతో నిండిపోయి కనిపించకుండా ఉన్నసందర్భంలో శ్రీవరుడు అనే రాజు ఈ మట్టితో కప్పబడిన ఆ ప్రదేశాన్ని గునపంతో కొట్టగా మట్టిలో భగవంతుని దివ్యమంగళవిగ్రహం తగిలిందట. దీన్నిచూసిన వెంటనే, అయ్యో! ఇది అపచారమే అని రాజు బాధపడుతుండగా ఆ సమయంలో దేవదేవుడు నూనె రాసి ఆ గాయాన్ని మాన్పమని చెప్పగా ఆ వృత్తాంతాన్ని ప్రతిఒక్కరూ కూడా తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో నాటినుండి నేటివరకు ప్రతిరోజు స్వామివారికి మంచినూనె అభిషేకం జరుగుతూ ఉండటం విశేషం. ఇలా ఎన్నో స్థలపురాణాలతో ఈ దివ్యదేశం విలసిల్లి ఉన్నది. అలాగే ఊర్వశి, తిలోత్తమ వీరందరూకూడా మాకు మరుజన్మ కూడదు అని సంకల్పించుకుని ఈ దివ్య దేశంలో స్వామివారి కైంకర్యం చేస్తూ తపస్సు చేసినట్లు పురాణం చెబుతున్నది. అందువల్ల ఈనాటికికూడా వింజామర కైంకర్యాన్ని వారు చేస్తున్నారు. ఈ ప్రకారంగా వానమామలై దివ్యదేశం అన్ని దివ్యదేశాలకంటేకూడా ఎంతో వైభవంతో ప్రకాశిస్తున్నది. భక్తులందరూకూడా ఈ దివ్యదేశానికి వచ్చి స్వామివారిని సేవించి, స్వామివారికి అభిషేకించినటువంటి ఆ తైలాన్ని స్వీకరించి సకలపాపాలనన్నింటినీ పోగొట్టుకుని దేవదేవుని దివ్యఅనుగ్రహంతో పరమపురుషార్థాన్ని పొంది తరిస్తారు.

## ధ్యానశ్లోకం :

యస్మిన్ అమ్బుజలోచనోమరపతిః ప్రత్యక్షదివ్యాకృతిః
పద్మాక్ష్యా సహ పూర్వసాగరముఖశ్చ ఐన్ద్రం సరో నిర్మలమ్।
పద్మాకారవిమానవాసరసికం తేజోమయం భాస్కరం
నిత్యం శ్రీవరమంగలాఖ్యనగరం వన్దామహే శాశ్వతం॥

### శ్రీపదకేళి
### :: 123 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | | | 2 మో | హ | 3 ము | | | |
| ద్మా | | | హి | | 4 స | ర | 5 స్వ | తి |
| 6 వ | రూ | 7 ధి | నీ | | ల | | ప్న | |
| తి | | ష | | | ము | | 8 ము | క్తి |
| | 9 ప్రా | ణ | దు | డు | | 10 కు | | |
| | చీ | | | | 11 కు | శ | స్థ | లి |
| 12 శి | శు | పా | లు | డు | | ల | | |
| | డు | | | | 13 భ | వు | డు | |
| | | 14 క | పి | ల | | లు | | |



ఎవరూ ఊరికే కఠినంగా మారిపోరు. కొన్ని పరిస్థితులు వారిని అలా మారేలా చేస్తాయి

శ్రీఅనంతాళ్వాన్ అనుగ్రహించిన

# శ్రీ రామానుజ చతుఃశ్లోకి

–డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు



**22-04-2026న**
**శ్రీభాష్యకారుల శాత్తుమొఱ**
**&**
**శ్రీ రామానుజ జయంతి**
**సందర్భంగా....**

శ్రీస్వామి రామానుజులవారిపై అపారమైన భక్తి కలిగిన వారు శ్రీఅనంతాళ్వాన్. వీరు కర్ణాటకరాష్ట్రంలోని మాండ్యజిల్లాలో ఉన్న 'సిరుపుత్తూర్' (నేటి కిరంగనూర్- మేల్కోటై సమీపంలో) అనే అందమైన గ్రామంలో, చిత్తామాసం, చిత్తానక్షత్రంలో జన్మించారు. వీరి అసలు పేరు అనంతార్యులు.



**వీరి తనియన్ (గురుప్రార్థన)**

అఖిలాత్మ గుణావాస మజ్ఞాన తిమిరాపహమ్ ।
ఆశ్రితానాం సుశరణం వందే అనంతార్య దేశికమ్ ॥

శ్రీమద్రామానుజాచార్య శ్రీపాదమ్ భోరుహద్వయమ్ ।
సదుత్తమాంగ సందార్య మనంతార్యమహం భజే ॥

చక్రే గోదా చతుఃశ్లోకీం యో వేదార్థ ప్రగర్భితమ్ ।
శ్రీ వేంకటేశ సద్భక్తం త మనంతగురుం భజే ॥



వేదార్థాలను తనలో నింపుకున్న "**గోదా చతుఃశ్లోకీ**" అనే స్తుతిని అనుగ్రహించిన గురువులు, తిరుమల అనంతాన్ పిళ్లై (అనంతాళ్వాన్)ను నేను పూజించి ప్రార్థిస్తున్నాను.

**1) శ్లోకం: (శ్రీరంగం)**

అనిశం భజతామ్ అనన్య భాజామ్
చరణాంభోరుహ మాదరేణ పుంసామ్ ।
వితరన్ నియతం విభూతి మిష్టామ్
జయ! రామానుజ! రంగ ధామ్ని నిత్యమ్ ॥

**వివరణ:** ఓ రామానుజా! దేవరవారి (మీ) తిరువడిలను (పాదాలను) పట్టుకుని, వేరే దిక్కు లేని అడియవరులకు (భక్తులకు), వారు కోరుకున్న విభూతిని (కైంకర్యసంపదను) అనుగ్రహిస్తూ, శ్రీరంగం పెద్ద కోవెలలో విజయశ్రీగా (విజయలక్ష్మివలె) వెలుగొందండి.

(**విశేషం:** అనంతాళ్వాన్‌కు ఇష్టమైన ఆచార్య కైంకర్యాన్ని ఇక్కడినుండే కదా ఉడైయవర్ ప్రసాదించారు!)

**2) శ్లోకం: (తిరుమల - తిరువేంగడమ్)**

భువి నో విమతాన్ త్వదీయ సూక్తి:
కులిశీభూయ కుదృష్టి భిస్సమేతాన్ ।
శకలీ కురుతే విపక్ష దీర్ఘా
జయ! రామానుజ! శేష శైల శృంగే ॥

**వివరణ:** అప్పుడైన వేంకటేశ్వరునికి శంఖచక్రాలను సమర్పించినవాడా!) దేవరవారి శ్రీసూక్తులు వజ్రాయుధంవలె ఉండి, కుదృష్టులైన (వేద విరుద్ధులైన) శత్రువులను పొడి పొడి చేస్తాయి. "వేదార్థసంగ్రహం" అనే గ్రంథాన్ని దేవరవారు అనుగ్రహించినందున, ఇది వారు రచించిన మొదటి గ్రంథం అని అంటారు. మీరు తిరువేంకటగిరి శిఖరంపై





అనేక సంవత్సరాలు విజయ తిరుమగళ్ (విజయలక్ష్మి)తో ప్రకాశించాలి!

(**విశేషం**- ఇతర సంప్రదాయాల్లో గీత, ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలను ప్రస్థానత్రయం అంటారు. కానీ, మన సంప్రదాయం ఒకే మార్గం- అన్నీ ఒకే కరుణాభావాన్ని కలిగి ఉంటాయి. మదపుటేనుగు తన ఆడఏనుగుకోసం వెదురును వంచి తేనెను కలిపి ఇచ్చే తిరువేంకటం ఇది. మన రామానుజులు మునివేజం (మునిశ్రేష్ఠుడు) వలె అనంతాళ్వాన్‌కు వేదార్థాలను సమన్వయపరిచి సర్వం సమంజసం చేశారు)

**3) శ్లోకం: (కాంచీపురం - హస్తిగిరి)**

శ్రుతిషు స్మృతిషు ప్రమాణతత్త్వం
కృపయాలోక్య విశుద్ధయా హి బుద్ధ్యా ।
అకృథాస్స్వత ఏవ భాష్య రత్నం
జయ! రామానుజ! హస్తి ధామ్ని నిత్యమ్ ॥

**వివరణ:** ఓ శ్రీభాష్యకారా! యతిరాజా! నిర్హేతుక కృపతో శ్రుతి, స్మృతులలోని ప్రమాణాల సత్యాన్ని, దోషం లేని బుద్ధితో నిష్పక్షపాతంగా విచారించి "శ్రీభాష్యం" అనుగ్రహించారు. అట్టి మీరు శ్రీహస్తిగిరిలో (కాంచీపురం) విజయంతో "నిత్యశ్రీ"గా వెలుగొందాలి.

(**విశేషం:** వరదరాజ పెరుమాళ్ కోవెలకి, శ్రీభాష్యానికి గొప్ప సంబంధం ఉంది. కిరాతదంపతులుగా (వేటగాళ్ళుగా) వచ్చి రామానుజులను కాపాడింది ఇక్కడే. వరదరాజస్వామి ఆరు మాటలను (షణ్మతస్థాపన) అనుగ్రహించిందికూడా ఇక్కడే.

శ్రీభాష్యం వ్రాయడానికి పేరరుళాళన్ (వరదరాజస్వామి) కృపయే కారణం. యామునాచార్యులవారు రామానుజులను చూసి 'ఇతడే మన సంప్రదాయాన్ని ఉద్ధరించే వాడు" అని భావించి, పెరుమాళ్ అనుగ్రహంతో వారిని మన సంప్రదాయంలోకి తీసుకువచ్చారు. యామునుల మూడు కోరికలను తీర్చి, కూరత్తాళ్వాన్ సహాయంతో భాష్యం పూర్తి చేసిన వైభవం ఇక్కడిదే).

**4) శ్లోకం: (యాదవాద్రి - మేల్కోటై)**

జయ! మాయిమతాంధకార భానో!
జయ! బాహ్య ప్రముఖాటవీ కృశానో! ।
జయ! సంశ్రిత సింధుశీతభానో!
జయ! రామానుజ! యాదవాద్రిశృంగే ॥

**వివరణ:**(ఆదిశేషావతారమైన లక్ష్మణమునీ!) మాయావాదుల మతమనే చీకటికి సూర్యునివంటివాడా! బాహ్యాకుదృష్టులనే అడవికి దావాగ్నివంటివాడా! నిన్ను ఆశ్రయించిన భక్తులనే సముద్రం పొంగేలా చేసే చంద్రునివంటివాడా! యతిరాజా! తిరునారాయణపురమైన (శ్రీబలరాముడు పాలించిన) యాదవాద్రిలో నిత్యశ్రీని వృద్ధి చేస్తూ కలకాలం వర్ధిల్లాలి.

(**విశేషం**- తొండనూరు వాదంలో- రామానుజులు ఆదిశేష రూపంలో తెరవెనుకనుండి వేయిమందిని ఏకకాలంలో ఓడించారు. అపారమైన కరుణతో అందరినీ సరిదిద్దారు. 12 సంవత్సరాలు ఇక్కడే ఉండి భక్తులకు చంద్రునిలా





చల్లదనాన్ని ఇచ్చారు. ఇక్కడే 'తమరుగంత తిరుమేని' మరియు 'మాట్లాడే ఎదురాజరు' (ముచ్చటించే రామానుజులు) అనే విగ్రహరూపాలు ఉన్నాయి)

**ఫలశ్రుతి**

రామానుజ చతుఃశ్లోకీం
యః పఠేన్నియతః సదా ।
ప్రాప్నుయాత్ పరమాం భక్తిం
యతిరాజ పదాబ్జయోః ॥

**తాత్పర్యం:** ఈ శ్రీ రామానుజ చతుఃశ్లోకీని ఎల్లప్పుడూ పారాయణం చేసేవారికి, శ్రీ యతిరాజుల (రామానుజుల) పాదపద్మాలపై పరమభక్తి కలుగుతుంది. భక్తి దినదినాభివృద్ధి చెందుతుంది. ఆచార్య అభిమానమే మోక్షానికి మార్గం కాబట్టి, వారు తగిన ఫలాన్ని పొందుతారు.


*శ్రీరామానుజాచార్యులు (1017-1137) వెయ్యేళ్లక్రితమే కులవర్ణభేదాలను వ్యతిరేకించి, సమానత్వం మరియు భక్తిమార్గాన్ని బోధించిన గొప్ప సామాజిక సంస్కర్త. విశిష్టాద్వైతసిద్ధాంతకర్త. తమిళనాడులో పెరంబుదూరులో పుట్టిన ఆయన 120 ఏళ్ల సుదీర్ఘజీవనయాత్రలో మానవతా విలువలకు పెద్దపీట వేస్తూ దేవునిముందు అందరూ సమానమేనని చాటి చెప్పారు. వేదాలు, ధార్మికగ్రంథాలు అందరికీ అందుబాటులో ఉండాలని, భగవంతుని నామాన్ని స్మరించే హక్కు అందరికీ ఉందనీ ఆయన నొక్కి వక్కాణించారు.*



తిరుమలలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి 26-02-2026 నుండి 02-03-2026 వరకు కన్నులపండువుగా జరిగిన సాలకట్ల తెప్పోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., ముఖ్యనిఘా మరియు భద్రతాధికారి శ్రీ కె.వి.మురళీకృష్ణ, ఐ.పి.ఎస్., మరియు ఇతర ప్రముఖులు.



తిరుమల శ్రీవారి ఆలయంలో 2026, మార్చి 06న తి.తి.దే. పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారి మరియు తి.తి.దే. పాలకమండలి ఎక్స్‌అఫిషియో మెంబరుగా శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., వారిచే ప్రమాణస్వీకారం చేయిస్తున్న తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి సిహెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.,



తిరుమల శ్రీవారి దర్శనార్థం 2026, మార్చి 01న తిరుమలకు విచ్చేసిన భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మరియు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌లకు రంగనాయకుల మండపంలో స్వామివారి శేషవస్త్రం, శ్రీవారి చిత్రపటం మరియు తీర్థప్రసాదాలు అందిస్తున్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., మరియు అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.హెచ్. వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.



తిరుమలలోని అన్నమయ్యభవనంలో 2026, ఫిబ్రవరి 28న తి.తి.దే. వారి శ్రీ పరాభవనామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించిన తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ముద్దాడ రవిచంద్ర, ఐ.ఏ.ఎస్., మరియు పాలకమండలి సభ్యులు.



తిరుమలలోని అనంతాళ్వార్ తోట (పురిశైవారి తోట)లో 2026, ఫిబ్రవరి 22న జరిగిన శ్రీ అనంతాళ్వార్ 972వ అవతార మహోత్సవాల సందర్భంగా అందులో పాల్గొని ప్రసంగిస్తున్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి డా॥ ఏ.శరత్, విశ్రాంత ఐ.ఏ.ఎస్., (విద్య & వైద్య విభాగాలు)

**2026, ఏప్రిల్ 05న సంకటహరచతుర్థి సందర్భంగా...**

# అయ్యా! సంకటాలు తొలగించుమయా!!

- శ్రీ డి.బి.ఆర్.శర్మ, 92907 30792




**ఓం గం గణపతయే నమః**

**వక్ర తుండ మహా కాయ, సూర్య కోటి సమప్రభ!**
**నిర్విఘ్నం కురు మే దేవా, సర్వ కార్యేషు సర్వదా!!**

వినాయకునిపూజచేసే అనేక విధివిధానాలు ఉన్నప్పటికీ, ముఖ్యమైనవి వినాయకచవితి మరియు సంకటహర చతుర్థి. హిందువులు పవిత్రంగానూ, ప్రభావవంతమైనదిగానూ భావించే సంకటహరచతుర్థివ్రతాన్ని ప్రతీనెల కృష్ణపక్షంలో వచ్చే నాల్గవతిథినాడు అంటే చవితినాడు నిర్వహిస్తారు. "సంకట హర" అంటే కష్టములు హరించునది అని అర్థం. ఈ సంకట హరచతుర్థి మంగళవారంనాడు వస్తే మరింత ప్రభావవంత మైన అంగారకచతుర్థిగా భావిస్తారు. ప్రతీవ్యక్తికీ జీవితంలో అనేకకష్టాలు కలుగుతూ ఉంటాయి. వాటిని తొలగించు కోవటానికి మానవప్రయత్నం తప్పనిసరి అయినప్పటికీ, దైవబలంకూడా అత్యంత ఆవశ్యకం. దైవబలం సమకూరని మానవప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఈ వ్రతం మన కష్టనష్టాలు తొలగించుకోవటానికేకాకుండా జీవనసాఫల్యతకు, ఆధ్యాత్మికసాధనకు ఎంతో ఉపకరిస్తుంది.

పురాణాలప్రకారం శ్రీవినాయకుని నెలకొక నామ ధేయంతో పూజిస్తారు. వికటమహాగణపతి, కృష్ణపింగళ మహాగణపతి, గజాననమహాగణపతి, హేరంబగణపతి, గణదీప మహాగణపతి, లంబోదరమహాగణపతి, ద్విజప్రియగణపతి మొదలైన పేర్లతో కొలుస్తారు.

పురాణాలప్రకారం సంకటహరగణపతి లేత సూర్యుని వంటి ఎఱ్ఱని శరీరకాంతి కలిగి ఎఱ్ఱతామరపూవునందు ఉపవిష్టుడై, తన ఎడమభాగమున పచ్చని శరీరకాంతితో ప్రకాశిస్తున్న నల్లకలువపూవును చేతితో పట్టుకొన్న ప్రియురాలు బాలాదేవితో కలసి ఉంటుంది. ఈతనికి నాలుగుచేతులు, ఎడమవైపున పాయసపాత్ర, పాశము; కుడివైపున వరదహస్తము, అంకుశములు ధరించి ఉంటాయి. నల్లని వస్త్రములతో ఉన్న సంకటహరగణపతి రక్తవర్ణములో ఉంటాడు.

మన పురాణాలప్రకారం నలచక్రవర్తిని ఎడబాసిన దమయంతీదేవి ఈ పవిత్రవ్రతాన్ని చేసి నలుని తిరిగి పొందింది.

కృష్ణపక్షచతుర్థి మంగళవారంనాడు సంభవిస్తే, మరింత పుణ్యప్రదం మరియు ఫలప్రదం. దీనినే అంగారకచతుర్దశి అంటారు. మహర్షి భరద్వాజునకు జన్మించిన అంగారకుడనే కుమారుడు గణపతినిగురించి తీవ్రమైన తపస్సు ఆచరించాడు. ఒక మాఘకృష్ణ చవితిరోజు చంద్రోదయసమయాన గణపతి దర్శనమిచ్చి వరం కోరుకొమ్మని చెప్పగా "ఈ చవితిరోజున తమ దర్శనభాగ్యం కలిగింది కనుక ఈ చవితితిథి పరమపుణ్యప్రదమై, భక్తుల సర్వసంకటాలను హరించేటట్లు అనుగ్రహించు" అని కోరుకున్నాడు. గణపతి అందుకు అంగీకరించి, వరాన్ని ఇచ్చాడు. అప్పటినుండి మంగళవారం సంభవించే కృష్ణపక్షచతుర్థితిథికి "అంగారకచవితి" అని పేరు వచ్చింది. ఈ రోజు ఆచరించే వ్రతం అత్యంత ఫలాన్ని ప్రసాదిస్తుంది.

ఈ వ్రతాన్ని ఆచరించేరోజు ఉదయాన్నే నిద్రలేచి, దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకొని, తలస్నానమాచరించి, సంకటహరచతుర్థివ్రతం చేయటానికి సంకల్పం చెప్పుకోవాలి. రోజంతా ఉపవాసంతో స్వామివారిని ప్రార్థిస్తూ ఉండాలి. గణేశుడివిగ్రహాన్ని శుభ్రమైనప్రదేశంలో ఉంచి, దూర్వాగడ్డి, తాజాపువ్వులు, నెయ్యితో చేసిన దీపాలతో అలంకరించాలి. ఏదైనా కోరికతో చేసేవారు కొద్దిగా బియ్యాన్ని మూటగా కట్టి స్వామివద్ద పెట్టి తన కోరికను విన్నవించుకోవాలి. వినాయకునికి షోడశోపచారపూజను నిర్వహించాలి. వీలుననుసరించి ఏదైనా గణపతి ఆలయాన్ని దర్శించి వీలైనన్ని ప్రదక్షిణలు చేయటం మంచిది. సాయంత్రం సూర్యాస్తమయమైన తరువాత తిరిగి స్నానమాచరించి, చంద్రదర్శనం చేసుకొని, ఈ వ్రతం ఆచరించాలి. శ్రీనారదమహర్షి విరచితమైన "సంకటహర వినాయకస్తోత్రాన్ని" పఠించాలి. అలాగే గణపతి అథర్వశీర్షాన్ని కూడా పారాయణ చేయాలి. గణేశుడికి మోదకాలు మరియు లడ్డూలువంటి ప్రసాదాలను సమర్పించాలి. ముడుపుగా ఉంచిన బియ్యంతో పాయసం తయారుచేసి స్వామివారికి నివేదన చేయాలి. అనంతరం పూర్ణాహుతి ఆచరించాలి. ఆ వ్రతం విధివిధానంగా ఆచరించేవారికి కోటియజ్ఞఫలాలు లభిస్తాయి. ఆ రోజు రాత్రి జాగారం చేస్తూ మహాగణపతిపురాణాన్ని వినాలి. మంగళవాద్యాలతో పూజ పరిసమాప్తం గావించాలి. శక్తిననుసరించి అనాథలకు, పేదలకు యథాశక్తి దానాలు చేయటం మంచిది.

ఈ వ్రతాన్ని ఎవరైనను వీలైనన్నిసార్లు ఆచరించవచ్చు. కనీసం జీవితంలో ఒక్కసారైనా ఆచరించటం ఎంతో శ్రేయస్కరం.

శ్రీ గణపతి ప్రస్తావన శివపురాణం, విష్ణుపురాణం, స్కందపురాణం, పద్మపురాణం, దేవీభాగవతం, మహాభారతం, వ్యాసులవారు రచించిన అష్టాదశపురాణాలలోని గణేశఖండంలోను విశేషంగా కనిపిస్తుంది.

ఒకనాడు ఇంద్రుడు తన విమానంలో ఇంద్రలోకానికి తిరిగి వెళుతుండగా అనేక పాపములు చేసిన ఒకానొక వ్యక్తి దృష్టి సోకగానే ఆ విమానం భూమిపై అర్థాంతరంగా ఆగిపోవటం జరిగింది. ఆ ఇంద్రవిమానం చూచిన ఆ దేశపురాజు సురసేనుడు బయటికి వచ్చి విమానం ఆగిపోయిన కారణం అడిగాడు. ఆ రాజ్యంలో పాపాలు అధికంగా చేసిన వ్యక్తి దృష్టి సోకటంవలన విమానం అర్థాంతరంగా ఆగింది అని తెలుసు కున్నాడు. తిరిగి విమానం బయలుదేరే ఉపాయం తెలుపుమని కోరగా, ఎవరైనా సంకటహరచతుర్థివ్రతఫలం ధారపోసినట్లయితే విమానం తిరిగి బయలుదేరుతుంది అని చెప్పాడు. రాజ్యమంతా గాలించినా ఎవరూ దొరకలేదు. అదేసమయంలో ఒక గణేశదూత వచ్చి మరణించిన ఒక స్త్రీ మృతదేహాన్ని తీసుకెళ్ళటం కనబడింది. సైనికులు వెంటనే ఎంతో పాపాత్మురాలైన స్త్రీని ఎందుకు గణేశలోకానికి తీసుకువెడుతున్నారని ప్రశ్నించారు. దానికి గణేశదూత, నిన్నంతా ఈ స్త్రీ ఉపవాసం ఉండి, తెలియకుండానే చంద్రోదయం తర్వాత అన్నం కొంత తిన్నది. ఈ విధంగా ఆమెకి తెలియకుండానే సంకష్టచతుర్థి వ్రతఫలం లభించింది. ఆమె ఈ రోజు మరణించింది. అందుకే ఈమెను గణేశలోకానికి తీసుకొని వెడుతున్నాము' అని చెప్పాడు. అంతేకాక ఎవరైనా తమ జీవితకాలంలో ఒక్కసారైనా ఈ వ్రతం చేస్తే వారు గణేశలోకానికి చేరుకుంటారని దూతలు చెప్పారు. అపుడు ఆ స్త్రీ పుణ్యఫలం ఇంద్రునికి ఇవ్వుమని కోరగా, దూతలు నిరాకరించారు. కాని అదే సమయంలో వాతావరణంలోని గాలి ఆమె దేహంపైనుండి వీచి, విమానానికి సోకటంవలన, ఇంద్రుని విమానం తిరిగి బయలుదేరింది.

మరొకకథకూడా ఉంది. పూర్వం బృశుండిమహర్షిని తల్లిదండ్రులు నరకంలో అనేకబాధలు అనుభవించటం చూచిన నారదుడు ఈ విషయాన్ని బృశుండిమహర్షికి తెలియచేశాడు. విషయం తెలుసుకున్న మహర్షి తాను అనేకసార్లు ఆచరించిన సంకటహరచతుర్థివ్రతఫలాలనుండి ఒక వ్రతఫలం తన తల్లిదండ్రులకు ధారపోయగా, వెంటనే వారికి నరకంనుండి విముక్తి కలిగి గణేశలోకానికి చేరుకున్నారు.

మహామహిమాన్వితుడైన గణపతిని నిత్యం స్మరిస్తూ ఇహపరసుఖాలను పొందుదాం.

ప్రణమ్య శిరసా దేవం గౌరీపుత్రం వినాయకం!
భక్తావాసం స్మరేనిత్యం ఆయుష్కామార్థసిద్ధయే !!



జీవనప్రబోధం

# జెండాపై కోడిపుంజు!!

- శ్రీమతి యం.గీతాకుమారి

**"శక్తి హస్తం విరూపాక్షంజి శిఖి వాహనం షడాననం!
దారుణం రిపు రోగఘ్నం భావయే కుక్కుట ధ్వజం"**

శత్రువులను, రోగాలను నాశనం చేస్తూ కోడిపుంజును ధ్వజంగా కలిగినవాడయిన సుబ్రహ్మణ్యస్వామికి నమస్కరించి స్వామిని ప్రార్థిస్తే సమస్తసౌఖ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

ప్రకృతిలోని ప్రతి జీవినుంచి మనిషి ఎన్నో మంచి లక్షణాలను నేర్చుకోవచ్చు. వానిలో కుక్కుటము ఒకటి. లోకవ్యవహారంలో కుక్కుటమును కోడి అని వ్యవహరిస్తారు. మనిషి కోడిపుంజునుండి నేర్చుకోవలసిన ముఖ్య లక్షణాలు ఐదున్నాయి. అవి:

### 01) బ్రహ్మముహూర్తంలో మేల్కొనడం

సూర్యోదయానికి ముందుగా మేలుకుంటే ఆ రోజు ఉత్సాహంగా ప్రారంభమవుతుంది. కోడిలో ఆ లక్షణముంది. కుక్కుటము క్రమశిక్షణకు మారుపేరు. గడియారం లేని కాలంలో మనుషులు కోడికూతను అనుసరించి కాలగణన చేసేవారు. కోడికూతద్వారా బ్రాహ్మీముహూర్తమును నిర్ణయించి సిద్ధపురుషులందరూ ఆ సమయంలో స్నానాదికాలు నిర్వర్తించే వారు. ఆ తర్వాత సూర్యోదయానికి, తెల్లవారేసరికి, లోకానికి మేలుకొలుపు పాడుతుంది కోడి.

### 02) అప్రమత్తత

ఎక్కడ ఏ చిన్న శబ్దం వచ్చినా వెంటనే గమనించి అప్రమత్తమై చుట్టూఉన్న పరిస్థితులను గమనిస్తూ తనను మాత్రమేకాక తన పిల్లలను రక్షించుకోవడంకోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటుంది. అలానే మనుషులు తమచుట్టూఉన్న పరిసరాలగురించి తెలుసుకుంటూ నిస్పృహకులోనుగాకుండా అప్రమత్తతతో తగిన నిర్ణయాలు తీసుకోవాలి అన్న సందేశాన్ని ఇస్తుంది మనకు.

### 03) వనరులను సమకూర్చుకోవటం

కోడిపుంజు తన ఆహారం, వనరులకోసం ఎంతో శ్రద్ధగా వెతుకుతుంది. తనకు తానే ఆహారాన్ని సంపాదించుకుని, తన కడుపు నింపుకోవడమే కాక ఆ ఆహారాన్ని కుటుంబం, స్నేహితులతో పంచుకుంటుంది. ఇలా కష్టపడి పని చేయడం ఎంత విలువైనదో మనకు బోధిస్తున్నది. ఇది తన ఆహారాన్ని తాను సంపాదించుకుంటుందే కానీ ఇతరులపై ఆధారపడదు. ఇది ఎవ్వరైనా తన కాళ్ళపై తాను నిలబడాలి అనే సూచనలను తెలియజేస్తుంది కోడిపుంజు. తాను కష్టపడి సంపాదించిన ధనంలోనే సంతృప్తి ఉన్నదనే విషయం సూచిస్తుంది. అంతేకాక అందరూ కలిసిమెలిసి ఉండాలి అనే అర్థంకూడా మనకు కనిపిస్తున్నది.

### 04) ధైర్యం

ఎంత పెద్ద జంతువులను ఎదుర్కోవలసి వచ్చినా కోళ్లు భయపడవు. పోరాటానికి సిద్ధంగా ఉంటాయి. కోళ్లు ధైర్యసాహసాలకు ప్రసిద్ధి చెందినవి. ఇవి సవాళ్లను దృఢ సంకల్పంతో ఎదుర్కొంటాయి. ఆపదలు కలిగినప్పుడు తనను తాను రక్షించుకోవటమేకాక తన కుటుంబాన్ని, బిడ్డలను కాపాడుకోవడానికి ధైర్యంగా పోరాడటమే దీని లక్షణం.

### 05) భాగస్వామితో అనుబంధం

తనను నమ్మి వచ్చిన తన భాగస్వామితో గట్టి అనుబంధాన్ని కలిగి ఉంటుంది. గుడ్లను పొదిగి పిల్లలకు ఎలాంటి ఆపద కలుగకుండా తనవెంటే తిప్పుకుంటుంది.

ఎవరైనా పిల్లలదగ్గరకొస్తే కోపంగా వారిమీదకు ఉరుకుతుంది. లోకంలో నేటికీ పదిమందిని వెంటబెట్టుకుని తిరిగేవారిని “పిల్లలకోడి” అని వ్యవహరించటం పరిపాటి. చివరకు ఈ మాట తెలుగువారి సామెతగా రూపాంతరం చెందింది. ఉమ్మడి కుటుంబలక్షణం ఇక్కడ సూచితం. కోడి ఎక్కడ తిరిగినా సాయంసమయానికి తానుండే ప్రదేశానికి చేరుకుంటుంది. అది దాని ఏకాగ్రతకు నిదర్శనం. ఆహారంలో తనకు కావలసినంత మాత్రమే తిని మిగిలిన ఆహారమును మిగిలిన వారికోసం వదిలివేస్తుంది. దాన్నిచూసి దయాగుణాన్ని నేర్చుకోవాలి.

కోడిపుంజులోని ఈ ఐదు లక్షణాలను అనుసరించి, ఆచరించినవారు జీవితంలో తప్పక విజయం సాధించి, జీవితంలో పురోగతిని సాధించవచ్చు. గొప్పవారి ఎదుగుదలకు క్రమశిక్షణయే కారణమని చెప్పవచ్చు.

కోడి నిద్రిస్తున్నా కన్ను తెరుచుకునే అప్రమత్తంగా ఉండి తన పిల్లలను ఎలా కాపాడుకుంటుందో అలా మనిషి నిరంతరం జాగరూకతతో ఉండాలని సూచిస్తుంది. అందుకే సుబ్రహ్మణ్యస్వామి సమస్తలోకాలరక్షణకు, క్రమశిక్షణకు ఆలవాలమైన కుక్కుటమును తన ధ్వజచిహ్నముగా నిలుపుకున్నాడు. అందుకు కృతజ్ఞతగా సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో తల పైకెత్తి ఆ భానునివైపే తిరిగి “కొక్కొరొక్కొ కొక్కొరొక్కో” అంటూ సమస్తలోకాలను కాపాడుతున్న లోకబాంధవునికి లోకంతరపున తాను నమస్కారాలు తెలియజేస్తుంది.

**గ్రంథసమీక్ష**

## తిరుమల శ్రీవారి దివ్యప్రసాదములు

**రచయిత–** డా॥ ఎ.వి.రమణదీక్షితులు; **ఆకృతి–** 1/8 డెమ్మీ; **పుటలు–**300; **మూల్యం–**రూ.999/–; **ప్రతులకు–** నాగేంద్రాస్ న్యూ గొల్లపూడి వీరాస్వామి & సన్, టి.నగర్, కోటిపల్లి బస్టాండు దగ్గర, రాజమహేంద్రవరం, చరవాణి–93481 84218.


**వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మండే నాస్తికించన**
**వేంకటేశ సమోదేవో న భూతో న భవిష్యతి**

ఈ బ్రహ్మాండంలో శ్రీవేంకటేశ్వరస్వామితో సమానదైవం లేదు. రాబోదు అని పురాణాలు నొక్కి వక్కాణిస్తున్నాయి.

తిరుమల క్షేత్రసందర్శనమంటే మొదట గుర్తుకొచ్చేది స్వామివారు. ఆ తర్వాత ప్రసాదాలే! ఈ ప్రసాదాలకున్నంత మహత్తు ఇక ఎక్కడా లేదు. లేదనే ఖచ్చితంగా చెప్పాలి మరి. అలాంటి ప్రసాదాలగురించి, రచయిత ‘తిరుమల శ్రీవారి దివ్య ప్రసాదములు’ అను గ్రంథంలో ఎంతో అద్భుతంగా వాటి దిట్ట పరిమాణాలగురించికూడా వర్ణించి రచించారు. అలాగే, స్వామివారి వైభవం, సంస్థానవివరాలనుకూడా తెలియ పరిచారు. గ్రంథం కళంకారీ స్వామివారి చిత్రంతో మొదలై ఆసాంతం ప్రతిపుట నాలుగువర్ణాలతోకూడిన ఆర్ట్‌పేపర్‌లతో ఎంతో చక్కగా ముద్రించబడి ఉంది.

స్వామివారి భక్తులందరికీకూడా స్వామివారి ప్రసాదాలు ఎలా తయారుచేస్తారు? వాటి దిట్టం వివరాలేంటి? ఆ ప్రసాదాల పేర్లేంటి? అని తెలుసుకోవాలనే జిజ్ఞాస ఉంటుంది. అలాంటివారికి ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రతిఇంట్లోనూ ఉండాల్సిన, పఠించాల్సిన ముఖ్య గ్రంథమిది.

**– మొలకా ఉత్తరఫల్గుణి**



ధర్మనీతి

# రెండు వరాలివ్వు చాలు!!


– శ్రీమతి ఆసూరి ఉషారాణి,
94416 46016



ఒకనాడు కర్ణుడు అభ్యంగనస్నానం చేయడానికి తయారవుతున్నాడు. ఎడమచేతిలో రత్నాలు పొదిగిన గిన్నెలో నూనె ఉంది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు కర్ణుణ్ణి పరీక్షిద్దామని పొద్దున్నే కర్ణుని భవనానికి వెళ్ళాడు.

"కృష్ణ! తమరి ఆగమనానికి కారణం?" అని కర్ణుడు అడుగగా, కర్ణుడి ఎడమచేతిలో ఉన్న రత్నాలు పొదిగిన బంగారుగిన్నెను చూసేసరికి శ్రీకృష్ణుడు–

"కర్ణా! నాకు ఆ గిన్నె ఇవ్వవా" అని అడిగాడు. వెంటనే కర్ణుడు ఎడమచేతిలో ఉన్న గిన్నెను ఎడమచేతితో అలాగే ఇచ్చేశాడు.

అందుకు శ్రీకృష్ణుడు వెంటనే కర్ణుడితో– "కర్ణా! ఎడమచేతితో దానం ఇవ్వడం తప్పు కదా" అని అడిగాడు.

అందుకు కర్ణుడు–




క్షణం చిత్తం క్షణం విత్తం క్షణం జీవిత మావయోః
యమస్య కరుణా నాస్తి ధర్మస్య త్వరితా గతిహి.

"కృష్ణ! లక్ష్మీదేవి చంచలమైనది. యముడు నిర్దయుడు. ఏ క్షణాన్నైనా లక్ష్మి వెళ్ళిపోవచ్చు. యముడు దరి రావచ్చు. మనసు ఏ క్షణంలో ఎలా మారుతుందో తెలీదు. కనుక గిన్నె ఈ చేతినుండి ఆ చేతికి పోయేలోపలే ఏ మార్పైనా రావచ్చు. నీకు దానం చేయలేకపోతానేమో? అనే భయంతో ఆ క్షణాన్ని కూడా నిర్వీర్యం కాకుండా నీకు వెంటనే గిన్నెను దానం చేస్తున్నాను." అన్నాడు కర్ణుడు.

ఆ మాటలకు ముచ్చటపడిన శ్రీకృష్ణుడు "నీ వివేకానికి జోహార్లు కర్ణా. నీకేం వరం కావాలో కోరుకో" అని అడగగా కర్ణుడు–

"దేహీతి వచనం కష్టమ్ నాస్తీతి వచనం తదా
దేహి నాస్థీతి మద్వాక్యం మా భూజన్మ జన్మనీ"

"దేహి" అని అడగడం ఎంత కష్టమో "నాస్తి" అని లేదని చెప్పడం కూడా అంతే కష్టం. ఎన్ని జన్మలైనా "దేహి" అని నేను అడగడం కానీ, "నాస్తి" అని నా నోటివెంట రావడం కానీ జరగకుండా నాకు వరమివ్వవా స్వామి అని కోరగా కృష్ణుడు చిరునవ్వుతో 'తథాస్తు' అంటూ దీవించాడు. దీన్నిబట్టి మనకేం అర్థమవుతోంది. కర్ణుడి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తోంది.

**నీతి:** ఎడమచేతితో చేసే దానం కుడిచేతికికూడా అస్సలు తెలియనివ్వకుండా దానం చేయాలి. మంచిపనులు చేయడానికి వాయిదాలు అవసరమే లేదు. ఎప్పుడు మంచిపని అని అనిపిస్తే అప్పుడే వెంటనే చేసేయాలి కూడా. ఇదే పై కథలోని ధర్మనీతి.

నారీలోకం

# ప్రేమైక త్యాగశీలి హిడింబి

- శ్రీ ఐనవోలు మోహనాచార్యులు

మహాభారతం భారతీయ మూలస్తంభం. అది కేవలం యుద్ధ వీరుల గాథ మాత్రమే కాదు; అది ధర్మంకోసం వ్యక్తిగత జీవితాలను హోమం చేసిన నిశ్శబ్ద త్యాగమూర్తుల ఇతిహాసం కూడా.. అలాంటి మహనీయుల సరసన నిలిచే వ్యక్తిత్వమే హిడింబిది. రాక్షసకులంలో జన్మించిన హిడింబి, తనవ్యక్తిత్వంద్వారా “జన్మకాదు- గుణమే గొప్పది” అనే సత్యాన్ని నిరూపించింది.

పాండవులు లక్కఇంటి నుంచి తప్పించుకుని ఒక దట్టమైన అడవిలోకి వెళ్లారు. చాలాసేపు నడచి అలసిపోయి ఆ రాత్రి ఒకచోట విశ్రమించారు. అందరూ నిద్రపోతుండగా భీమసేనుడు కావలాగా ఉన్నాడు. అలా వారికి సమీపంలో రాక్షసజాతికి చెందిన హిడింబి, హిడింబాసురుడు అనే అన్నాచెల్లెళ్ళు ఉన్నారు. హిడింబాసురుడు పాండవుల వాసనను పసిగట్టి అక్కడ బాగా బలిష్టంగా ఉన్న భీముని ఆకర్షించి ఆహారంగా తీసుకురమ్మని హిడింబిని పంపాడు. కానీ హిడింబి భీముణ్ణి మోహించింది. ఒక అందమైన స్త్రీరూపం ధరించి తనను పెళ్ళాడమని భీముని కోరింది. భీముడు అందుకు అంగీకరించలేదు. ఆమె తన నిజస్వరూపం ధరించి తన అన్న చెప్పిన పనిగురించి చెప్పింది. భీముడు యుద్ధానికి తలపడి హిడింబాసురుడుని సంహరించాడు.

సోదరునిమరణంతో తనమీద ప్రతీకారం తీర్చుకుంటుందేమోనని భీముడు హిడింబినికూడా చంపబోయాడు. కానీ ధర్మరాజు అడ్డుకున్నాడు. తరువాత హిడింబి తను ఒంటరిదానను కాబట్టి పెళ్ళి చేసుకోమని భీముడిని ఒప్పించమని కుంతీదేవిని వేడుకున్నది.ఆమెను పెళ్ళాడిన తరువాత విడిచి వెళ్ళడానికి ఆమె అనుమతిస్తేనే అందుకు అంగీకరిస్తానన్నాడు. హిడింబి అందుకు అంగీకరించి భీముని పెళ్ళాడింది. వారికి ఘటోత్కచుడు అనే కుమారుడు కలిగిన తరువాత పాండవులు అక్కడినుండి నిష్క్రమించారు.

జన్మగత లక్షణాలకే లోబడి జీవించకుండా, తన స్వబుద్ధితో ధర్మాన్ని స్వీకరించిన అరుదైన స్త్రీమూర్తి. ఆమె జీవితం, త్యాగం అంటే ఏమిటో నిర్వచించిన ఒక మానవీయ అధ్యాయం. ధర్మపక్షాన నిలిచిన ధైర్యం హిడింబిది. ఆమె మనస్సు క్రూరత్వానికి వశపడలేదు. అన్నయ్య ఆజ్ఞను అతిక్రమించి, పాండవులకు ప్రమాదం ఉందని ముందుగానే హెచ్చరించడం ద్వారా ఆమె తన ప్రాణాలనే పణంగా పెట్టింది. ఇది కేవలం సహానుభూతి కాదు; ఇది స్వకులానికి వ్యతిరేకంగా ధర్మానికి అంకితమైన చైతన్య నిర్ణయం. స్వకుల వియోగం- మొదటి మహాత్యాగం, భీముడు- హిడింబుడి యుద్ధంలో హిడింబుడు హతమయ్యాడు.హిడింబికి ఇది అన్న మరణమే కాదు; తన రక్తబంధం పూర్తిగా తెగిపోయిన ఘడియ. అయినా ఆమె ధర్మాన్ని ప్రశ్నించలేదు. ధర్మవిజయాన్ని స్వీకరించింది.

ఇది హిడింబి చేసిన స్వకుల త్యాగానికి పరాకాష్ట. పాండవవంశకోడలిగా ప్రవేశించింది. భీమునిపై ఏర్పడిన ప్రేమ భావోద్వేగపరమైనది కాదు; అది గౌరవం, విశ్వాసం, ధర్మసంబంధమైన అనురాగం. కుంతి అనుమతితో జరిగిన గాంధర్వవివాహంద్వారా హిడింబి పాండవవంశకోడలిగా మారింది. కానీ ఆమె ఈ బంధాన్ని అధికారికంగా మార్చుకోలేదు; హక్కుగా మలచుకోలేదు. దాంపత్యత్యాగం చేసిన ధీర. పాండవుల జీవితం లక్ష్యోన్నతమైనది. వారు ధర్మస్థాపనకోసం నియమితులైనవారు. ఈ సత్యాన్ని గ్రహించిన హిడింబి, భర్త భీమునితో శాశ్వతంగా కలిసి జీవించే అవకాశాన్ని స్వచ్ఛందంగా వదిలివేసింది. భీముడు వెళ్లిపోతున్నప్పుడు అతణ్ణి ఆపలేదు; తన వ్యక్తిగతసుఖాన్ని ధర్మబాధ్యతకు

బలి చేసింది. ఇది భారతీయ స్త్రీ త్యాగభావనలో ఒక అత్యున్నత ఉదాహరణ.

రాజసౌఖ్య విరక్తి పాండవుల కోడలిగా హిడింబికి రాజసభలో స్థానం లభించే అవకాశం ఉంది. అయినా ఆమె సౌఖ్యాన్ని తిరస్కరించింది, గౌరవాన్ని త్యజించింది, గుర్తింపును నిరాకరించింది. ఆమె జీవితం అడవిలో మౌనంగా సాగినా, ఆ మౌనమే ఆమె త్యాగానికి సాక్ష్యమయ్యింది.

హిడింబి–భీముల కుమారుడు ఘటోత్కచుడు కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల విజయానికి కీలకపాత్ర వహించాడు. తల్లిగా కుమారుడి మరణం అత్యంత ఘోరమైన వేదన. అయినా హిడింబి ధర్మయుద్ధాన్ని ప్రశ్నించలేదు. తన కుమారుణ్ణే ధర్మానికి అర్పించింది. ఇది కేవలం త్యాగం కాదు; ఇది మాతృత్వానికి చేసిన మహాయాగం.

హిడింబి జీవితం మనకు ఒక సత్యాన్ని బోధిస్తుంది. త్యాగం అంటే వెలుగులో నిలవడం కాదు; త్యాగం అంటే నీడలో నిలబడి ధర్మాన్ని నిలబెట్టడం. ఆమె పేరు ఎక్కువగా వినిపించకపోయినా, మహాభారతచరిత్రలో ఆమె పాత్ర మౌనమైనా మహోన్నతమైనది.

హిడింబి రాక్షసకులంలో పుట్టిన దేవత కాదు; కాని దేవతలకంటే గొప్ప మానవత్వాన్ని ఆవిష్కరించిన స్త్రీ. ఆమె జీవితం ధర్మంకోసం వ్యక్తిగతజీవితాన్ని త్యజించిన నిశ్శబ్ద త్యాగ మూర్తి గాథ. అందుకే హిడింబిని పాండవవంశాన్ని నిలిపిన అప్రకటిత త్యాగస్తంభం అని చెప్పడం అతిశయోక్తి కాదు.




హిడింబి ఇంత గొప్ప ధర్మపరాయణ కాబట్టే ఆవిడకు గుడి కట్టి, దైవంలా పూజిస్తారు "మనాలి" ప్రాంత ప్రజలు. దట్టమైన అడవులమధ్య హిమాచల్ ప్రదేశ్‌రాష్ట్రంలోని మనాలీలో ఈ ప్రాచీనఆలయం ఉంది. ఈ ఆలయం చుట్టూరా విస్తారమైన, దట్టమైన అడవి ఉంది. ఇక్కడ చాలా ప్రదేశాల్లో సూర్యుడి వెలుగుకూడా పడని ఆ ప్రాంతం ప్రకృతి సౌందర్యానికి ప్రతీకలా నిలిచింది. అందుకే ఈ హిడింబిని వనదేవత, ప్రకృతిదేవత అనికూడా పిలుస్తారు. ఇక్కడికి దేశ నలుమూలలనుంచి ప్రతినిత్యం భక్తులు సందర్శనకు వస్తుంటారు. ప్రకృతివిపత్తులు సంభవించినప్పుడు స్థానికులు ఈ దేవతకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు.

ఈ ఆలయాన్ని 1553లో మహరాజా బహదూర్ సింగ నిర్మించారు. నాలుగు అంతస్తుల్లో చెక్కలతో నిర్మించిన ఈ ఆలయనిర్మాణం అడవులమధ్య ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తూ కనువిందు చేస్తుంది.

రాక్షసకులంలో పుట్టినప్పటికీ, తన ఉన్నత వ్యక్తిత్వంద్వారా, గొప్ప కీర్తిని ఆర్జించిన హిడింబి నేటి తరం మహిళలకుకూడా ఆదర్శనీయురాలు అనడంలో ఎటువంటి సందేహమూ లేదు.




# నాకు న్యాయం కావాలి!!

**- శ్రీ యం. రవితేజ**

మనుధర్మశాస్త్రంలో చెప్పిన ధర్మాన్ని పాటించేవాడు కనుక ఇతనికి మనునీతిచోళుడు అనే పేరు వచ్చింది. చోళ రాజైన ఎల్లాళకు ఇచ్చిన బిరుదు ఈ మనునీతిచోళుడు. ఆయన న్యాయం, ధర్మంపట్ల నిబద్ధతకు ప్రసిద్ధి చెందాడు. చట్టం ముందు రాజైనా, సామాన్యుడైనా అందరూ సమానులేనని నిరూపించాడు మనునీతిచోళుడు. ఈ కథ నీతి, న్యాయం, ధర్మాలకు నిదర్శనంగా తమిళసంస్కృతిలో చెప్పబడి ఉన్నది. ఈ కథ తమిళపురాణాలలో ఒకటైన పెరియ పురాణానికి చెందినది. నేటి తంజావూరు, తిరుచిరాపల్లి జిల్లాలను చోళదేశమని పిలిచేవారు.

ఆ రాజ్యానికి ధర్మపరుడైన రాజు మనునీతిచోళుడు. ఆయన తపస్సు ఫలించి కొంతకాలానికి ఒక మగపిల్లవాడు పుట్టాడు. ఆ పిల్లవాడికి వీధివిటంకుడు అనే పేరు పెట్టాడు. వీధివిటంకుడు తండ్రివలె మంచిపేరు సంపాదించుకున్నాడు. అన్ని శాస్త్రాలు, విద్యలను నేర్చుకున్నాడు. అతనిలో లోపం అనేది కనపడదు.


ఒకరోజు రాకుమారుడు గుడికి బయలుదేరగా దారిలో ఒక విచారకరమైన సంఘటన జరిగింది. రాకుమారుడెక్కిన రథం వేగంగా వెళుతుండగా ఒక ఆవుదూడ అతని రథచక్రాల క్రిందపడి నలిగి మరణించింది. ఆ విషయం గ్రహించిన రాకుమారుడు వెంటనే రథమాపి క్రిందికి దిగి చూశాడు. అప్పటికే ఆ దూడ ఆ రథచక్రాలక్రిందపడి నలిగి మరణించడం జరిగిపోయింది. ఆవుదూడ చాలా అందంగా ఉన్నది. భగవంతుని సేవించటానికి వెళుతూ ఉండగా ఇలాంటి పాప కార్యం జరిగిందే, అయినా ఎక్కడినుంచి వచ్చిందో ఈ దూడ నా రథంక్రిందకే వచ్చింది కదా! ఇలాంటి అకార్యానికి, ఆ దూడ మరణానికి నేను కారణమైనాను. నేను ఒక్కనిమిషం ఇంటికి రావడం ఆలస్యం అయితే మా అమ్మ భయపడిపోయి నలుదెసలకు సేవకుల్ని పంపి నాకోసం వెతికిస్తుంది కదా! పాపం ఈ దూడ తల్లి సాయంసమయానికి తనబిడ్డ దగ్గరకు రాకపోతే ఎంత బాధపడుతుందో కదా! ఈ దూడను చూస్తూ ఉంటే నాకు దీని తల్లి ఎంత ఏడుస్తుందో అని బాధగా ఉన్నది అన్నాడు. అంతేకాదు ఈ సంగతి మా నాన్నకు తెలిసిందంటే ఆయన ఎంతగానో బాధపడతారు. నావల్లనే వంశానికి అపకీర్తి వచ్చింది కదాఅని బాధపడతాడు. వంశానికి కీర్తి కలిగించాలే కానీ ఇలాంటి అపకీర్తి తేవడానికి నేను ఎందుకు పుట్టాను అని బాధపడ్డాడు.

ఇంతలో ఎక్కడనుంచి వచ్చిందో తెలియదు కానీ దూడ తల్లి అక్కడికి వచ్చి బిడ్డను చూసి దుఃఖించడం ప్రారంభించింది. అంతేకాదు ఆ తల్లి దూడచుట్టూ మూడుసార్లు తిరిగి అంబా! అంబా! అని అరవటం ప్రారంభించింది. ఆనవాళ్లు చూసి దాని కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. అయ్యో! ఈ రథం నీ మీదిగా వెళుతున్నప్పుడు నువ్వు ఎంత బాధపడ్డావో కదా! ఎన్నిసార్లు అంబా! అంబా! అని అరిచావో కదా! నోరు లేని నీపైన ఈ రథాన్ని పోనిచ్చిన దుర్మార్గుడు ఎవరు? ఇలా ఎందుకు చేశారు? ఈ పని చేసేందుకు అతనికి మనస్సు ఎలా వచ్చిందో అని బాధపడింది. ఇక ఎంతసేపు దుఃఖపడినా లాభం లేదని భావించి సరాసరి రాజుగారి అంతఃపురానికి వచ్చింది. కాని అప్పటికే ఈ విషయము ఊరంతా తెలిసిపోయింది. విన్నవారందరూ రాజుగారి న్యాయబుద్ధి తలుచుకుంటూ, యువరాజుకు ఎటువంటి శిక్ష వేస్తారో రాజుగారికి ఎంత కష్టం వచ్చిందో కదా అని కంటతడి పెట్టారు.

ఆవు అంతఃపురానికి చేరి సరాసరి మనునీతిచోళుడు నివసించే మందిరంవద్దకు వెళ్ళింది. మందిరం బయట ఒక గంట వేలాడుతూ ఉంటుంది. ఎవరికైనా ఎలాంటి ఆపద కలిగిన వచ్చి ఆ గంటను మోగిస్తే రాజు తక్షణమే వారికి న్యాయం చేస్తాడు. ఆవు ఆ గంటను మోగించింది. రాజు వెంటనే ఆవువద్దకు వచ్చాడు. ఆవుని చూసి రాజుకి జాలి వేసింది. దానికి వచ్చిన ఆపద ఏమిటో ఆయనకు అర్థం కాలేదు. రాజును చూడగానే ఆవు అంబా అని అరిచింది.



ధర్మబద్ధమైన, న్యాయపరమైన జీవితాన్ని గడిపేవారికి దేవుడెప్పుడూ తోడుంటాడు



మంత్రి విషయాన్నంతా రాజుగారికి వివరించాడు. రాజు బాధతో ఇప్పుడు ఏం చేద్దాము అన్నట్టుగా మంత్రివైపు చూశాడు.

ప్రభూ! ఇందులో రాకుమారుని తప్పేమీ లేదు. ఇదంతా విధి లిఖితం. ఎక్కడో తిరిగిన దూడ యువరాజు రథంక్రిందే పడాలా? అలా జరగటానికి కారణం ఆ విధియే కదా! యువరాజు రథం క్రింద పడి మరణించింది అని చెప్పి రాజా! ఇది యువరాజు చేసిన తప్పు కాదు. ప్రమాదవశాత్తు జరిగింది అన్నాడు మంత్రి. తప్పు చేసినవాడిని శిక్షించడమే రాజధర్మం. రాజుగారు వీధివిటంకుడు ఏ విధంగా రథం పోనిచ్చి దూడ చావుకు కారణం అయినాడో అదేవిధంగా ఆతనిని చంపటమే న్యాయమని తీర్పు ఇచ్చాడు. రాజ కుమారునికి అన్యాయం చేయలేక మంత్రి తాను కత్తితో పొడుచుకొని మరణించాడు. మంత్రి తనవల్ల మరణించి నందుకు యువరాజు బాధపడ్డాడు. అది తెలిసి రాజు విచారించాడు. తనమూలంగా మంత్రి మరణించినందుకు తన్ను తాను చంపుకోవాలి అని మనునీతిచోళుడు నిశ్చయించుకున్నాడు.

తన తండ్రి న్యాయబుద్ధిని, భూతదయను తెలుసుకొని ఆనందాన్ని పొందాడు. దూడ చనిపోయినచోట వెల్లకిల పడుకున్నాడు. మనునీతిచోళుడు రథం నడుపుకుంటూ వచ్చి కొడుకుమీదుగా రథాన్ని పోనివ్వగా ఆ రథచక్రాలక్రింద పడి నలిగి మరణించాడు. మహారాజు రథం దిగి తన కారణంగా మంత్రి మరణించాడు అన్న బాధతోటి తన కరవాలంతో తనను తాను పొడుచుకోవటానికి సిద్ధపడ్డాడు. అప్పుడు పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు.

అక్కడ చేరిన ప్రజలందరూ ఆనందంతో జయ జయ ధ్వానాలు చేశారు. మనునీతిచోళుడు కత్తిని క్రింద పడవేసి ఈశ్వరుని పాదాలమీద పడ్డాడు. పరమేశ్వరుడు రాజుని లేవనెత్తి రాజా! నీ భూతదయను చూసి సంతోషిస్తున్నాను. నీ న్యాయబుద్ధిని, భూతదయను పరీక్షించడానికి నేను ఇలా చేశాను అంటూ మహారాజుని కొనియాడాడు పరమేశ్వరుడు. మహారాజు తన చేతికత్తి క్రిందపడవేసి పరమేశ్వరునికి రెండు చేతులు జోడించి భక్తిపూర్వకంగా నమస్కరించాడు. స్వామి!! అంతా నీ దయ. నాలో ఏమున్నదని రాజు కనపరిచిన భక్తి భావానికి ఈశ్వరుడు మహారాజా! నీ ధర్మబుద్ధిని, నీ న్యాయ బుద్ధిని పరీక్షించడానికి ఈ విధంగా చేశాను. నీ ధర్మం, దయవలన మరణించిన ఆవు దూడ, నీ కుమారుడు ఇద్దరూ బ్రతుకుతారు అన్నాడు. అంతేకాదు మంత్రికూడా బ్రతుకుతాడని చెప్పాడు. వెంటనే చనిపోయిన ఆవుదూడ ప్రాణంవచ్చి తల్లి దగ్గరకు పరుగెత్తుకుంటూ వెళ్లింది. మరణించిన మంత్రి కూడా జీవించాడు. వీధివిటంకుడుకూడా నిద్రనుంచి లేచిన వాడివలె తండ్రిదగ్గరకి వచ్చాడు. ఇదంతా చూసిన ప్రజలకు చెప్పలేని సంతోషం కలిగింది. భూతదయ, న్యాయబుద్ధిగల రాజు తమకు ప్రభువుగా లభించినందుకు ఎంతగానో సంతోషించారు ప్రజలు.

**నీతి:** *ఎవరైనను ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా నడుచుకుంటూ జీవితాన్ని గడపాలి అన్నది మనునీతి చోళుడు కథలోని ఆదర్శం. నేటి ధర్మమూర్తులు, న్యాయబద్ధులైన ఇటువంటి రాజులను ఆదర్శంగా తీసుకుని తమ జీవితాలను మలచుకోగలిగితే వారి జీవితాలేగాక దేశభవితకూడా తేజోవంతంగా ప్రకాశిస్తుంది అనేదే పై కథానీతి.*



నైతికసూత్రాలు

# వేలాయుధం! దండనాయుధం!!

**– శ్రీ ములగలేటి సాయి కృతిక్**


సుబ్రహ్మణ్యస్వామి రాశీభూతమైన జ్ఞానస్వరూపం. సునిశితమైన మేధస్సుకు స్వామిచేతిలో ఉండే శక్తి ఆయుధమే ప్రతీక. "వేల్" అంటే ఆయుధం. ఈ వేల్ అనే పదమునకు ఈటె, బల్లెము అనే పేర్లు ఉన్నాయి. "వేల్"ను ఆయుధంగా ధరించిన స్వామి కనుక వేలాయుధుడు అని పిలుస్తారు.

ఆయుధం అంటే తప్పుచేసినవారిని దండించేది. దండన అంటే కేవలం శిక్ష అని మాత్రమే కాదు శిక్షణకూడా అని చెప్పవచ్చు. శాంతిభద్రతలు కాపాడటానికి, ధర్మసంస్థాపనకు, ప్రజల సంక్షేమానికి రాజులు అనుసరించవలసిన పద్ధతి దండన అని సుబ్రహ్మణ్యస్వామి వేలాయుధధారియై ప్రబోధిస్తున్నాడు.

రాజ్యంలో శాంతి, భద్రత, సంపద, ధర్మాన్ని స్థాపించడానికి దండన చాలా అవసరం అని చాణక్యనీతి మనకు వివరిస్తుంది. అవి–

**01) క్రమశిక్షణ:** ప్రజలను సక్రమమార్గంలో ఉంచి నేరాలను అరికట్టడానికి దండన అవసరం. ధర్మాన్ని కాపాడటానికి రాజు ఈ శక్తిని ఉపయోగించాలి. ప్రజలను కాపాడటం రాజు యొక్క బాధ్యత. ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ వారి కష్టాలను తొలగించేవిధంగా రాజు పరిపాలించాలి. ప్రజలకు నష్టంగానీ, కష్టంగానీ, దుఃఖంగానీ సంభవించినప్పుడు దానిని ఎలా తొలగించాలి అనే ఆలోచనతో రాజు పరిపాలన సాగించాలి.

**02) ధర్మపరిరక్షణ:** దుష్టశిక్షణ, శిష్టరక్షణకోసం దండన అవసరం. పరిపాలనలో ఒక ముఖ్యమైన భాగం. ధర్మాన్ని, ధర్మపరులను రక్షిస్తూ, అధర్మాన్ని, అధర్మవర్తనులను దండించటమే రాజధర్మం.



**03) రాజ్యాంగభద్రత:** రాజ్యాన్ని, ప్రజలను రక్షించడానికి సైనికశక్తి అవసరం. సైనికులు క్రమశిక్షణతో సుశిక్షితులై ఉన్నప్పుడు రాజ్యానికి ఏ విధమైన బాధలు కలగవు. సైన్యమే రాజుకి, దేశానికి రక్షణ కవచం. ప్రజలలో అలాంటి క్రమశిక్షణ కొరవడినపుడు దండన అవసరమౌతుంది.

**04) ఆదర్శపాలన:** ప్రజలయొక్క క్షేమాన్ని కాంక్షించటం, రాజ్యాన్ని కాపాడటం రాజు బాధ్యత. ఒక్కొక్కసమయంలో రాజు తన బుద్ధికుశలతను ఉపయోగించి పరిపాలనను సాగించాలి.

**05) దండన:** ధర్మం, న్యాయం ఆధారంగా దండన ఉండాలి. అంతేకానీ వ్యక్తిగతమైన పగతోటి ఇతరులను శిక్షించకూడదు. అమాయకులకు శిక్షవిధించటం రాజ్యానికి క్షేమం కలిగించదు. శిక్షలుకూడా మితంగా ఉండాలి.

**06) సామాజికనియంత్రణ:** రాజు వైద్యునివంటివాడు. వైద్యుడు రోగిని పరీక్షించి ఏ రోగానికి తగిన మందును ఆ రోగానికి ఇస్తాడు. అలానే రాజుకూడా రాజ్యంలోని ప్రజల తప్పులను పరిశీలించి తన సముఖంలో శిక్షలను విధించాలే గాని అధికారులమీద ఆధారపడకూడదు.

దండన అనేది రాజ్యాధికారంలో ముఖ్యమైన భాగం. రాజన్నవాడు నిష్పక్షపాతంగా ఉండాలి. తద్వారా మంచి రాజ్యాన్ని స్థాపించవచ్చు.

ప్రజాసంక్షేమం, రాజ్యశ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని పరిపాలన చేయాలి. దండన ప్రజలను భయపెట్టేదిగా కాకుండా వారిని సన్మార్గంలో నడిపించే సాధనంగా ఉండాలి.

రాజ్యంలో శాంతి, సంపద, ధర్మాన్ని స్థాపించడానికి దండన చాలా అవసరం అని చాణక్యనీతి ప్రబోధిస్తున్నది.



అందరూ మనవాళ్లే అనుకో కానీ మనలాంటి మనస్తత్వం కలవాళ్లే అని అనుకోవద్దు

బాలప్రబోధం


# మమ్మల్ని క్షమించండి!!

- డా॥ కౌలికి శ్రీధరన్,
99630 61457

పూర్వం పండరీపురం అనే ఊరిలో ఒక గొప్ప భక్తుడు ఉండేవాడు. ఆయన పేరు నామదేవుడు. నామదేవుడికి పాండురంగడంటే చాలా భక్తి.

నామదేవుని పరీక్ష చేయాలని పాండురంగడు అనుకున్నాడు. పాండురంగడు ఒక కుక్కరూపం ధరించాడు. కుక్క పండరీపురంలో నామదేవుడు నివసించే వీథిలో అటూ ఇటూ తిరగసాగింది. ఆ కుక్క ఒక ఇంట్లోకి వెళ్లింది. ఆ ఇంటివారు దానిని కొట్టి బయటికి తరిమివేశారు. ఆ తర్వాత అది మరో ఇంట్లోకి వెళ్లి అక్కడ ఉన్న భోజనపదార్థాలను నోట కరుచుకుని గబగబా వీథిలోకి పరుగెత్తుకుని వచ్చింది. కానీ ఇంటివారు కొట్టిన దెబ్బలను సహించలేక ఆ కుక్క నోట్లో ఉన్న పదార్థాల్ని క్రింద పడేసింది. కుయ్ కుయ్ అంటూ ఏడవ సాగింది. దానికి చావుదెబ్బలు మాత్రమే మిగిలాయి. ఆకలికి అది నకనకలాడిపోయింది. ఎవ్వరూ దానికి గుప్పెడు మెతుకులుకూడా పెట్టలేదు. అదేం చిత్రమోగానీ చూసిన వారంతా కుక్కను చావచితకబాదారు.

ఆ కుక్క నామదేవుడి కంటబడింది. దాని అదృష్టం పండింది. కుక్కను చూడగానే నామదేవుడికి దానిమీద ఎక్కడలేని దయా, జాలీ కలిగాయి. వెంటనే ఇంట్లోకి వెళ్లి ఒక అరిసె తీసుకువచ్చాడు. అరిసెను చూపుతూ 'రా, రా' అని ఎంతో ప్రేమతో కుక్కను పిలిచాడు. ఎంత పిలిచినా కుక్క తన వద్దకు రాకపోవడంవల్ల నేతిగిన్నెతో నామదేవుడు కుక్క ఉన్న చోటికి పరిగెత్తుకు వెళ్లాడు. ఆ కుక్క తలను ప్రేమగా నిమురుతూ, అరిసెను చిన్నచిన్న ముక్కలు చేశాడు. ఒక్కొక్క ముక్కను నేతితో అద్ది, దానిని కుక్కకు భక్తితో పెట్టసాగాడు.



తోక ఆడిస్తూ, నామదేవుడు అందించే అరిసెముక్కల్ని ఆ కుక్క సంతోషంగా తినసాగింది.

ఈ చోద్యం చూసి అక్కడ గుమిగూడినవారంతా పొట్టలు చెక్కలయ్యేటట్టు నవ్వారు. అరిసెముక్కలన్నీ అయి పోగానే, కుక్క నామదేవునిచుట్టూ తిరగసాగింది. అలా తిరుగుతూ అది ఎవ్వరికీ కనిపించకుండా మాయమైపోయింది. అప్పుడు నిజంగా పిచ్చిపట్టినవాడివలె నామదేవుడు "పాండు రంగా! పాండురంగా!" అంటూ ఆ కుక్కకోసం అటూ ఇటూ పరిగెత్తాడు. "నా పాండురంగడు ఎక్కడికి వెళ్లాడు? నా స్వామీ! ఇంతలోనే ఎక్కడికి వెళ్లావు?" అంటూ కేకలు వేశాడు.

ఈ వింతను చూస్తూ ఉన్న పిన్నలూ, పెద్దలూ అందరూ అది నిజంగా కుక్క కాదనీ, పాండురంగడే ఆలా కుక్కరూపంలో వచ్చాడనీ, నామదేవుడు గొప్ప భక్తుడనీ అనుకున్నారు. భగవంతునియందు, భక్తునియందు తీరని అపచారం చేసినందుకు వాళ్లంతా పశ్చాత్తాపం చెందారు. మొదట నామదేవుడిని చూసి నవ్వినవాళ్లందరూ మమ్మల్ని క్షమించండి అని చెంపలు వేసుకుంటూ వచ్చి ఆతని పాదాలమీద వాలారు.

**నీతి:** సృష్టిలో ప్రతి జీవరాశిలోనూ దేవుడుంటాడు. కాబట్టి ఏ జీవరాశినీ, ఏ విధంగానూ బాధ పెట్టకూడదు. దేవుడి పటానికి పూజచేస్తే ఫలితమేమీ ఉండదు. ఇతరులపై సేవాభావం కల్గిఉంటే అదే దేవునికి చెందుతుంది అనేదే పై కథానీతి.

## వ్యక్తిత్వ వికాసం



## చదవరో భాగ్యము

# నెమలి కథ

- శ్రీ డి.సాయికృష్ణ మహీధర్, 94936 24214

నెమలి అందంగా, గర్వంగా ఉంటుంది. కుమార స్వామి దానిపై స్వారీ చేయడం అహంకారంపై సాధించిన విజయానికి చిహ్నం. నెమలి పామును తన కాళ్ళతో పట్టుకోవడం, అహంకారాన్ని, లౌకికసుఖాలను నియంత్రించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఈవిధంగా, కుమారస్వామి నెమలివాహనం, అహంకారాన్ని అణచివేసి, ధర్మాన్ని స్థాపించేందుకు ఆయన శక్తిని, దయను సూచిస్తుంది. ఇంద్రియ నిగ్రహాన్ని సూచిస్తుంది. అంతేకాకుండా నెమలి ప్రణవాక్షరమైన 'ఓం' ఆకారంలో ఉంటుంది. దాని ఆకారం బిందురూపంలో ఉంటుంది. ప్రణవంయొక్క శక్తిచేత మాయ అనే అపవిత్రత ఏవిధంగా అణచబడుతుందో తెలియచేయటానికి ప్రతీకగా నెమలి కాలిక్రింద అణచబడ్డ సర్పం కనిపిస్తుంది.

నెమలి జన్మవృత్తాంతం తెలిపే ఒక కథ ప్రాచుర్యంలో ఉంది. శ్రావస్తిపట్టణ సామంతరాజైన పంచవర్ణుడు రెండు గాయపడిన క్రౌంచపక్షులకు చికిత్సచేసి నయంచేశాడు. దానికిగాను వృద్ధుడైన ఆ రాజు కోరికమేరకు ఆకాశంలో విహంగంలా విహరించే కోరిక ప్రసాదిస్తూ, దానికి తగిన మంత్రాన్ని క్రౌంచపక్షులు ఉపదేశించాయి. ఈ మంత్రం ఆకాశం మేఘావృతమైనపుడు పఠించాలని, అంతేకాకుండా ఈ మంత్రాన్ని తన భార్యతోసహా ఎవరికీ చెప్పరాదని షరతు విధించాయి. నియమం ఉల్లంఘిస్తే ఆపద కలుగుతుందని హెచ్చరించాయి.

ఒకనాడు ఆకాశం మేఘావృతమై ఉండగా పంచవర్ణుడు మంత్రోచ్చారణ చేయగా మనోహరమైన, అందమైన పక్షిగా మారిపోయి ఆనందంగా గెంతులు వేస్తూండగా అతని భార్య చూసి మంత్రం తనకూ చెప్పమని వేధించగా, ఆమె బాధ పడలేక ఆ రాజు ఆ మంత్రాన్ని ఆమెకు ఉపదేశించాడు.

ఇది తెలిసి ఆ మంత్ర అధిష్ఠానదేవత అతని భార్యకు బుద్ధి చెప్పాలనుకుని కారుమేఘాలను సృష్టించి వాతావరణాన్ని ఆనందమయం చేసింది. ఆ సమయంలో ఆ రాజుభార్య ఆ మంత్రం జపించి అతి సుందరమైన పక్షిగా మారిపోతున్నాననే భావనలో "అతిసుందరః" అనబోయి "అసుందరః"అనడంతో ఆమె ఆ మంత్రాన్ని తప్పుగా పలికినందుకు, ఆమె పింఛం లేని ఆడనెమలిగా మారిపోయింది. తమకిచ్చిన వాగ్దానాన్ని తప్పినందుకుగాను ఆ క్రౌంచపక్షులు ఆ రాజుని శాశ్వతంగా మగనెమలిగాను, భార్యను ఆడనెమలిగాను మారిపొమ్మని శపించాయి. మాట తప్పిన రాజదంపతులు అప్పటినుంచి మగ, ఆడనెమళ్ళుగా ఉండిపోయాయి. వాగ్దానభంగం చేసినట్లయితే తగిన మూల్యం చెల్లించక తప్పదని మనకు ఈ కథనంవలన తెలుస్తుంది.

నెమలి జన్మించినసమయంలో వాటి ఈకలు మొరటుగా ఉండేవి. ఒకసారి ఇంద్రుడు లంకాధిపతియైన రావణునితో యుద్ధం చేసేసమయంలో తన ఈకలను విప్పి ఇంద్రుని రక్షించింది. అందుకు సంతోషించిన ఇంద్రుడు నెమలికి అందమైన ఈకలను ఇచ్చాడని పురాణకథనం. ఇతరులకు సహాయం చేయడం, మంచిపనులు చేయడంవలన మనకుకూడా మంచి జరుగుతుందని గ్రహించవచ్చు.

నెమలి స్వభావాన్ని పరిశీలించినట్లయితే, కొన్ని ఆసక్తికరమైన విషయాలు మనకు తెలుస్తాయి. తనను తాను కాపాడుకోవడంలో నెమలికి అమోఘమైన తెలివితేటలు ఉన్నాయి. ఇది తన శత్రువుల ఎత్తుగడలను ముందే పసిగట్టి వాటిని ఎదుర్కోవటంలో ఎంతో చురుకుదనాన్ని ప్రదర్శిస్తుంది. ఎంతటి విషాన్నైనా హరించే శక్తి దీనికి ఉంది. ఎందుకంటే ఇది పాములను ఆహారంగా తీసుకుంటుంది మరి.

నెమలి స్వభావాన్ని మనం మానవజీవితానికి అన్వయించుకుంటే, అనేక ఉపయోగకరమైన విషయాలు తెలుస్తాయి. నిజజీవితంలో ఎదురయ్యే శత్రువులను సమర్ధవంతంగా ఎలా ఎదుర్కోవాలో తెలుస్తుంది. మరియు దుష్ట స్వభావాలు కలిగిన వ్యక్తులను అణచివేస్తూ, వారి పరిచయాల నుండి దూరంగా ఉండాలని సూచిస్తుంది. అటువంటి తెలివి తేటలు మానవులుకూడా పెంపొందించుకుంటే జీవితంలో విజయం సాధించవచ్చు. బాహ్యసౌందర్యంతో మోసపోకుండా అంతర్గతంగా ఉండే అలవాట్లు, భావాలు తెలుసుకోవాలి, ఎందుకంటే పైకి అందంగా కనిపించే నెమలి విషపూరితమైన

పాములనుకూడా ఆహారంగా స్వీకరిస్తుంది. నెమలి కంఠస్వరం కూడా ఎంతో కరకుగా ఉంటుంది. ఇది స్వరూపానికి, మాటకు గల వ్యత్యాసాన్ని సూచిస్తుంది. ఇటువంటి రహస్యవిశేషాలు కలిగిన నెమలిని తన వాహనంగా చేసుకుని సుబ్రహ్మణ్యస్వామి లోకానికి అమూల్యమైన సందేశాన్ని ఇస్తూ, వారి జీవితాలను విజయమార్గంలో పయనించేలా మార్గనిర్దేశం చేశారు.

నెమలి ఆకారం ప్రధానంగా అందం, గర్వం, వినయం, సంతృప్తివంటి పాఠాలు నేర్పుతాయి. నెమలి తన అందమైన ఈకలవల్ల గర్వపడి ఇతర పక్షులను చిన్నచూపు చూసినప్పుడు, తనలోని లోపాలైన బొంగురుగా పాడటం లేదా ఎగరలేకపోవడంవంటి విషయాలు తెలుసుకుని పశ్చాత్తాప పడుతుంది. భగవంతుడు మనకు ఇచ్చినవాటితో ఆనందంగా, సమాజ హితకరంగా జీవించాలని అర్థం అవుతుంది. నెమలిఈకలు అందంగా ఉంటాయి. కొంగఈకలు సాధారణంగా ఉంటాయి. కాని కొంగ ఎగిరినట్లు నెమలి ఎగరలేదు. అందం అన్ని సమయాల్లోనూ అక్కరకు రాదు అనే విషయాన్ని గ్రహించాలి. అలాగే కాకులమధ్య ఉండే ఐకమత్యం నెమళ్ళమధ్య ఉండదు. దీనివలన ఆకారం ప్రధానం కాదు, గుణం ప్రధానం అని అర్థమవుతుంది.


సాధారణంగా నెమలి జగడాలమారి. ఇతరపక్షులతో అంత త్వరగా కలవదు. ఈ విషయాన్ని తెలియచేసే కథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది. ఒక ప్రదేశంలో ఒక ఆడనెమలి, మగనెమలి చక్కగా, సంతోషంగా జీవిస్తున్నాయి. ఒకరోజు ఆడనెమలి మరొక ప్రదేశానికి వెళ్ళిపోదాం. అక్కడ చాలా నెమళ్ళు ఉంటాయి వెళ్ళిపోదాం అని పట్టుపట్టింది. ఇక్కడ మనం హాయిగా సంతోషంగా జీవిస్తున్నాం. ఇక్కడే ఉందాం. అక్కడ రోజూ మిగిలిన నెమళ్ళతో మనం గొడవ పడలేం. వద్దు ప్రశాంతంగా ఉన్నాం కదా అని మగనెమలి భావన. ఎంత నచ్చచెప్పినా ఆడనెమలి వినకపోతే ఇక తప్పనిసరై రెండూ అలా అలా ఎగురుకుంటూ నెమళ్ళగుంపును చేరుకున్నాయి. అక్కడ అనేకపక్షులుకూడా ఉన్నాయి. నివాసస్థలం మారాక, నవ్వుతూ, తుళ్ళుతూ హాయిగా ఉండే ఆ జంట ప్రతి చిన్నవిషయానికి



గొడవపడటం మొదలుపెట్టాయి. అవి తారాస్థాయికి చేరుకున్నాయి. భరించలేక ఒకసారి మగనెమలి నీ పంతంవలన ఇక్కడికి వచ్చి కష్టపడాల్సి వస్తోంది. దేనికైనా పట్టు, విడుపు అనేవి ఉండాలి. అంచనా ఉండాలి. ఇక్కడ అనేకమందిలో మనం ఒక జంట. అక్కడ విశాలమైనప్రాంతంలో మనం స్వేచ్ఛగా జీవించే అవకాశం ఉంది. ఆ విషయం నువ్వు అర్థం చేసుకోక ఇక్కడ స్వర్గం ఉందనుకున్నావన్న ఈ కథవల్ల నెమలి జగడాలతత్త్వం అర్థం అవుతుంది. మూర్ఖత్వం, మొండిపట్టు, పట్టుదల విడనాడకపోతే బాధపడవలసి వస్తుంది అని తెలుసుకోవాలి.

ఇక్కడ మనం ఒక విషయం పరిశీలిద్దాం. సుబ్రహ్మణ్యస్వామికి వాహనమైన నెమలియొక్క పింఛాన్ని శ్రీకృష్ణుడు ధరించాడు. దానికి అనేక కారణాలు కనిపిస్తాయి. వాటిని క్లుప్తంగా పరిశీలిస్తే.... నెమలి పింఛము మానసికప్రశాంతత, సత్యం, ధర్మం, మరియు న్యాయానికి ప్రతీక అని భావిస్తారు. ఇది ప్రతికూలస్థితులను నివారిస్తుంది. నెమలిపింఛము సప్తవర్ణసమాహారం. ఇది లోకరీతులకు చిహ్నం. శ్రీకృష్ణుడు లోకనాయకుడు. సకల చరాచరసృష్టి ఆయనలోనే ఇమిడి ఉంది. అన్నిరకాల గుణగణాలు ఆయననుండే ఉద్భవించాయి. దీనికి సంకేతమే నెమలిపింఛము. నెమలి చనిపోయిన తరువాతకూడా పింఛము సజీవంగా ఉంటుంది. కృష్ణతత్త్వంకూడా ఈ సృష్టి ఉన్నంతవరకు ఉంటుంది. నెమలిపింఛము మాయకు ప్రతిరూపం. శ్రీకృష్ణుడు పింఛాన్ని తన అలంకారంగా ధరించి, మాయను తన అధీనంలో ఉంచుకుంటాడు. నెమలి కంఠస్వరం క్రేకారంలాగా ఉంటుంది. మన యోగసాధన బ్రహ్మరంధ్రానికి చేరినట్లయితే మనకు వినిపించే స్వరం క్రేంకారం. ఈ సంకేతానికి గుర్తుగా శ్రీకృష్ణుడు నెమలిపింఛాన్ని ధరించాడు. నెమలిపింఛము దృష్టిదోషాన్ని హరిస్తుంది. కృష్ణుని చిన్నతనంలో ఆయనకు దృష్టిదోషం తగలకుండా యశోదాదేవి కృష్ణునితలపై నెమలిపింఛాన్ని ధరింపచేసింది. అమ్మపైగల ప్రేమతో శ్రీకృష్ణుడు పింఛాన్ని ధరిస్తూ ఉంటాడు. ఎన్నో అద్భుతరహస్యాలు తనలో కలిగియున్న నెమలి సుబ్రహ్మణ్యునికి వాహనంగాను, దాని పింఛము శ్రీకృష్ణునికి అలంకారంగాను శోభిల్లుతోంది.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

**తెనుగు అనువాదకులు:**
**కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,**
**కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు**

*(గత సంచిక తరువాయి భాగం...)*

(శ్రీమణవాళ మహామునుల (వరవరమునుల) శిష్యులైన అష్టదిగ్గజపండితులు)

వానాద్రియోగివర వేంకటయోగివర్య
శ్రీభట్టనాథముని వాది భయంకరార్యాః,
రామానుజార్య వరదార్య నతార్తిహారి
శ్రీదేవరాజ గురవో-ష్టదిశా గజాస్తే.

(వానాద్రియోగివరులు (వానమామలై జియ్యరు), వేంకటయోగివర్యులు (తిరువేంగడ రామానుజజియ్యరు), శ్రీభట్టనాథమునులు (పరవస్తు భట్టర్ పిరాన్ జియ్యరు), వాది భయంకరార్యులు (ప్రతివాది భయంకరం అణ్ణా), రామానుజాచార్యులు (అప్పిళ్లై), వరదార్యులు (కోయిల్ కందాడై అణ్ణన్), ప్రణతార్తిహరులు (కిడాంబి అప్పుళ్లాన్), శ్రీదేవరాజగురువులు (ఎఱుంబియప్పా)).

మార్కండేయపురాణమున శ్రీవేంకటాచలమాహాత్మ్య ఘట్టమున –

వైకుంఠలోకా దగ్గరుడేన విష్ణో క్రీడాచలో వేంకటనామధేయః,
ఆనీయ స స్వర్ణముఖీసమీపే సంస్థాపితో విష్ణునివాసహేతోః.

(శ్రీమన్నారాయణునియొక్క వేంకటమను పేరుగల క్రీడాచలము గరుడునిచేత విష్ణులోకమునుండి తీసికొనిరాబడి విష్ణుమూర్తి నివసించుటకై స్వర్ణముఖిసమీపమున స్థాపింపబడినది.)

అనియు,

వైకుంఠా దాగతత్వాచ్చ వైకుంఠాద్రి రితి స్మృత్ణః.

(వైకుంఠమునుండి వచ్చినదగుటచేత వైకుంఠాద్రియని పేర్కొనబడుచున్నది.)

శుకాద్యా మునయ్ణ కేచిత్ భృగ్వాద్యాశ్చ తపోధనాః,
ప్రహ్లాదప్రముఖ్ణా పుణ్యా అంబరీషాదయో నృపాః.
విష్ణోరేవాపరం దేహం షున్వానాస్తం నగోత్తమమ్,
పద్భ్యా మాక్రమితుం భీత్ణా పర్యంతేష్వేవ వర్తినః.
తన్నిర్గత నదీష్వేవ కుర్వాణ్ణా స్నానతర్పణే,
తపః కుర్వంతి వాంఛంత్ణ సాక్షాత్కర్తుం జనార్దనమ్.

(శుకుడు మున్నగు మునులు, భృగువు మొదలగు తపోధనులు, ప్రహ్లాదుడు మొదలైన పుణ్యులును (భక్తులును), అంబరీష ప్రభృతులైన నరపతులును ఆ పర్వతశ్రేష్ఠమును శ్రీమన్నానారాయణుని మూర్త్యంతరమేయని తలచుచున్నవారై పర్యంతములందే నివసించుచున్నవారై ఆ కొండనుండి జాలువారెడు నదులందే స్నానములను, తర్పణములను చేయుచున్నవారై శ్రీహరిని సాక్షాత్కరించుకొన గోరుచున్నవారై తపమొనర్చుచున్నారు.)

(ఇంకా ఉంది)


గెలవకపోవటం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవటమే ఓటమి

## శ్రీవేంకటేశ్వరలీలలు



# కలయో వైష్ణవ మాయో!!

- శ్రీమతి భీమ రజిని

నేను శ్రీవారిసేవకు మా గ్రూపుతోసహా బయలు దేరడం జరిగింది. అలా స్వామిసేవలను రోజు చేసుకుంటూనే వైకుంఠఏకాదశిరోజు సేవ ముగించుకుని నేను మా గ్రూపు సభ్యులందరం స్వామివారిని దర్శించుకుని ఉత్తరద్వారం అనే ఆ మోక్షమార్గంనుండి వెళ్లడం జరిగింది. ఇంతటి భాగ్యాన్ని మాకు ప్రసాదించావా స్వామి అని అనుకుంటూనే అందరం సేవాసదనం వచ్చేశాం.

మరుసటి రెండురోజులకి స్వామివారి వార్షిక ఉత్సవాలలో జరిగే ప్రణయకలహమహోత్సవంరోజు వచ్చింది. మాకు అక్కడ ఉన్నవాళ్లు చెప్పడంతో ఏలాగైనా సరే ఆ ఉత్సవం చూసుకోవాలని అనుకున్నాం. అలా అనుకున్నామో లేదో ఆ రోజు మాకు ఏకాంతసేవకు అనుమతించడం జరిగింది.

ఇదిలా ఉండగా ప్రణయకలహమహోత్సవం చూడ డానికి మాడవీధులకి వెళ్ళడం జరిగింది. మేము సేవచేసే డ్రెస్ కోడ్‌లో ఉన్నందుకు అక్కడ సిబ్బంది మమ్మల్ని స్వామివారి ఊరేగింపుత్రాడును లాగమని పురమాయించారు. అలా త్రాడును నేను మా గ్రూపులో అందరం ప్రక్కప్రక్కనే ఉండి లాగుతున్నాం.

### ఫిబ్రవరి నెల క్విజ్-43 సమాధానాలు

| | |
|---|---|
| 01) మాఘస్నానం చేసినవారికి | 08) కందాడై రామానుజయ్యంగార్ |
| 02) శివుడు | 09) సోమనంది |
| 03) చిదంబరేశుడు | 10) భక్తిసారులు |
| 04) కులశేఖరుడు | 11) మొగిలిపువ్వు |
| 05) నాలాయిర దివ్యప్రబంధం | 12) కూరేశమిశ్రులు |
| 06) విష్ణువు | 13) కూరేశమిశ్రులు |
| 07) మహాకడలి | 14) సంజ్ఞ, సూర్యుడు |
| | 15) విభూతికి |

సరైన సమాధానాలు వ్రాసినవారు-
01)ఆర్.నాగమహిక, హైదరాబాదు, 2)బి.సాధ్విక, శ్రీకాకుళం, 3)కె.హర్షిత్ కుమార్, సిరిసిల్ల 4)కె.భార్గవ్, హైదరాబాదు, 5)ఎస్.వి.వి.సూర్యకార్తికేయ, ఆకివీడు.

**సవరణ:** 31-03-2026కి బదులుగా ఒంటిమిట్ట, శ్రీకోదండరామ స్వామి వారి కల్యాణం 01-04-2026న అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువుగా జరుగనుంది. పాఠకులు గమనించగలరు. **-ప్రధాన సంపాదకుడు**



ఇంతలో అనుకోకుండా వెనకనుండి ఒక బ్రాహ్మణుడు నా పేరుతో పిలిచారు. నేను వెనక్కి తిరిగి చూసి "ఆ" అని పలికాను. తను నన్ను చూసి నవ్వుతూనే ఉన్నాడు. నేను స్వామి! మీకు నా పేరు ఎలా తెలుసు అని పదే పదే అడిగాను. అప్పుడు అతను వాహనంలో ఉన్న స్వామివైపు తన చేతిని చూపిస్తూ "వేంకటేశ్వర్లు చెప్పారు" అని అన్నారు.

ఆ తర్వాత ఏకాంతసేవకు వెళ్లడం జరిగింది. అక్కడ మళ్లీ నా పేరు పిలవడం జరిగింది. ఇదంతా సన్నిధిలో జరిగింది. కలయో! వైష్ణవమాయో! అంటే ఖచ్చితంగా చెప్పగలను. ఇది నా భ్రమ కాదు నా స్వామియే సాక్షాత్క రించాడు. ఖచ్చితంగా ఇది వైష్ణవమాయే అని.



బాలవినోదం

# అక్షరమాల గణేశస్తోత్రం

సేకరణ, నిర్వహణ : మొలకా ఉత్తరఫల్గుణి
చిత్రాలు : డా॥ శ్రీధరన్ కౌలికి

బాలలూ... ఇక్కడున్న గణపతి చిత్రాలతో ఉన్న అక్షరమాల స్తోత్రంను నిత్యమూ పఠిస్తే విద్యలో విజయం తథ్యం.

దీనిని నిత్యమూ పఠించడానికే ప్రత్యేకంగా అందిస్తోంది 'సప్తగిరి' మీ కోసం... పఠిద్దామా మరి.


01) ఓం 'అ'క్షరప్రదాయ నమః
02) ఓం 'ఆ'రోగ్యప్రదాయ నమః
03) ఓం 'ఇ'ష్టసిద్ధిప్రదాయ నమః
04) ఓం 'ఈ'శ్వరపుత్రాయ నమః
05) ఓం 'ఉ'ండ్రకప్రియాయ నమః
06) ఓం 'ఊ'ర్ధ్వ పుండ్రాయ నమః
07) ఓం 'ఋ'షీశ్వరాయ నమః
08) ఓం 'ౠ'కారరూపాయ నమః
09) ఓం 'ఎ'లుకవాహనాయ నమః
10) ఓం 'ఏ'నుగుముఖాయ నమః
11) ఓం 'ఐ'శ్వర్యప్రదాయ నమః
12) ఓం 'ఒ'డయదేవరపుత్రాయ నమః
13) ఓం 'ఓ'ంకారస్వరూపాయ నమః


01


02


03


04


05


06


07


08


09


10


11


12


13


14


27


26


25


15

14) ఓం 'ఔ'షధప్రియాయ నమః

15) ఓం 'అం'తర్యామియే నమః

16) ఓం 'అః'కారరూపాయ నమః

17) ఓం 'క'ల్యాణప్రదాయ నమః

18) ఓం 'ఖ'జానమూర్తాయ నమః

19) ఓం 'గ'జముఖాయ నమః

20) ఓం 'ఘ'నపారియే నమః

21) ఓం 'జ్ఞ'ప్తికారకాయ నమః

22) ఓం 'చ'దువులప్రదాయ నమః

23) ఓం 'ఛ'త్రపత్రాయ నమః

24) ఓం 'జ'పకారకాయ నమః

25) ఓం 'ఝ'రిప్రియాయ నమః

26) ఓం 'ఞ'ంగీతజ్ఞానప్రదాయ నమః

27) ఓం 'ట'ంకారధ్వనిప్రియాయ నమః


24


16


23


17


22

18



19



20



21




28


41


40


39


29

28) ఓం 'ర'కారరూపాయ నమః

29) ఓం 'డ'మరుకనాదప్రియాయ నమః

30) ఓం 'ఢ'మఢమధ్వనికారకాయ నమః

31) ఓం 'ణ'కారరూపాయ నమః

32) ఓం 'త'పస్వినే నమః

33) ఓం 'థ'కారరూపాయ నమః

34) ఓం 'ద'ండనస్వామినే నమః

35) ఓం 'ధ'ర్మదేవతాయ నమః

36) ఓం 'న'మస్కారప్రియాయ నమః

37) ఓం 'ప'ండితాయ నమః

38) ఓం 'ఫ'లపుష్పసంకాశాయ నమః

39) ఓం 'బ'లాధ్యక్షాయ నమః

40) ఓం 'భ'గవత్స్వరూపాయ నమః

41) ఓం 'మ'హోదరాయ నమః


38


30


37


31


36


32


33


34


35








42) ఓం 'య'జ్ఞదేవతాయ నమః

43) ఓం 'ర'క్షోజనాధ్యక్షాయ నమః

44) ఓం 'ఱ'కారరూపాయ నమః

45) ఓం 'ల'ంబోదరాయ నమః

46) ఓం 'ళ' కారరూపాయ నమః

47) ఓం 'వ'క్రతుండాయ నమః

48) ఓం 'శ'ంకరపుత్రాయ నమః

49) ఓం 'ష'ణ్ముఖసోదరాయ నమః

50) ఓం 'స'త్త్వగుణప్రదాయ నమః

51) ఓం 'హ'రపుత్రాయ నమః

52) ఓం 'క్ష'మాదేవతాయ నమః

53) ఓం 'తెలుఁగు'భాషప్రియాయ నమః


54) ఓం 'అహం'కారధ్వంసినే నమః

55) ఓం 'అంతః'కరణప్రదాయ నమః








చిత్ర కథ


# తృప్తికి మించిన ఐశ్వర్యం లేదు!!


కథ - మొలకా ఉత్తరఫల్గుణి

తమిళమూలం- శ్రీమతి శ్రీనిధి

చిత్రాలు- శ్రీ కమలకణ్ణన్



కటికనేలపై శయనించడం
సంపదలు: కమండలం, దండము, భిక్షాపాత్ర మరియు చిన్నసంచీ మాత్రమే
సంపద అంటే ఏమిటో తెల్పండి స్వామీజీ!
సంతృప్తిగా జీవించడమెలాగో తెల్పండి స్వామీజీ!
అలాగేనంటూ... అందరికీ చెప్పడానికి సిద్ధమయ్యాడు స్వామీజీ!
ఉన్నదానితో సంతోషంగా ఉండడమే నిజమైన సంపద. తృప్తిని కల్గి ఉండటమే గొప్ప ఐశ్వర్యం.
మనకు ఉన్నదాంట్లో ఇతరులకు సహాయం చెయ్యడం. ఇలా నడుచుకుంటేనే మీ జీవితాలు సుఖంగా ఉంటాయి.
నీతి: 'తృప్తికి మించిన ఐశ్వర్యం లేదు', 'సంతోషానికి మించిన ఐశ్వర్యమూ లేదు' అనేదే పై కథానీతి.

# క్విజ్ 45

01) 'శిరుత నవ్వులవాడు' కీర్తన కవి? జ)..........

02) అక్షయతృతీయనాడు నృసింహస్వామికి జరిగే సేవ? జ)..........

03) ఆకాశరాజు పద్మావతికి ఎవరితో వివాహం చేశాడు? జ)..........

04) లోకకల్యాణంకోసం విష్ణుమూర్తి ఎత్తిన అవతారాలెన్ని? జ)..........

05) మురుగన్ మహిమాన్విత క్షేత్రం? జ)..........

06) దమయంతి తండ్రి? జ)..........

07) భృగుమహర్షిని సందర్శించిన మహర్షి? జ)..........

08) సంకటహరచతుర్థి వ్రతాచరణ స్వామి? జ)..........

09) సుబ్రహ్మణ్యస్వామి ధ్వజంపై ఉన్న గుర్తు? జ)..........

10) శునకంలో విఠలుని దర్శించిన భక్తుడు? జ)..........

11) హిడింబి, భీమసేనుల కుమారుడు? జ)..........

12) మనునీతిచోళుని కుమారుడు? జ)..........

13) వేలాయుధపాణి? జ)..........

14) కర్ణునికి రెండు వరాలిచ్చినవారు? జ)..........

15) ప్రణవాక్షర 'ఓంకారం'లా ఉండే పక్షి? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-04-2026**.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# ఏప్రిల్, 2026 రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** ఆలోచనావిధానంలో మంచి మార్పు వస్తుంది. భోగభాగ్యాలు, సుఖసౌఖ్యాలు అనుభవిస్తారు. స్త్రీ మూలక ధనం వస్తుంది. మాసారంభంలో కలత, ఆకస్మిక ధనలాభం వస్తుంది. వృత్తి, వ్యాపారాలు అనుకూలం.

**వృషభం–** మాసారంభంలో ధనవృద్ధి, సుఖసౌఖ్యాలు, ఆనందగృహజీవనం. చేతినిండా ధనం, పుష్కలమైన ఆరోగ్యము. విద్యార్థులకు ఉత్తీర్ణత, పోటీపరీక్షల్లో జయం.

**మిథునం–** ఉన్నత ఆలోచనలు, కళత్ర సౌఖ్యం, సంతానం చేతికి అందివచ్చుట, నిరంతర గ్రంథ పఠనం, భావవ్యక్తీకరణ అలవడుతాయి. ఉన్నత వ్యక్తులతో పరిచయాలు. వారికి మీ మేథోసంపత్తిని పంచగలుగుతారు. వ్యాజ్యాలు కలిసివస్తాయి.

**కర్కాటకం–**అవివాహితులకు వివాహ శుభయోగం, వైవాహికజీవితం సంతోషం, వీరి జీవితభాగస్వామికికూడా అన్ని రంగములలోనూ పురోగతి ఉంటుంది.

**సింహం–** వ్యవహార ప్రతిబంధక జయం. మిశ్రమ ఆరోగ్యము, ధనవ్యయం, వీరిపట్ల బంధువులు ఆదరణగా ప్రేమపూర్వకముగా ఉంటారు. ఐ.టి. సంబంధ ఉద్యోగములలో పనిచేయువారు నేతృత్వము కలిగివుంటారు.

**కన్య–** కొత్త ఇల్లు లేదా వాహనాన్ని కొనుగోలు చేస్తారు. విదేశీప్రయాణం మొదలైన సుదూర ప్రయాణాలు కలిసివస్తాయి. ఈ సమయంలో జ్ఞానసముపార్జన చేస్తారు. మతపరమైన మరియు ఆధ్యాత్మిక రంగాలలో ముందంజ వేస్తారు.

**తుల–** జీవనంలో పురోగమనము, ధైర్యము, అప్రయత్నంగా కార్యసిద్ధి, గృహమున శుభయోగములు. నూతనవ్యక్తులతో పరిచయం, స్నేహంవలన ఉపయోగం. స్నేహితులను గౌరవిస్తారు. వ్యవసాయదారులకు ధనధాన్యవృద్ధి లాభములు.

**వృశ్చికం–** స్వస్థత, ధనాదాయం, ఉద్యోగవృద్ధి, అదృష్టవంతమైన కాలం. ప్రయత్న సఫలం. కోర్టు వ్యవహారాలలో ఇతరులపై పట్టు సాధిస్తారు. కార్యజయం.

**ధనుస్సు–** సుదీర్ఘ వ్యాజ్యాలలో పరిష్కారం. తోబుట్టువులతో సత్‌సంబంధాలు. గట్టి సంకల్ప శక్తి, ఉద్యోగులకు జీతం పెంపుదల అవకాశాలు వస్తాయి.

**మకరం–** మంచి లాభాలు, సంపదను పెంచుకుంటారు. సంతోషకరమైన జీవనం. ప్రయత్న సఫలం. ప్రతి చిన్న విజయం కొండంత విశ్వాసాన్ని, శక్తిని ఇస్తుంది.

**కుంభం–** గతంలో పెట్టిన పెట్టుబడులు కలిసి వస్తాయి. సమస్యలు పరిష్కారం. వాగ్వివాదాలను నివారించాలి. గృహసౌఖ్యం కలుగుతుంది. దైవబలం ఉంది.

**మీనం–** అనుకూలమైన జీవితభాగస్వామి లభించి వారినుండి సహాయసహకారాలు అందుకుంటారు. వివాహజీవితం సుఖమయం. వ్యాపారం చేయాలన్న కోరిక ఉన్నప్పటికీ ఉద్యోగములోనే స్థిరపడతారు. అన్నింటా సఫలీకృతం అవుతారు.

నీ ఆత్మవిశ్వాసం, నీ శక్తి, నీ కష్టం ఇవే నీ విజయానికి పునాదులు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................... తేది :..................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

123

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ■ | ■ | 2 | | 3 | ■ | ■ | ■ |
| | ■ | ■ | | ■ | 4 | | 5 | |
| 6 | | 7 | | ■ | | ■ | | ■ |
| | ■ | | ■ | ■ | | ■ | 8 | |
| ■ | 9 | | | | ■ | 10 | ■ | ■ |
| ■ | | ■ | ■ | ■ | 11 | | | |
| 12 | | | | | ■ | | ■ | ■ |
| ■ | | ■ | ■ | ■ | 13 | | | ■ |
| ■ | ■ | 14 | | | ■ | | ■ | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 2)అరిషడ్వర్గాలలో ఒకటి(3); 4)చదువులతల్లి(4); 6)చైత్రబహుళఏకాదశి(4); 8)మోక్షము(2); 09)విష్ణుమూర్తి(4); 11)శ్రీరామునికొడుకు కుశుడు నిర్మించిన నగరము(4); 12)శ్రీకృష్ణుడు ఇతడు చేసిన నూరు తప్పులను క్షమించి పిదప తన చక్రాయుధంతో చంపాడు(5); 13)శివుడు(3); 14)ధరణీదక్షులకుమార్తె(3)

**నిలువు** 1)ఆకాశరాజుకూతురు(4); 2)వైశాఖశుద్ధఏకాదశి(3); 3)యాదవకులనాశనానికి కారణం(4); 5)కల(3); 7)హవిర్ధానునిభార్య(3); 9)పురూరవుని పుత్రుడు జనమేజయునికుమారుడు(4); 10)శ్రీరాముని కుమారులు(5)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D., P.G.Diploma in JMC

# శ్రీ కోనేటిరాయస్వామివారి బ్రహ్మోత్సవం, కీలపట్ల

## 2026, ఏప్రిల్ 23 నుండి మే 03 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 23-04-2026 | గురు | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 24-04-2026 | శుక్ర | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 25-04-2026 | శని | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 26-04-2026 | ఆది | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 27-04-2026 | సోమ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 28-04-2026 | మంగళ | పల్లకీలో మోహినీఅవతారోత్సవం | గరుడవాహనం |
| 29-04-2026 | బుధ | హనుమద్వాహనం, సాॱవసంతోత్సవం | గజవాహనం |
| 30-04-2026 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 01-05-2026 | శుక్ర | రథోత్సవం | అశ్వవాహనం |
| 02-05-2026 | శని | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం,చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |
| 03-05-2026 | ఆది | పుష్పయాగం | |



# శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం, తిరుపతి

## 2026, మే 22 నుండి 31 వరకు



| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 22-05-2026 | శుక్ర | --- | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ |
| 23-05-2026 | శని | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 24-05-2026 | ఆది | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 25-05-2026 | సోమ | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 26-05-2026 | మంగళ | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 27-05-2026 | బుధ | పల్లకీలో మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 28-05-2026 | గురు | హనుమద్వాహనం, సాॱవసంతోత్సవం | గజవాహనం |
| 29-05-2026 | శుక్ర | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 30-05-2026 | శని | రథోత్సవం | అశ్వవాహనం |
| 31-05-2026 | ఆది | పల్లకీ ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-03-2026 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.

